
ఆంధ్రసచిత్రవార

పత్రిక

9-12-66





తప్పక చూడండి
బి.ఏ.యస్ వారి
మోహినీ భస్మాసుర
నవయుగ
నిర్మాత. దర్శకుడు: బి.ఏ.సుబ్బారావు. * * సంగీతం: యస్.రాజేశ్వరరావు.


రవీంద్ర ఆర్ట్ ప్రొడక్షన్స్
డాక్టర్ ఆనంద్
స్క్రీన్‌ప్లే & దర్శకత్వం
వి.మధుసూదనరావు
నిర్మాత
డి.వి. రెడ్డి
ఆంధ్ర: రాయల్ ఫిలిమ్స్
సీడెడ్: జయలక్ష్మి
నైజాం: యస్.యస్.ఎ.పి.

ఆంధ్రసచిత్ర వారపత్రిక

వ్యవస్థాపకులు :
దేశోద్ధారక కాశీనాథుని
నాగేశ్వరరావు పంతులుగారు

శుక్రవారం : 9—12—'66

పరాభవనామ సం॥ కార్తీకమాసం॥ బ॥ ద్వాదశి

సంపుటము : 59 సంచిక . 13

*

స్థాపితము :
1908

*

ముఖ్య సంపాదకుడు :
శివలెంక శంభుప్రసాద్

*

సంపాదకుడు :
శివలెంక రాధాకృష్ణ

ఆంధ్రపత్రిక కార్యాలయము
7, తంబుచెట్టి వీధి, మద్రాసు-1

చందా వివరాలు :

భారతదేశం

	పోస్టుద్వారా రూ. పై.
సంవత్సర చందా	19.25
6 మాసముల చందా	9.62
3 మాసముల చందా	4.80

ఇతర దేశాలకు

ఓడమీద (Sea Mail)

సంవత్సర చందా	32.00
అర్ధసంవత్సర చందా	16.00

రచయితలకు మనవి

మా కార్యాలయం చేరే ప్రతిరచనతోనూ దానిరచయిత గాని, రచయిత్రిగాని అది తమ స్వంతరచనేననీ, దేనికీ అనుకరణ కాదనీ హామీ వ్రాసి పంపాలి. ఇటువంటి హామీ లేని రచనలను ప్రచురణకి స్వీకరించ లేము.

సంపాదకుడు
ఆంధ్రసచిత్రవారపత్రిక

మనలో మాట

కొన్ని అనివార్య కారణాలవల్ల శ్రీ శ్రీకృష్ణ ఈ వారం తమ మామూలు 'న్యూఢిల్లీ లేఖ' పంపలేకపోయారు కాని ఆయన రాసిన వ్యాసం మరొకటి ఈ సంచికలో వేస్తున్నాము. ఈ వారం చిత్రలహరి ప్రచురించ టానికి వీలులేకపోయింది...

* * *

'రచయితలకి మనవి' అనే శీర్షిక కింద తరచూ రచనలు కాగితానికి ఒక వైపునే రాసి పంపాలని మేము విన్నవించుకుంటున్నప్పటికీ కొందరు ఇంకా రెండుపక్కలా రాసి పంపుతూనే ఉన్నారు! ఉత్తరాల శీర్షికకి కాగితాల మీద రాసేవారు కూడా ఈ నిబంధన పాటిస్తే బాగుంటుంది. కార్డులమీద ఉత్తరాలు రాసేవారు కొందరు వీలయినంత ఇరికించాలనే ఉద్దేశంతో మరీ చిన్న అక్షరాలు రాస్తూ ఉంటారు! ఇవి కంపోసింగ్ చేసేవారికి చాలా ఇబ్బంది కలిగిస్తాయి...

* * *


కార్టూన్ చిత్రకారులు కొందరు 'సంభాషణల'ని మరీ చిన్న అక్షరాలలో రాస్తూ ఉంటారు. ఇటువంటి 'రచనలు' కల కార్టూన్‌లు, చిత్రాలు బాగున్నప్పటికీ, ప్రచురించటం కష్టం!

* * *

సకాలంలో అందనందువల్ల ఈ వారం ఊటమెన్ కార్టూన్ వెయ్యలేక పోతున్నాము...

విషయానుక్రమణిక

ముఖచిత్రం : నటి విజయలలిత (ఫోటో : మోహన్‌జీ జన్)



'ఎన్ని గంటలకొచ్చానో మా ఆవిడితో చెప్పొద్దని నీ కెన్నిసార్లు చెప్పాను ?'

'మీరెన్ని గంటలకొచ్చారో నేను చెప్పలేదండి బాబయ్యా, పొద్దున్న టిఫిన్ తయారు చేస్తుంటే వంటింటి మూలాన గడియారం చూసేం దుకు వీల్లేకపోయిందని అమ్మగారితో చెప్పాను.'

* * *

ఒకడు సినిమాహాల్లో సిగరెట్లు కాలుస్తున్నాడు. గేట్ కీపర్ వచ్చి అతని జబ్బ పుచ్చుకున్నాడు. 'నో స్మోకింగ్' అనే బోర్డు కన్పించడంలేదా, కళ్ళు లేనివాడివి సినిమాకెల్లా వచ్చావు అవటాని గద్దించాడు.

'ఆ బోర్డు చూసే సిగరెట్టు కాలుస్తున్నాను, పొగ లేదన్నారు జాలేసింది. అందుకే వదుల్తున్నాను' అన్నాడు తపీమని.


* * *

జడ్జి : నీ భార్య ప్రమాదకారణంగానే కాల్చబడిందంటావా ?

నిందితుడు : యస్ యువరానర్, నేను ట్రిగర్ నొక్కేప్పటికి మా ఆవిడ మా అత్తగారి ముందు కొచ్చి నిలబడింది.

* * *

ఎద్దొకటి రంకెలేస్తూ అందర్నీ బెదరగొట్టేస్తూ వుంది. అక్కడే పాలు పితుకుతున్న అమ్మాయి మాత్రం కదల్లేదు. చూసీ చూడనట్టే తన పని చేసుకుపోతోంది. రంకెలేస్తున్న ఎద్దు అక్కడిదాకా వచ్చి నెమ్మదిగా నడిచిపోయింది. చుట్టుపక్కల జనం ఆ అమ్మాయిని అడిగారు - 'నువ్వు భయపడలేదా' అని. ఆ అమ్మాయి తాపీగా జవాబిచ్చింది. 'నాకేం భయంలేదు, ఆ ఎద్దుకు ఈ ఆవు అత్తగారు'.



ప్రణాళిక - పరిశ్రమలు

సిమెంటు పరిశ్రమ ప్రభుత్వానికి ఇప్పుడొక సమస్యగా పరిణమించింది. 1971 నాటికి సిమెంటు మిగులు తేలాలని మన అంచనా. అప్పుడు ధరల్ని అదుపులో పెట్టిన అధికోత్పత్తి, ఎగుమతుల్ని సులభ సాధ్యం చేస్తుందని కూడా మన ప్రభుత్వం అనుకొంటూ వుంది. పరిశ్రమ మాత్రం మన అంచనాలకి ఎగబ్రాక లేకపోతోంది. ప్లానింగ్ కమీషన్ వేసిన పథకం ప్రకారం 1971 నాటి అవసరాలను తీర్చలేమని ఈ పరిశ్రమ తన అసమర్థతను వెలిబుచ్చుకుంది. మరోవిధంగా చూస్తే కొరత పరిస్థితి అనేది పరిశ్రమలకి లాభదాయకమైందే మరి. సిమెంటు మీద కంట్రోళ్లను తొలగించడానికి అవసరమైన చర్చలు జరిపేందుకు ఇటీవల ఒక సమ్మేళనం ఏర్పాటైంది. అందులో విదితమైన విషయాలివి.

నాల్గవ ప్రణాళిక అంచనాల ద్వారా 1965—66లో వున్న కోటి ఇరవై లక్షల టన్నుల సిమెంటు ఉత్పత్తి 1970—71 నాటికి రెండుకోట్ల ముప్ఫయిలక్షల టన్నులు కావాలి. కాని ఈఅభివృద్ధి నాల్గవ ప్రణాళికలో రెండుకోట్ల టన్నులుగా చూపబడింది. ఈమధ్య జరిగిన చర్చల్లో వెల్వడిన సారాంశమేమిటీ అంటే 1971 నాటికి మరో ఏభై లేక డెబ్బయి లక్షల టన్నులు మాత్రమే అధికోత్పత్తి లేదా అభివృద్ధి కనిపిస్తుందీ అని.

మరో వైపునుంచి ఈ పరిశ్రమ సిమెంటు ధర పెంచండని మొత్తుకుంటూ వుంది. డబ్బు గురించిన సమస్య ఈచర్చల్లో ప్రధానాంశమైపోయింది. పరిశ్రమను అభివృద్ధి పరచుకోడానికి ప్రభుత్వం నుంచి అప్పు క్రింద లభించే నూరుకోట్ల రూపాయలు చాలడంలేదని, తక్కిన నూరుకోట్ల రూపాయిలు పరిశ్రమలే భరించాలనడం సబబుగా లేదని వివిధ సిమెంటు పరిశ్రమలు ఫిర్యాదు చేశాయి. ఇక్కడ మళ్లీ భేదాభిప్రాయాలు లేచాయి. ప్రభుత్వ సహాయం నియమితమైపోయి వున్నందున తమ పరిశ్రమల్ని విస్తృతం చేసుకోడానికి, అనుకున్న మేరకు ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించడానికి వీలు లేకపోతోందని పరిశ్రమకు చెందిన వివిధ సంస్థలు పేర్కొన్నాయి.

అందుకోసం పరిశ్రమలు తమ తమ అభివృద్ధి పథకాల్ని ప్రభుత్వానికి సమర్పించినట్టయితే వాటిని సమాలోచించి వీలైనంత సహకారం అందించేందుకు సిమెంటు ధర పెంపు చేసేందుకు ఆలోచిస్తామని ప్రభుత్వం అన్నది. ఇందువల్ల ఈ పరిశ్రమకేం మేలు జరుగుతుందో ఎదురు చూడాల్సిందే.

ఎగుమతులు - అవకాశాలు

1967వ సంవత్సరం మనదేశానికి చాల క్లిష్టమైనది. దేశంలోని బంగారం, ఇతర నిధులు కాకుండా 36 కోట్ల డాలర్ల పరపతితో మన ఆర్థిక సంవత్సరం మొదలైంది. నిధుల నలావుంచి, ప్రాజెక్టులను మినహాయించిన తక్కిన పథకాల కోసం 18 కోట్ల డాలర్లను అప్పుగా సేకరించి వున్నది. నవంబరు నుంచి మార్చిలోగా 12 కోట్ల నుంచి 15 కోట్ల వరకు తీసుకోవడమూ అయింది. 1967—68 ఆర్థిక సంవత్సరం ఇరవై కోట్ల డాలర్ల నిల్వతో మాత్రమే ఆరంభమవుతుంది. గారికల్లా మొదలు వేలున్నదనే సామెతకు తగిన సమస్య ఇది. 1967లో మనకు లభించే సహాయం తొంభై కోట్ల డాలర్లు. ఇవిగాక ఇతరమైన ఖర్చులేవైనా తగిలినట్టయితే ఎగుమతుల నధికం చేయడం ద్వారా గాని, దిగుమతుల్ని కుదించుకపడం ద్వారా గాని ఈ ఒత్తిడికి తట్టుకోగలిగి వుండాలి.

ఎగుమతుల పరిస్థితి చూద్దామా అంటే, దానికీ అంత ఎక్కువ అవకాశాలు కనిపించడం లేదు. 1966 జూన్‌లో రూపాయి విలువ తగ్గించినా, జూన్, జూలై నెలల్లోని సంఖ్యలు అనుకున్న మేరకు సంతృప్తికరంగా లేవు. ఆగస్టు నెలలో ఎగుమతుల అభివృద్ధి బాగా కనిపించింది. ఆ తర్వాత చేసిన కొన్ని సవరణల ఫలితంగా మళ్లీ సెప్టెంబరు నెలలో నిరుత్సాహంగానే వుంది. వాణిజ్యమంత్రిగారి రాజీనామాను పురస్కరించుకొని ఎగుమతుల మీది కొన్ని ఆంక్షలు సవరింపబడతాయని ఎగుమతిదార్లు కనిపెట్టుక్కూర్చున్నారు. మంత్రివర్గం పునర్విభజన ద్వారా ఈ విషయమై ఎటువంటి సత్ఫలితాలు కనిపిస్తాయో వేచి చూడాల్సిందే.

భారతదేశం ప్రస్తుత ఆర్థిక విధానాన్ని పరిశీలించిన 'బెల్ మిషన్' సలహా దిగుమతుల మీద ఔదార్యం చూపించడంలేదు. కాని, ప్రాజెక్టుల్ని మినహాయించిన సహాయం 90 కోట్లు దాకా దేశానికి లభించినట్టయితే ఈ పరిస్థితి కొంచెం చక్కబడడానికి అవకాశం వుంటుందేమో.

నౌకానిర్మాణ కేంద్రం

మంత్రుల రాజకీయ సంబంధాలైన వాగ్దానాలు కేంద్రప్రభుత్వాన్ని కుళ్లబొడుస్తున్నాయి. ఇంకా కొనసాగుతున్న విశాఖ ఉక్కు కర్మాగారం ఆంధోళన ఈ రకానికి చెందిందే. కొచ్చిన్‌లో 'షిప్‌యార్డ్' గురించి మరో వాగ్దానం కూడా వుంది.

మాజీ నౌకాశాఖమంత్రి శ్రీ రాజబహదూర్ కొచ్చిన్‌లో 'షిప్‌యార్డ్' స్థాపన గురించిన వాగ్దానానికి కారకులు. ఈమధ్య ఆయన జపాను వెళ్లారు. ఈ ప్రాజెక్టు రిపోర్టులు ఇక్కడ పరిశీలించబడుతున్నాయి. ఆదిలో అనుకున్న దానికీ ఈ రిపోర్టుకీ ఎక్కడా పోలికలు లేవు. ఇది మరో రకమైన ప్రాజెక్టులా వుంది. అంచేత ప్రభుత్వానికిదొక సమస్యగా తయారై వుందిప్పుడు. మొదట ఈ ప్రాజెక్టు 15 కోట్ల

న్యూఢిల్లీ లేఖ

రూపాయల మేరకు పరిమితమై వుంది. 15,000 నుంచి 30,000 టన్నుల నౌకవరకు సంవత్సరానికి మొత్తం 63,000 (జి. ఆర్. టి.) నౌకా ఉత్పత్తి జరగ లనే ప్రాజెక్టు ఇది. కాని ఇప్పుడు అరవై కోట్ల ప్రాజెక్టుగా తయారై కూర్చుంది. అందులో 30,000 టన్నులు, 60,000 టన్నుల టాంకర్లు వెరసి 180,000 (జి. ఆర్. టి.) సంవత్సరం ఉత్పత్తి అని విశదీకరించబడింది.

రూపాయి విలువ తగ్గింపు, ప్రపంచ మార్కెట్లు ధర విపరీతంగ పెరిగిపోవడం ఈ అంచనాలోని మార్పులకు కారణమని సుబోధకం చేశారు.

కేరళకు ఇచ్చిన వాగ్దానాన్ని అట్టేపెట్టి ఈ కొచ్చిన్ నౌకా నిర్మాణసంస్థకు చెందిన పెద్దలు, 'రాకపోక సౌకర్యాల కోసం ఇప్పుడు పెద్దపెద్ద నౌకలు అవసరం, అంచేత నౌకలను, అంతకంటె పెద్ద టాంకర్లను మా కొచ్చిన్‌లో నిర్మించడం అత్యంత అవసరం' అంటున్నారు. ఉక్కుపలకలు, మెరైన్ ఇంజన్లు మన దేశంలోనే గనుక తయారవుతూ వున్నట్లయితే ఈ విధమైన నౌకల్ని, టాంకర్లని తయారు చేసుకోడానికి ఏవిధమైన అభ్యంతరాలూ వుండేవికావు. పోగా, మరింత ప్రోత్సాహం లభిస్తుంది. మొదటి అవసరాల్ని గుర్తించుకొని వాటి ఉత్పత్తికి తగిన పథకాల్ని వేసుకొని సక్రమ ఫలితాలని సాధించడం మంచి పద్ధతి. మనదేశంలో ఇప్పుడు అమలులో వున్న ఇచ్చి పుచ్చుకునే వ్యవహారాల పద్ధతి పరిశీలించి చూసినట్లయితే, ఒక నౌక కొనుగోలు ధరుపూర్తిగా ముట్టజెప్పిన తర్వాతనే దేశానికి విదేశీ మారకద్రవ్యం లాభిస్తుంది.

నౌకా నిర్మాణానికి జపాన్‌ను తప్పించి తదితర దేశాలు ఏవీ సహాయం చేయడానికి అంతగా ముందుకు రావడంలేదు. ఉన్న వాటిల్లోనే సర్దుకుపోతున్నాయి. దేశంలోని ప్రస్తుత ఆర్థిక పరిస్థితి దృష్ట్యా నౌకల్ని కొనుక్కోవడమే ఉత్తమమైన పద్ధతిగా కనిపిస్తూ వుంది. ●






HEWLETT'S MIXTURE

సుప్రభాతం

(సీరియల్)

రంగధామ్

జరిగిన కథ

సత్యమూర్తి, ప్రకాశం చిన్ననాటి స్నేహితులు. చాలా కాలానికి అనుకోకుండా కలిశారు. ప్రకాశం షుగర్ ఫ్యాక్టరీలో చేరడానికి సహకరించాడు సత్యమూర్తి. రాయుడుగార్ని ఎవరో పొడిచి, దాచుకున్నదంతా దోచుకుపోయారు. సత్యమూర్తి చెల్లెలు కళ్యాణి ఎక్కడికో వెళ్ళిపోయింది. అతను తల్లిని తీసుకుని రానవరానికి మకాం మార్చి, షుగర్ ఫ్యాక్టరీలో అక్కౌంటెంటుగా చేరాడు. ఆ చుట్టుప్రక్కల ప్రకాశానికి ఎక్కువ పరపతి వున్నట్లు గ్రహించాడు. సూరప్పుడు పంచాయితీ ఎలక్షన్లో ప్రెసిడెంటయేందుకు ప్రకాశం సహాయం చేస్తున్నాడు. కాలేజీ వక్తృత్వపుపోటీల్లో మొదటి బహుమతినందుకున్న భానుమతి, ఉమ చక్కని స్నేహితురాళ్లయారు.

6

భానుమతి, "ఎందుకు పురోగమించలేం? మతం అంటే మిధ్యాప్రపంచంతో, మూఢాచారాలూ మూఢనమ్మకాలే కన్పిస్తున్నాయి కాని, చక్కని ఆధ్యాత్మిక భావన ఏదీ కన్పించటం లేదు. మనకొక గొప్పజాతి సంపద అని చెప్పుకో దగినదల్లా మన హైందవమత సంస్కృతి, ఆధ్యాత్మిక విలువలూ. దీనిని వదులుకొని, వ్యక్తిత్వపు విలువా, స్వాతంత్రంలేని కమ్యూనిజం వెనకాల పడడం శుద్ధ అనవసరం. అంతేకాదు. అది మన దేశంలో ఎప్పటికీ సాధ్యం కాదని ఘంటా పధంగా చెప్పగలను. మనప్రజల రక్తంలో ప్రతి అణువూ మతాభిమానంతో నిండి వుంది. అదెన్నటికీ నశించదు." అంది.

"అయితే మూఢాచారాలు ఎప్పటికీ నశించవంటారా?"

"అవి ఆట్టేకాలం నిలువవు. కానివాటిని నిరోధించటం కోసంమనం, మతాన్నే వదులుకోనక్కరలేదు. వాటిని ఖండించి మతాన్ని ఆరోగ్యవంతమైనదిగా చెయ్యొచ్చు"

"అదికూడా మతానికి ముఖ్యమేనని నావుద్దేశం."

భానుమతి ఖండించబోయేముందు, అనంత రావుగారు కల్పించుకుని, "కాదోయ్. విజ్ఞానం యొక్క అభివృద్ధిని మనం పరిశీలిస్తే మనకీ విషయం స్పష్టంగా తెలుస్తుంది. పాశ్చాత్య దేశాలలో మతం బాగాప్రాబల్యం వహించి ప్రకృతి గురించీ సృష్టిగురించీ అనేక రకాలైన ఊహల్ని ప్రజలలో వ్యాపింప చేసింది. విజ్ఞాన శాస్త్రం క్రమంగా ఆ ఊహల్ని ఖండిస్తూ వచ్చింది. ప్రకృతిలోవున్న శక్తుల్ని, ఆవిరి, విద్యుచ్ఛక్తి, అణుశక్తి, మొదలైనవాటిని మానవుడికి ఉపయోగ పడేటట్లు చేసింది. మనదేశంలో కూడా 'సైన్సు' వ్యాపిస్తున్న కొద్దీ, మనలోని మూఢ నమ్మకాలన్నీ నశిస్తున్నాయి. కాని ఏ మానవతా విలువలు, సత్యం, అహింస, ధర్మం, కరుణ, త్యాగం, మొదలైనవి మహాత్ములంతా బోధించారో వాటికీ సైన్సుకీ వైరుధ్య మేమీ లేదు. అలాగే భగవంతుడి గురించి కూడా, సైన్సు ఖండించటంలేదు. ఐన్‌స్టీన్ కూడా 'ఈవిశ్వంలోని క్రమపద్ధతిని పరిశీలిస్తూంటేఏదో ఒక శక్తిదీనినివిధంగా ఏర్పరచినట్లు కన్పిస్తోంది' అనికొంతవరకు భగవత్శక్తిని ఒప్పుకున్నాడు. కాబట్టి మన అద్వైత వేదాంతం, ఆధ్యాత్మిక విలువలూ ఉపనిషత్‌విజ్ఞానమూ, మనం వదులుకో వలసినవి కావు. మనం ముఖ్యంగా వివేకానందుడి బోధలు చదివితే ఈ విషయం తెలుసు కుంటాం." అన్నారు.

దీనికి శ్యాంసుందర్ మౌనంగా ఆలోచిస్తూ వూరుకున్నాడు. భానుమతి "స్వామి వివేకానంద అంటే నాకు చాలా గౌరవం మాస్టారూ" అంది. ఆ తరువాత సంభాషణ వివేకానందుడి మీదికి మళ్ళింది. కొద్దిసేపు మాట్లాడాక, అప్పటికే బాగాప్రొద్దు పోయి వుండడం వల్లఅందరూ ఇళ్ళకు వెళ్ళడానికి బయల్దేరారు.

భానుమతి ఇంటికి వెళ్ళే సరికి ఆమె తల్లి ఆమెకోసం ఎదురుచూస్తోంది. "ఏమమ్మాయ్! ఇంత ఆలస్యమైందే?" అని అడిగింది. ఆమెకు ఏభయ్యేళ్ళుంటాయి. తలనెరిసినా, పచ్చని ఛాయతో, సౌమ్యమైన మొహంతో ఆమె చాలా ఆకర్షణీయంగా వుంటుంది. వారున్నది జిల్లా నగరం అవతల ఒక పూరిపాక. పాక చుట్టూ చిన్నతోటతో అదొక ఆశ్రమంలా వుంటుంది. ఆమెభర్త స్కూలు మాస్టరుగా పనిచేసి, రిటైరై, ఒక చిన్న స్థలం కొనుక్కుని అందులో ఒక పూరిల్లు వేసుకొని, భగవతారాధనలో జీవితం గడుపుతున్నారు. ఆపాకలో ముందుగా కన్పించే విశాలమైన హాలులో, ఒక ఎత్తయిన ప్లాటుఫారం మీద దేవుళ్ళ పటాలూ విగ్రహాలూ చక్కగా అమర్చబడి, పువ్వులతో అలంకరింపబడిన అందమైన దృశ్యం గోచరిస్తుంది. ఆ హాలులో రెండు పూటలు భగవత్పూజ జరుగుతుంది. ఆహాలు వెనకాల రెండు గదులున్నాయి. అందులో ఒకటి వంటిల్లు. ఆదంపతులకు భాను మతి తప్ప వేరే సంతానమేమీలేదు. చిన్నప్పటినుంచీ భగవద్భక్తిని బోధిస్తూ భానుమతిని పెంచారా దంపతులు. వారు చాలా బీదరికం అనుభవిస్తున్నా, ఉన్నత భావాలతో, కలిగిన దానితోనే తృప్తి పడి శుచి, శుభ్రతలు లోపించకుండేటట్లు గృహాన్ని తీర్చి దిద్దుకుని, ఒకరి జోలికి పోకుండా అందరి గౌరవ మన్ననలకూ పాత్రులై కాలం గడుపుతున్నారు అప్పుడప్పుడు ఆహాలులో భజనలు జరగటం కూడా కద్దు. ప్రతిరోజూ విధిగా ఒక అరగంట భానుమతి, భగవత్సంబంధ కీర్తనలు గాని చక్కని రాగ ఫణితిలో భాగవతాది గ్రంధపఠనం గాని చేస్తుంది. అది వినడానికి ఆ చుట్టు ప్రక్కలవాళ్ళు వస్తూంటారు. వారందరికి ఆ వృద్ధ దంపతులను చూస్తే ఎంతో గౌరవం, ప్రపత్తి వున్నాయి. ఆయన నంతా స్వామి గారంటారు. పూర్తిపేరు కూర్మనాథస్వామి. ఆమెపేరు జగదాంబ. ఆయనకు ఏభై ఎనిమిదేళ్ళుంటాయి. సన్నగా, ఎర్రగా కాయ శరీరంతో, తరగని ఉత్సాహంతో సద్వర్తనా, భగవదారాధనలయందాసక్తితో కాలం గడుపుతున్నారు. ఆయన రోజూ ప్రొద్దున్న రెండు గంటలు, సాయంకాలం ఒక గంటా, దైవారాధనలో గడుపుతారు.

"అనంతరావుగారింటికి వెళ్ళానమ్మా"— అని తల్లికి జవాబిచ్చి, లోపలికి వెళ్ళి కాళ్ళూ చేతులూ కడుక్కుని వచ్చింది. "నాన్న గారి ఫలహారం అయిందా?" అనితల్లి నడిగింది, పడక కుర్చీమీద కూర్చున్న తండ్రిని చూసి. ఆయన చిరునవ్వు నవ్వారు.

"ఎలాగవుతుంది? నువ్వు ప్రక్కన లేకపోతే ఆయనకు సహిస్తుందా? అందులో ఇంత ఆలస్యమైందేమిటా? అన్న బెంగ ఒకటి."

"అయ్యో! ఇంకా హారతి అయ్యేసరికి మరీ ఆలస్యమవుతుందేమో." అందిభానుమతి.

"ఫరవాలేదమ్మా. నీకాకలిగా వుంటుంది కదా అని ఆలోచిస్తున్నాను. త్వరగా ముగిద్దాం."

"నాకు, మా మాస్టారింట్లో కావలసి నంత దాణా పడింది. అస్సలు ఆకలిలేదు,

నేనివాళ ఏమీ తీసుకోను.'' అంది భానుమతి.

''ఇంకేం! అందుకే ఇంతాలస్యంగా వచ్చి, అంత నిదానంగా కబుర్లు చెప్తున్నావు. అయితే మీరు లేవండి, అది భాగవతం చదువుతూ వుంటుంది.'' అని జగదాంబ భర్తని లేవదీసింది.

''అమ్మాయ్ కూడా, తీసుకుంటే బాగుంటుందను కుంటాను'' అని ఆయన లేస్తూంటే, ''ఆకలేస్తే ఆతరువాత ఒక ముక్క నోట్లో వేసుకుంటుంది. మీరు కానీయండి.'' అంది.

భానుమతి దేవుళ్ల పటాలకు ఎదురుగా కూర్చుని భాగవతంలో గజేంద్ర మోక్షం చదువ నారంభించింది. బిగ్గరగా రాగయుక్తంగా ప్రారంభించింది. మనుషులకే భగవద్భక్తి కలుగడం దుర్లభమైనప్పుడు, జంతువులకెలాగ కలిగిందా అనే ఆశ్చర్యం, ఆమెలో ఆ ఘట్టం చదువుతున్నప్పుడల్లా కలిగేది. కాని ఆరోజు మొదలు పెట్టిన దగ్గరనుండీ, ఆపద్యాలలో నూత్న అర్థం కన్పించ సాగింది. గజేంద్రుని అవస్థ ఆమెకు కళ్లకు గట్టినట్టు కన్పించసాగింది. ఆ అవస్థలో ఉత్పన్నమైన ఒక అద్భుతమైన భక్తిభావం, ఆభావంయొక్క క్రమ పరిణామం. ఆమెకు అవగతం కాసాగింది. తన కొక అనివార్యమైన ఆపదకలిగి, అది తప్పేమార్గం కన్పించ నప్పుడు, తన ప్రార్థనను, సృష్టిస్థితి లయ కారణభూతుడైనవాడూ ప్రకృతికి అతీతమైన ఒక భగవంతునుద్దేశించి, సల్పుతూ, సృష్టిలోభగవత్తత్త్వం ఎక్కడెక్కడ వుందో దాని నంతా స్మరించడం చాలా విజ్ఞానవంతంగా కన్పించింది. ఆ ప్రార్థన అందరికీ నచ్చేటటువంటిది. అన్నిమతాలవారికీ సంతృప్తి గలిగించగల ప్రార్థన భగవత్తత్త్వాన్ని చక్కగా నిరూపించింది. పరమాత్మ యొక్క విరాట్స్వరూపాన్ని తలపింప జేస్తుంది. ''లోకంబులు లోకేసులు లోకస్థులు తెగిన దుది నీలోకంబగు పెంజీకటి......'' అనడంలో నేటి వైజ్ఞానికులు కన్పెట్టిన, విశ్వంలో మనకెదురయ్యే చీకటిని గుర్తించిన ప్రస్తావన, విశ్వాంతరాళాన్ని మనోనేత్రంతో చూడ గల్గిన ధ్యాన శక్తిని ప్రదర్శిస్తుంది. అంత ఉన్నత స్థాయికి వెళ్ళిన మనస్సులో కూడా ''కలడందురు దీనుల యెడ....., కలడందురన్ని దిశలను, కల్లడు కలండనెడివాడు కలడో, లేడో,'' అనే సందేహం సహజంగా ఉత్పన్నమైంది. అది జిజ్ఞాసువు అందరికీలోనూ 'కలిగే సందేహమే! దానికి జవాబు లభించాలంటే భగవంతునియందు సంపూర్ణభక్తి భావంతో ఆత్మార్పణ చెయ్యడమే మార్గం. చివరికి తనమనస్సులో ఈశ్వర సన్నిధానాన్ని కల్పించుకొని ''లావొక్కింతయులేదు, ధైర్యము విలోలంబయ్యె...... నీవేతప్పనితఃపరంబెరుగ మన్నింపన్ దీనునిన్, రావే ఈశ్వర, కావవే



వరద, సంరక్షింపు భద్రాత్మకా.'' అని సర్వమూ నీవే, అన్యథా శరణం నాస్తి, అనే పదంలోకి వచ్చాక, భగవదనుగ్రహం లభించింది. భక్తి భావం యొక్క పరాకాష్ట, సంపూర్ణవిశ్వాసంతో ఆత్మార్పణ చెయ్యడంలోనే వుందని పిస్తుంది. ఆ పద్యాలు చదివినప్పుడల్లా భానుమతి కండ్లు చెమరుస్తాయి. బుద్ధినీ మనస్సునే కాక ఆత్మను స్పృశిస్తాయా పద్యాలలోని భావాలు.

గజేంద్రమోక్షం చదవడం పూర్తయ్యాక కొన్ని స్తోత్రాలను చదివి హారతిచ్చింది భానుమతి. హారతి కూడా పూర్తయ్యాక, కొద్దిసేపు, ముగ్గురూ మాట్లాడుకో నారంభించారు.

''కాలేజీవదిలాక, లెక్చరరు గారింటికెళ్ళావా? లేకపోతే ఇవాళ మధ్యాహ్నం కాలేజీ లేదా?'' అని అడిగింది జగదాంబ.

''కాలేజీ కొద్దిగా తొందరగా వదిలారు. మాస్టారమ్మాయి కన్పించి వాళ్ళ ఇంటికి తీసికెళ్ళింది. మాస్టారింటికివెళ్తే ఒక పట్టాన కదల బుద్ధెయ్యదు. ఆయన ఏవేవో విషయాలు చెప్తూంటారు.''

''అన్నట్టు చెప్పడం మరచాను, మావి

యార్డరు వచ్చేశింది" అన్నారు కాశ్మ వాధ స్వామిగారు.

"బ్రతికాం. రేపే కాలేజీ ఫీజు కట్టడానికి ఆఖరిరోజు. దేవుణ్ణి వెయ్యి విధాల ప్రార్థిస్తున్నాను బాబాయిడబ్బు పంపాలని"

"భగవంతుణ్ణి నమ్మినవారికే లోటూ రాదమ్మా."

"అదే అన్పించింది ఇందాక భాగవతం చదువుతూంటే."

"గీతలో చెప్పిందికూడా అదేకదా".

"కానీ ఆ మనో నిబ్బరం ఉండడమే కష్టం."


"కష్టం కాబట్టే అందరూ అనుసరించలేరు. అనుసరించిన వారికి మాత్రం తగిన ఫలితాలు లభిస్తాయి."

కాస్సేపు ముగ్గురూ మౌనంగా ఆలోచించసాగారు. జగదాంబ, భానుమతిని ఏదైనా ఫలహారం చెయ్యమంది. భానుమతి ఏమీ తీసుకోలేదు. తన క్లాసు పుస్తకాలు తీసి చదువనారంభించింది. ఒకగంట చదివింది. జగదాంబా, స్వామీ నిద్రపోసాగారు.

కొద్దిసేపు క్లాసుపుస్తకాలు చదివాక ఆమెమనస్సులోని ఆలోచనలు పరిపరి విధాలపోయాయి. ఈచదువు జీవితంలో ఎంతవరకు ఉపయోగిస్తుందా? అని తరుచూ ఆమెకు కలిగే ఆలోచనే మళ్లీ కలిగింది. ఉద్యోగాలు చెయ్యడానికిపెద్ద చదువేమీ అవసరం లేదు. అయినా పాఠ్య పుస్తకాలలో చెప్పినవేవీ ఉద్యోగాలలో ఉపయోగిస్తాయని నమ్మకం లేదు. విజ్ఞానం వల్ల మానవుడి మేధస్సు వికసిస్తుంది కాని అటువంటి ప్రయోజనం ఈ విద్యావిధానాలవల్ల లభిస్తుందని ఆశించడం అనవసరం. ప్రతి వ్యక్తి తన స్వయంకృషివలననే విజ్ఞానవంతుడు కాగలడు గాని, కాలేజీలలో బోధనవలన లాభం లేదని అనంతరావుగారు చెప్పారు. స్వయంకృషి ఎంతమంది చెయ్యగలరు? అంత ఓపిక ఎవరి కుంది? జీవితంలో ప్రతి పనికీ వక్ర మార్గాల నన్వేషించడం పరిపాటయిపోయిన ఈకాలంలో స్వయం కృషిపట్ల ఎంతమందికి శ్రద్ధవుంది? చాలా మంది యువతీ యువకులలో జీవితంలో ఎంత తొందరగా స్థిరపడదామా? అన్న ఆలోచన తప్ప ఎంత ఔన్నత్యాన్నిపొందగలుగుదామా అన్న ఆరాటం తక్కువ. అతి సమీపంలో వారికి కన్పించేది పెళ్లి! దానిగురించి తీవ్రమైన ఆలోచనలు, కలలూ, ప్రయత్నాలూ వపరీతంగా చేస్తూంటారు. తన స్నేహితురాండ్రలో ఎంతమందికి విజ్ఞానం మీద శ్రద్ధవుందో తనకు తెలుసు. వారి సంఖ్య చాలా తక్కువ . చాలామందికి వివాహం మీదే శ్రద్ధ. యువకుల నాకర్షించి తమ వెంట తిప్పుకోవడం వాళ్లకు చాలా సరదా. యువకులకు, తాము చేసే ప్రతిపనిలోనూ యువతుల నాకర్షించడం ప్రధానధ్యేయంగా కనిపిస్తోంది. ఈపరస్పర ఆకర్షణకు అతీతులై కొందరు మెలగక పోవటంలేదు. కాని వారి భావాల్ని ఇతరులు అర్థంచేసుకోక పోతే ఒక్కొక్కప్పుడు విపరీత పరిస్థితులు తటస్థిస్తూంటాయి. శ్యాంసుందర్ తనగురించి అలాగే పొరపొడ్డాడు మొదట్లో. తను మగవాళ్లతో చనువుగా తిరగడాన్నీ, ముఖ్యంగా తనను పలకరించిన కొందరితోటి నవ్వుతూ మాట్లాడడం చూసి అతను దురభిప్రాయంతో, తనను పార్కులకూ, సినిమాలకూ ఆహ్వానించటం మొదలెట్టాడు. అప్పుడు తను తప్పని సరిగా అతని చర్యలను స్పష్టంగా ఖండించవలసి వచ్చింది. కాని విశేషమేమంటే అప్పటినుండీ అతను తనను విశేషంగా గౌరవిస్తున్నాడు. తమకు లొంగని ఆడదాన్ని ఆమె సత్శీల అని గ్రహించినవాడు బుద్ధిమంతులైన పురుషులెంతగా గౌరవిస్తారో తెలిస్తే, పురుషునికి లొంగి అతనిచే చులకనగా చూడబడడానికి స్త్రీ అంగీకరించదు. తాము చేసే ప్రతిపని యొక్క పరిణామం, ఫలితం ముందే ఊహించగల శక్తి ఎంత మంది కుంటుంది?

అసలీ చదువుకు ఫలితం ఏదవుతుందని ఆలోచించేవాళ్లెంత మంది? తన స్వవిషయంలో తనకు ఈపాటి చదువచ్చే అవకాశం కలుగుతుందని అనుకోలేదు. తన తల్లిదండ్రులకు చెప్పించగల స్తోమత లేదు. కాని తనయందు గల అవ్యాజ వాత్సల్యం చేత బాబాయి తన చదువుకయ్యే ఖర్చంతా భరిస్తున్నారు. ఆయన తనకు ఈమధ్య తరచు జ్ఞాపకమొస్తున్నారు. సుమారు మూడేళ్లయింది ఆయనను చూసి. ఉత్తర హిందూస్థానం వెళ్లారనీ తెలిసింది. ఆయన ఎక్కడవున్నా తనకు మాత్రమేమీ లోటు లేకుండా చదువుకయ్యే ఖర్చు మాత్రం పంపిస్తు

(45వ పేజీ చూడండి)



మీరు మృదువుగా వేపొరబ్ రాస్తే అది వెంటనే వెచ్చదనాన్నిచ్చి హాయిని గొలుపుతుంది... మీ పిల్లవాడు సులభంగా శ్వాసను పీల్చుకొని రాత్రంతా హాయిగా నిద్రపోతాడు.

బాధ నివారణకు మీ పిల్లవాడు మీ మీద ఆధారపడతాడు. అతడు రొంపతో బాధపడుతున్నప్పుడు విక్స్ వేపొరబ్ రాయండి. ఛాతీ గొంతుక, వీపు మరియు ముక్కుచుట్టుప్రక్కల మీ ప్రేమపూర్వక చేతులతో విక్స్ వేపొరబ్ మర్దన చేస్తే, మీ కళ్ల ముందే ముక్కు దిబ్బడ పోవడం ప్రారంభమవుతుంది. అతడు తిరిగి సులభంగా శ్వాసను పీలుస్తాడు. ఎందుకంటే ఔషధ ఆవిరులు ఏడు సెకండ్లలోనే జలుబు భారమున్న చోట్లకి చేరతాయి. అప్పుడు పిల్లవానిని చక్కగా పరుపు మీద పడుకోబెట్టండి.

అతడు బాగా నిద్రపోతూంటే వేపొరబ్ రాత్రంతా పని చేస్తూంటుంది. తెల్లవారే టప్పటికి జలుబు భారమంతా పోతుంది. అతడు లేచేటప్పటికి హాయిగా, ఆరోగ్యంగా వుంటాడు.... అటలతో మురిపించే మీ ముద్దు బిడ్డ.



విక్స్ వేపొరబ్ జలుబులకు ఈ రాత్రేరాయండి



గోడమీద గడియారం

డి. వీరభద్రరావు

"టక్, టక్..టక్, టక్.." అని, బద్ధంగా శబ్దం చేస్తోంది గోడమీద గడియారం. తెల్లవారు ఝాము మూడు గంటలు దాటినది.

కొడికట్టిన మూనెదీపం ప్రసరింప చేస్తున్న సన్నని కాంతి గదినిండా ఆవరించి వది. వాసు మందస్వరంతో గీతాపారాయణం చేస్తున్నాడు. గది మధ్యలో వెంకట్రామయ్య గారి మంచం, ఆయన మృత్యువుతో తుది పోరాటం సలుపుతున్నారు.

గ్రామ ప్రముఖులతో గది నిండిపోయి వది. అందరి ముఖాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. వెంకటామయ్యగారు మరి కొంత కాలం తముతో మెలగాలన్నదే గ్రామ ప్రజల మనసులలోని కోరిక. అయితే విధికి ఎలాటి వారూ తలవంచవలసినదే. వెంకట్రామయ్య గారు తమ జీవితంలోని అంతిమ ఘడియలలో ప్రవేశించారన్నది విదితమై పోయింది. అప్పటికి కొన్ని గంటలపూర్వమే ఆయన స్పృహ కోల్పోయారు. స్పృహ కోల్పోడానికి ముందు అందరి మొహాలు పరికించి చూశారు. ఏదో అవ్యక్తమైన తృప్తి ఆయన ముఖంలో తొణికిసలాడింది. వాడిపోయిన ఆ ముఖంలో చిరునవ్వు వెలిగింది. గదంతా నిశ్శబ్దం ఆవరించగా ఆయాసంతో కూడిన స్వరంతో ఆయన నోటినుండి యీ మాటలు వెలువడ్డాయి.

"సంతృప్తికరంగా జీవితం సాగించడం ఒక గొప్ప అదృష్టం. ఒకవాడు నేను అలాటి అదృష్టానికి నోచుకోలేదేమోనని అమితంగా భయపడ్డాను. నేను మంచం మీద పడ్డ యీ వారం రోజులూ నా గతజీవితాన్ని సింహావలోకనం చేసుకొని చూశాను. అక్కడక్కడ నా జీవితాన్ని చీకటి మచ్చలు అలుముకొన్నా, మొత్తం మీద ఏ అదృష్టమయితే నాకు దూరమవుతుందని భయపడ్డానో ఆ అదృష్ట దేవత నన్ను వరించడమే కాక నాకు అతి సన్నిహితంగా కూడ మెలగినదని తెలుసుకున్నాను. దానికి ప్రమాణము కుటుంబరహితుడనైనా యీనాడు నేను చూస్తున్న దృశ్యమే. నా జీవితం యింత సంతృప్తికరంగా గడచిపోవడానికి మీలో ప్రతి ఒక్కరు కారకులయారు. మీ అందరకు యివే నా మనఃపూర్వక కృతజ్ఞతలు. ఈ లోకంలో నా బాధ్యతలు తీరిపోయాయని నా అంతరాత్మ చెబుతోంది. మీ అందరి శలవు తీసుకొంటున్నాను."

అటుపిమ్మట వాసు వైపు తిరిగి యిలా అన్నారు:

"నాయనా వాసు, నిన్ను మొదటిసారిగా చూసినపుడు కొన్ని భావాలు మెదిలాయి నాలో. నిన్ను నా కోరికల ప్రకారం రూపొందించాలని ఒక బలమైన కాంక్ష నాలో ప్రవేశించింది. కాని ఆకాంక్ష వెనువెంట అలాటి అధికారాన్ని నీపై చలాయించడానికి నేనెవరిని అన్న ప్రశ్న నీడలా నన్ను అనుసరించేది. చివరకు నా అధికారంతో ప్రమేయం లేకుండానే నీవు నా కోరికల ప్రకారం మలచబడ్డావు. అది భగవదనుగ్రహం. నాలో యిప్పుడు ఏ కాంక్షలూ లేవు.

"ఎంతకాలం నుండో నాకు అండగా నిలచి నా జీవిత ప్రవాహాన్ని ఒక నిర్దిష్టమైన మార్గం గుండా ప్రవహింప చేసినది, యిదుగో యీ 'భగవద్గీత'. నేను శాశ్వతంగా కనులు మూసే వరకు గీతాపారాయణం కానిమ్ము నాయనా." ప్రక్కనే పడి వున్న భగవద్గీతను తీసి వణికే హస్తాలతో వాసుకు అందించారు.

చివరకు ఆయన చూపులు వాసుపై నిలిచాయి. ఆ చూపులను ఏ విధంగా చదివేది?

వెంకట్రామయ్యగారితో పరిచయమైన క్షణాలు యింకా స్మృతిపథంలో స్పష్టంగా మెదులుతున్నాయి.

ఈ గ్రామానికి నేను వచ్చి అప్పటికి కొన్ని మాసాలు మాత్రమే గడిచాయి. వాసు అయిదేళ్లవాడు. ప్రాథమిక పాఠశాలకు వెడుతున్న కొత్తరోజులు. కుంటుతూ నడుస్తున్న వాసును ఒకచేత్తో పట్టుకొని మాయింటి వైపు వస్తున్నారాయన. ఆరడుగుల సన్నటి పొడవాటి వ్యక్తి. పొడుగు

చేతుల ఖద్దరు చొక్కా, ఖద్దరు పంచె పైమీద ఖద్దరు కండువా. నలభై సంవత్సరాలు పైబడి వయసు ఉంటుంది. ఆయన పేరు, వ్యక్తిత్వం గురించి చూచాయగ ముందే విన్నాను. నిస్వార్థ జీవి అనీ, యితరుల కోసం బ్రతికే మనిషి అనీ పలువురు చెప్పుకుంటారు.

ఆడుకోడానికి బయటకు వెళ్ళినవాడు చీకటి పడుతున్నా యిల్లు చేరలేదేమో అని తలుపులు తెరచి వుంచి ద్వారం గుండా బయటకు చూస్తున్నాను వాసు కోసం.

వారు యింటి సమీపానికి చేరగానే "రండి, రండి" అని ఆహ్వానించడం తప్ప మరేమి పలకాలో పాలుపోలేదు నాకు. వాసు నన్ను చుట్టేశాడు.

వాల్చి ఉన్న, పడక కుర్చీలో కూర్చుంటూ "మీరూ కూర్చోండమ్మా" అని ఆయన మొదలుపెట్టారు.

"మీ అబ్బాయికి చురుకుపాలు మహా జాస్తి. పసివాడైనప్పటికి వయసుకు మించిన ఓరిమిని కూడా సంపాదించాడు. మాయింటికి ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో యీ కుర్రాళ్ళంతా చేరి ఆడుకుంటారు. ఆటల అనంతరం రివ్వున పరుగెత్తి పారిపోతుంటారు. ఈ రోజు కూడ అలవాటు ప్రకారమే పరుగు తీయడంలో మీవాడు కాలికి గొప్పు తగిలి నేలమీద పడిపోయాడు. అదంతా చూస్తున్న నేను లేచి మీవాడి దగ్గరకు త్వరత్వరగా చేరుకున్నాను. అప్పటికే మీవాడు నేలమీద నుండి లేచి బట్టలకు అంటుకున్న దుమ్మును దులుపుకుంటున్నాడు. కాలికి బలంగా గాయం తగిలి రక్తం చిమ్ముతోంది. పెదవులు బిగబట్టి బాధనంతా తనలోనే అణచుకుంటూ మీయింటి వైపు అడుగులు వేశాడు. ముందుకు వెడుతున్న వాడిని నేనాపి మాయింటికి తీసుకు వెళ్ళాను. గాయానికి ప్రథమచికిత్స చేసి, మందు వేసి కట్టుకట్టి, యింటివరకు దిగబెడతాను రమ్మని తీసుకువచ్చాను.

"ఇంతకూ చెప్పొచ్చేదేమంటే, మరొక కుర్రాడైతే ఆ దెబ్బకు బావురుమనేవాడు. మంచి శిక్షణ నిస్తున్నావమ్మా" అని జరిగినదంతా చెప్పారు.

పమిటతో చుట్టూ కప్పుకొని నేనూ, నాప్రక్క వాసు క్రిందపరచి వున్న చాప మీద కూర్చున్నాం.

"మీ మేలు ఎప్పటికీ మరచిపోలేనండి. మీరు చెప్పింది నిజమే. వీడి కాలు క్షణం నేలమీద నిలవదు. ఎలావేగాలో ఏమిటో వీడితో" అన్నాను.

వాసు కట్టుకట్టి ఉన్న కాలి వ్రేలిని, మెల్లిగా కదుపుతూ అటే చూస్తున్నాడు.

"నొప్పి పుడుతోందా వాసూ?" అని అడిగారాయన.

ఏదో దొంగపని చేస్తున్నవాడు దొరికి పోయినట్టుగా మొహం పెట్టి "లేదు" అని సమాధానమిచ్చాడు వాసు.

"అన్నట్టు నన్ను వెంకట్రామయ్య అంటారు. నీపేరు సుశీలమ్మ కదూ. నీవు యీ ఊరి మాధ్యమిక పాఠశాలలో ఉపాధ్యాయినిగా చేరినప్పటి నుండి నీవెవరివో తెలుసును. ఏటొచ్చీ స్వయం పరిచయం కలిగే అవకాశం యిదుగో యీవాడు వాసు ద్వారా కలిగింది. ఇక వెళ్ళి వస్తా. మళ్ళీ ఎప్పుడైనా కలుసుకోవచ్చు" అని వెళ్ళి పోయారాయన.

ఆయన వెళ్ళిపోగానే వాసును హృదయానికి హత్తుకున్నాను. నాకళ్ళ వెంబడి నీళ్ళు జలజలా రాలాయి.

"అదేమిటమ్మా, ఎప్పుడూ ధైర్యంగా, ఉండాలని నువ్వేగా చెప్పావు. ఏడుస్తున్నావా?" అన్నాడు వాసు.

"లేదు బాబూ. ఇంకెప్పుడూ యిలా దెబ్బ తగిలించుకోకేం. రక్తం వచ్చిందా? నొప్పి కలుగడం లేదూ?" అనడిగాను.

"లేదమ్మా. నొప్పి బాగా తగ్గిపోయింది. ఏదో చీమ కుడుతున్నట్టుందంతే. ఆయనే బాగా కట్టు కట్టారమ్మా. ఏదో 'లోషన్' నీళ్ళట వాటితో శుభ్రంగా రక్తాన్ని వేళ్ళకున్న మట్టినీ కడిగివేసి, ఆ తరువాత గుడ్డ వేసి కట్టారమ్మ. అప్పుడు అలాంటి పనులన్నీ 'హాస్పిటల్'లో చేస్తారని నీవు చెప్పిన మాటలు గుర్తుకు వచ్చాయి. అప్పుడాయన్ని

"ఇది హాస్పిటలా?" అనడిగాను.

"కాదు నాయనా. మా యిల్లే" అన్నారు ఆయన.

"మరి హాస్పిటల్ ఎక్కడ వుంది?" అని మళ్ళీ అడిగాను.

'మన ఊరికి హాస్పిటల్ లేదు నాయనా' అన్నారు ఆయన. అలా అంటూంటే ఎందు వలనో ఆయన కళ్ళలో నీళ్ళు తిరిగాయమ్మా. అప్పుడు నేను మళ్ళీ

'మన ఊళ్ళో ఎందుకు హాస్పిటల్ లేదూ?' అనడిగాను.

'డాక్టర్లకు యీ ఊరు నచ్చదు నాయనా, అందుకే ఎవరూ రారు' అన్నారు ఆయన. అప్పుడు నేనేమన్నానో తెలుసా అమ్మా?

'అలాగైతే చూస్తూ వుండండి. నేనే పెద్దవాడినై పోయి, డాక్టరునైపోయి యీ వూర్లో హాస్పిటల్ పెడతానన్నాను.

"ఆయన నన్నెత్తుకొని గట్టిగా అదుముకొని 'అలాగే బాబూ' అన్నారు. అప్పుడు నాకేదోలా అనిపించిందమ్మా" అని వాసు తనకు కలిగిన సంఘటననంతా వివరించి చెప్పాడు.

వాసు మాటలు వింటే నాకేదో భయం కలిగింది. "భగవంతుడా! లేనిపోని ఆశలతో వాసును ఆకాశం మీదకు నెట్టివేయకు, నేలమీదే నడువనీయి" అని ప్రార్థించాను.

వాసుకు తల్లినీ, తండ్రినీ నేనే. ఉపాధ్యాయినిని అయిన నేను, ఏవో ఆదర్శాలకు పోయి, ముందు కుమారునికి సమగ్రమైన శిక్షణ నివ్వాలన్న ఉన్నతమైన ఆలోచనలతో వాసును వాస్తవ పరిస్థితుల నుండి దూరంగా తరిమి వేస్తున్నానేమో అన్న భయం కలిగింది.

మరొకరోజు ఆటలకు వెళ్ళి తిరిగి వస్తున్న వాసుతో పాటు వెంకట్రామయ్య గారు కూడ వచ్చారు. ఆయన మరల అలా రావడం ఏదో 'సంకటు'మనిపించింది నాకు. ఇది అసలే పల్లెటూరు. నేనా తలచెడిన ఒంటరి ఆడదాన్ని. లోకానికి ఝడిసి, అణిగి మణిగి ఉండడం అవసరమని నాలోని ఏవో మారుమూల అణువులు సలహా చెబుతూన్న పరిస్థితిలో ఉన్నదానిని.

లోన ప్రవేశించి పడకకుర్చీలో కూర్చున్నారు వెంకట్రామయ్యగారు. వాసు, నేను చాప మీద కూర్చున్నాం.

"నాకు కృతజ్ఞతను తెలుపమని వాసుకు నీవేమైనా చెప్పి పంపావా?" అని నన్నడిగారు ఆయన.

విషయమేమిటో తెలియక నవ్వి మౌనం వహించాను నేను.

"మీ వాడికి గాయం పూర్తిగ మాని పోయిందట. అందుకని నా దగ్గరకు వచ్చి కృతజ్ఞత చెప్పుకుంటున్నాడు. గాయం తగిలిన వెనువెంటనే నేనా విధంగా చికిత్స చేయడం వలనే అంతత్వరగా నయమయిందట. నేను కనక ఆ విధంగా చేయకపోతే తను యింటికి చేరేలోగా ఆ గాయం నిండా మన్ను చేరి, పుండు అయేదట. ఇంకా కొన్ని పరిస్థితులలో

అ(వేలు తీసివేయవలసిన ప్రమాదం కూడా జరిగేదట. నేను అలాంటి ప్రమాదాల నుండి తనను తప్పించినందుకు వాడు ఏనాటికైనా వారి ప్రత్యుపకారం చేసి ఋణం తీర్చుకుంటాడట.''

వాడు గురించి ఆయన అలా చెప్పుకు పోతుంటే నా తనువు పులకరించింది. నేనిచ్చిన శిక్షణ తాలూకు ఫలాలు కనిపించడం ప్రారంభించాయి. పిచ్చి వెధవాయి! ఆ గాయం తగిలిన రోజున ''గాయానికి కట్టుకట్టక పోతేనేం? ఏం జరుగుతుంది?'' అని ప్రశ్నలు వేసి సమాధాన పరిచేవరకు నిద్రపోలేదు. ఆయన యింకా చెప్పుకుపోతున్నారు.

''మీవాడికి కుతూహలం చాలా అధికమమ్మా. పట్టుదల కూడ అధికంగానే ఉన్నట్టు కనిపిస్తోంది. ఈ ఊర్లో హాస్పిటల్ లేదని పెద్దవాడయిన తరువాత డాక్టరై పోవాలని యిప్పటికే తీర్మానించుకున్నాడు. అంతవరకు ''యిలాటి చిన్న చికిత్సలు చేయడం ఊర్లో ఉన్నవాళ్లంతా ఎందుకు నేర్చుకో కూడదూ?'' అని ప్రతిపాదించాడు. 'నేను ముందు నేర్చుకొని మిగతా వాళ్లందరకు నేర్పిస్తూనుండండి' అంటూ కట్టుకట్టే విధానం ఓపిగ్గా నేర్చుకున్నాడు. పూవు పుట్టగనే పరిమళిస్తుందంటారు. మీవాడు మంచి అభివృద్ధిలోకి వస్తాడు.

''నేను ముఖ్యంగా యీరోజు యిక్కడకు రావడానికి కారణం నీకొక సలహా చెప్పి పోదామని. కొన్ని కొన్ని పరిస్థితులు కొన్ని కొన్ని పరిణామాలకు దారితీస్తాయి. ఇపుడు మీవాడికున్నది పొంగే ఉత్సాహం. ఏ పరిస్థితులలోనూ కూడ ఆ ఉత్సాహంపై నీళ్లు చల్లి దానిని చల్లార్చడానికి యత్నం చేయకు. ఏ సమయంలోనైనా సలహాలకు, సహాయానికి వెంకట్రామయ్య ఉన్నాడని జ్ఞప్తిలో ఉంచుకో, నేను వెళ్లివస్తా.''

ఆయన పలుకులు మంత్రాక్షతలలా పనిచేశాయి నామీద. మనసును ఆవరించిన అనుమానపు తెరలేవో విడివడుతున్న అనుభూతి కలిగింది. ఆయన దృష్టిపథంలో ఉన్నంతవరకు ద్వారం వద్ద అలాగే నిలబడి పోయాను.

ఒకరోజు వాడు పలక మీద దేవనాగరి అక్షరాలు దిద్దుతున్నాడు. ఆశ్చర్యపోయాను. అంత చిన్న తరగతులలో దేవనాగరి లిపి

గోడమీద గడియారం

ఎక్కడా నేర్పరే!

''అవేమిటి బాబూ దిద్దుతున్నావు?'' అనడిగాను.

''సంస్కృతం అక్షరాలమ్మా''

''సంస్కృతం కూడ నేర్పుతున్నారా మీ క్లాసుకు?''

''స్కూల్లో కాదమ్మా. ఆయనే నేర్పుతున్నారు. మొన్నొక రోజున ఆయనేదో పద్యంలా చదువుతున్నారు. అదేమిటో అర్థం చేసుకోవాలని ఎంత ప్రయత్నించినా ఒక ముక్క బోధపడలేదు. ఆయన పఠించడం ఆపిన తరువాత అడిగాను ఏమి చదువుతున్నారని. 'శ్లోకాలు' అన్నారు ఆయన. అయినా నాకర్థం అవలేదు. 'అంటే?' అన్నాను. అప్పుడాయన నాకు తెలియలేదని పసిగట్టారో ఏమో, 'అది సంస్కృత భాష' అని దాని గొప్ప తనాన్నంతా చెప్పారు. నువ్వు దానిని గురించి నాకసలు ఎప్పుడూ చెప్పలేదేమమ్మా? అప్పుడు నా మనసులో నీకు రాదులాగుంది, అందుకే చెప్పలేదనుకున్నాను. ఆయన్నే నేర్పమని అడిగాను.

''ఆయనకు చాలా సంగతులు తెలుసమ్మా. నీకెన్ని ఒచ్చో ఆయనకు కూడ అన్నీ వచ్చు. నీకు తెలియని కొత్త విషయాలు ఆయనకు వచ్చు. ఇప్పుడు నేను ఎక్కువ సేపు ఆడుకోడం లేదమ్మా. కొంత సేపు ఆడుకొని మిగతా సమయం ఆయన దగ్గరే గడుపుతున్నాను. ఆయనకు నేనంటే చాల సరదా అమ్మా. ఆయన నాతో బోలెడు కబుర్లు చెప్పి, నాతో బోలెడు చెప్పించుకొని నవ్వుతూ ఉంటారు.''

నేను పరధ్యానంలో పడ్డాను. ఇవన్నీ ఏ పరిణామానికి దారితీస్తాయో అగమ్యంగా ఉంది. వెంకట్రామయ్యగారు వాడికి గురుత్వం వహించడం ప్రారంభించారు. పితృప్రేమ తెలియని జీవితం వాడిది. భగవంతుడే అవిధంగా ఆ ప్రేమను వాడికి ప్రసాదిస్తున్నాడా? అప్రయత్నంగా నాకనులు చెమర్చాయి.

''ఆయన దగ్గరకు వెళ్లడం తప్పా అమ్మా?'' అన్న వాడి ప్రశ్నతో యీ లోకంలో పడ్డాను.

''అబ్బే, లేదు బాబూ. తప్పకుండా, వెళ్లు'' అన్నాను, ఆయన సలహాను గుర్తు తెచ్చుకుంటూ.

ఒకదాని వెంట ఒకటి సంవత్సరాలు కాలగర్భంలో కలిసిపోసాగాయి. కాలగమనంతోపాటు మా జీవితాలు కూడ యీ గ్రామంతో పెనవేసుకుపోయాయి. దిన దినానికి ఈ గ్రామం పట్ల అప్యాయత పెరుగసాగింది. ఇక్కడి ప్రజలలో వెల్లివిరుస్తున్న సహృదయత, సౌజన్యత, సౌశీల్యము అవగాహన చేసుకొన్నాను. ఆశ్చర్యపోయాను. ఈ గ్రామం ఒక విచిత్రం అనిపించింది. స్వప్నంలో ఉన్నానా, లేక వాస్తవ జగత్తులోనిదేనా యీ గ్రామం అన్న సంశయం కలిగింది. ఆవేశాలకు, కావేషాలకు తావు లేదు యీ గ్రామంలో. రావణాసురిడి కాష్టంలా తగలడే విరోధాలసలే లేవు. ఒకత్రాటి మీద నడవడం, ఒక మాట ననుసరించడం సునాయాసంగా అలవడ్డాయి గ్రామప్రజలకు. 'ఈ ప్రగతి కంతకు వెనుకనున్న వ్యక్తి ఒకే ఒకడు. ఆయన వెంకట్రామయ్యగారు' — అన్న భావం యిక్కడి ప్రజలందరి హృదయాలలోను నిత్యం వెలుగొందుతుంది.

ఒకప్పుడు యీ గ్రామంలోనూ కయ్యాలూ, కావేషాలూ కాపురం చేశాయి. మునసబు జట్టూ, కరణం జట్టూ అనుక్షణం ఢీకొనేవి. తాము మునసబు వర్గంలోని వారో, లేక కరణం వర్గంలోని వారో నిర్ణయించుకోలేక ఏదయితే ఏ ప్రమాదం వాటిల్లుతుందోనని నిత్యం భయకంపితులయేవారు ప్రజలు. త్యాగానికి ఔదార్యాన్ని చమత్కారాన్ని జోడించి ఆ వైషమ్యాలను వెంకట్రామయ్యగారు ఏవిధంగా అంతరింప చేశారో కథలలా వినవచ్చాయి.

ఈ గ్రామంలో మునసబు వర్గానికి కరణం వర్గానికి విరోధం తారస్థాయినందుకొన్నది యీ గ్రామంలో శివాలయం కట్టించాలా, రామాలయం కట్టించాలా అన్న ప్రశ్న ఉదయించినపుడు. భగవంతుని ఆలయం పేరిట చందాలు సేకరించడం అప్పటికే జరిగిపోయింది. అయితే ఏ దేవుని పేరిట ఆలయం కట్టించేది ప్రజలు అడుగనూ లేదు, చందాలు వసూలు చేసిన గ్రామాధికారులు చెప్పనూలేదు. చందాలు వసూలు చేసేటపుడు కరణం మునసబులు ఐక్యతతోనే వ్యవహరించారు. ఆ తరువాత ఉత్పన్నమయింది ఏ దేవునికి మందిరం కట్టించాలన్న విషయం.

ప్రజలంతా తబ్బిబ్బయ్యారు. ఆ ప్రశ్న ఉత్పన్నమయిన తరువాత గాని దాని ప్రాముఖ్యత విశదమవలేదు. మునసబు కరణాలు కావాలనే ఆ విషయం దాచిపెట్టారని ప్రజలు గ్రహించారు. రహస్యం ఏమంటే మునసబు శివభక్తుడు. కరణం విష్ణుభక్తుడు. ఈ గ్రామంలో మునసబు అధికుడో, కరణం అధికుడో కట్టబోయే దేవాలయం చాటుతుంది. 'శివుడు గొప్పవాడ'ని మునసబు వర్గం వారంటే, 'కాదు, విష్ణువే గొప్పవాడు. ఆ విష్ణువు ఎత్తిన దశావతారాలలో రాముడు అఖిల జనానికి ప్రియుడయ్యాడు కాబట్టి, రామాలయమే వెలియాలి' అని కరణం వర్గంలోని వారన్నారు. ఇరువురిలో ఎవరూ తమ ఓటమిని అంగీకరించలేదు. చివరకు ప్రజాభిప్రాయం సేకరిద్దామన్నారు. ఆవిధంగా మునసబు కరణం మధ్య ఉన్న వైషమ్యం గ్రామ ప్రజలలోకి దూకింది.

ప్రచారం హోరాహోరిగా సాగనారంభించింది. ఒక దేవునికి ఆలయం కట్టించి మరొక దేవునికి మానివేయడం ఒక్కొక్క కుటుంబంలో తరతరాలుగా పాతుకుపోయిన ఒక నమ్మకాన్ని ప్రశ్నించడం వంటిది. తత్కారణంగా ప్రజలావేశపూరితులవడానికి ఎక్కువకాలం పట్టలేదు. గ్రామమంతా రెండుగా శాశ్వతంగా వైషమ్యాలు నిలిచిపోయే ప్రమాదం ఆసన్నమయింది. అలాటి తరుణంలో వెంకట్రామయ్యగారు రంగంలో ప్రవేశించారు. కాబోయే ప్రమాదాన్ని పసిగట్టారు. భవిష్యత్తులో ఎలాటి అనర్థాలు జరుగగలవో ఊహించారు. సమయం మించకుండానే ప్రజలలో ఒక నూతన చైతన్యం తీసుకురావాలని ఆయన అంతరాత్మ ఘోషించింది. గ్రామం తిరోగమంలేని ప్రగతిపథాన నడవాలంటే సంకుచిత మనస్తత్వానికి తావులేకుండ పోవాలి.

ఆయన దృక్పథం అతివిశాలమైనది. ఆయన దృష్టిలో దేవుడు ఒక్కడే. ప్రజలలో నైతిక విలువలకు ఒక శాశ్వత స్థానం ఏర్పరచడం నిమిత్తం పురాణాలు సృష్టించబడ్డాయి. స్వప్రయోజనపరులైన కొందరు ఆ పరమ పవిత్ర గాథలను తమ స్వార్థానికి ఉపయోగించుకొని వర్గ వైషమ్యాలు తల ఎత్తేటట్టు చేశారు. వేలాది సంవత్సరముల నుండి మహావృక్షంలా పాతుకున్న ఆ భావాలను పెళ్లగించడానికి కొందరు యుగపురుషులు అవసరం. తాత్కాలికంగా ఆ సమస్య పరిష్కారం కావడానికి ఒకే ఒక మార్గం కనిపించిందాయనకు, అది ఒక దేవాలయానికి బదులు రెండు దేవాలయాలు నిర్మింపబడడం. కాని వసూలయిన మొత్తం ఒక దేవాలయ నిర్మాణానికి కూడపూర్తిగ సరిపోదు.

ఆయన శివభక్తు వర్గకుల వెళ్ళి ఇలా అడిగారు.

"మీరు ఏ కారణంగా శివుని ఆరాధించడం జరుగుతుందో నేను చెబుతాను. అభ్యంతరం ఉంటే చెప్పండి. మీ కుటుంబంలో ఏనాటి పూర్వీకులో శివుని ఆరాధించడం మొదలెట్టారు. అది తరతరాలుగా కుటుంబాచారంగా నిలచిపోయింది. ఈ ఒక్కకారణం తప్పిస్తే మీరు శివుణ్ణి పూజించడానికి మరే కారణం కనిపించదు. మీరు శివార్చకుల కుటుంబంలో జన్మించడానికి బదులు విష్ణువును పూజించే కుటుంబంలో జన్మించారనుకోండి. అప్పుడు మీరు కూడ విష్ణువునే ఆరాధించడం జరిగేది. కాదంటారా?"

అదేవిధంగా రామాలయం కావాలనే వారి వద్దకూ వెళ్ళి అడిగారు. ఇరుపక్షాల నుండి మౌనమే వచ్చింది. ఆ తరువాత మునసబు కరణాల వద్దకు వెళ్ళి మంతనాలు జరిపారు. అయితే మునసబు కరణాల వద్ద ఆయన ఉపయోగించినది చమత్కారం.


"ఈ ఊరికి ఒక శివాలయం అవసరం కదు మునసబుగారూ" అనడిగారు వెంకట్రామయ్యగారు మునసబును.

"అదేకదండి నేను పదేపదే చెబుతున్నది." అన్నాడు మునసబు.

"ఈ ఊరి ధనవంతులలో మీ స్థానం ఎన్నవదో మిమ్మల నడగడం మిమ్మల్ని కించపరచినట్లే అవుతుంది. శివాలయమే నిర్మింపబడేటట్లయితే మీ వంతు మీరెంత ఇవ్వగలరు?"

"ఓ, అదా? ఆ సంగతి నేను ముందే యోచించాను. నిజానికి ప్రజల వద్దనుండి వసూలయినది అతిస్వల్పం. అంతా చేసి పదివేలు. దానితో దేవాలయం తయారవడం అసంభవం. మీ దగ్గర దాచడమెందుకు, శివాలయానికైతే నా వాటా పదివేలు ఇద్దామనుకుంటున్నాను."

"భేష్! మీ పేరు చిరస్థాయిగా వుండిపోతుంది గ్రామంలో. శివాలయానికి నేనూ ఓ ఇరవై వేలిద్దామనుకుంటున్నాను. ఒక



"వ్రతు మీద..." అని ఆగారు వెంకట్రామయ్యగారు.

నోట మాటరాక వెంకట్రామయ్య గారి వైపు చూశాడు మునసబు. తేరుకొని, "ఏంత మాట. చెప్పండి, చెప్పండి" అన్నాడు.

"ప్రజల దగ్గర నుండి వసూలయిన పదివేలతోను ఒక చిన్న శివాలయం కట్టిద్దాం."

"ఓ, దానిదేముందండీ. రాముడంటే నాకు భక్తి లేదన్నా? ధనలోభం కారణంగా ఏదో ఒకటుంటేనే పిలుపడుతుందని ఇలా పట్టు పట్టాగాని" అన్నాడు మునసబు.

"అయితే రెండు దేవాలయాలు నిర్మించడానికి అభ్యంతరం లేనట్టేగా?"

"మీరు నాకలాటి అభ్యంతరం ఉందనుకొంటే నన్ను తప్పర్థం చేసుకున్నట్టే. అంత సంకుచితంగా వ్యవహరిస్తే ప్రజలు ఎప్పుడో నన్ను తక్కువగా పరిగణించేవారు." అని నవ్వేశాడు మునసబు తెలివిగా మాటాడానని మురిసిపోతూ.

వైభవంగానే కరణంతో కూడ సంభాషణలు జరిపారు వెంకట్రామయ్యగారు. ఫలితాలు కూడ వైభవంగానే కలిగాయి. రామాలయానికైతే కరణం పదివేలిస్తున్నాడు. వెంకట్రామయ్యగారు మరొక యిరవై వేలిస్తున్నారు—ప్రజల వద్ద నుండి వసూలైన సొమ్ము శివాలయానికి ఖర్చు పెట్టడానికి కరణానికి అంగీకారమయితే.

ఆ విధంగా శివాలయమూ, రామాలయమూ కూడ వెలిసాయి యీ గ్రామంలో. వెంకట్రామయ్యగారి త్యాగానికి, లౌక్యానికి మునసబు కరణాలిద్దరూ సిగ్గుపడిపోయారు. ఆనాటితో యీ గ్రామంలో కలతలు అంతరించాయనే చెప్పొచ్చు.

వెంకట్రామయ్యగారు గ్రామానికి చేసిన సేవలైతే పలువురి నోళ్ళలోనూ ఆడుతున్నాయిగాని ఆయన అంతరంగిక జీవితం గురించి స్పష్టంగా ఎవరూ చెప్పలేకపోయారు. ఆ విషయంలో నాకు తెలిసింది— ఆయన చిన్న వయసులోనే ఆయన భార్య స్వర్గస్థురాలయినదనీ, ఆ ఆఘాతం ఎప్పటికీ మాననిదయినదనీ, ఆయన గృహస్థుగా గడిపితే చూడాలని గ్రామ ప్రజలంతా ఉవ్విళ్ళూరుతున్నారనీను. అంతగా ఆయన హృదయాన్ని చూరగొన్న ఆయన సతీమణి ఎంత అదృష్టవంతురాలో అనుకున్నాను.

గోడమీద గడియారం

నాను కారణంగా వెంకట్రామయ్యగారికి నాకు మధ్య సన్నిహితత్వం ఎక్కువయింది. తరచుగా ఆయన మాయింటికి రావడము, నేను ఆయన యింటికి వెళ్ళడము జరుగుతూండేవి. ఆయన విజ్ఞాన ఖని, ధనార్జన దృష్టితోకాక కేవలం స్వయం తృప్తికై ఆర్జించిన విజ్ఞానం ఆయనది. అందుకే ఆ విజ్ఞాన కిరణాలలో యీ గ్రామం యింతగా వెలుగొందుతోంది. నానుతో పాటు ఎన్నో పాఠాలు నేనూ నేర్చుకున్నాను.

వెంకట్రామయ్యగారు—నాను, వారిద్దరిని ఎప్పుడైనా చూసినా, మనసులో మెదలినా రాను రాను ఒకే ఒకభావం నిలచిపోసాగింది. అది గురుశిష్యుల సంబంధం కంటె అధికమైనది. అది తండ్రీ కుమారుల అనుబంధం. వెంకట్రామయ్యగారిని నాను తండ్రి స్థానంలో చూడసాగాను. అస్థానంలో ఆయన నాకు కేవలం పూజనీయులు. అంతే. అంతకుమించి ఆలోచనలను పోనీయడానికి భయపడ్డాను. అయితే, అంతకు మించి ముందుకు పోగడానికి లోకం వెరుపలేదు!

పండుటాకులా వణికిపోయాను ఆ పలుకులు విని.

"వెంకట్రామయ్యగారి జీవితంలో వసంతం తేవడానికి నీవు సహాయ పడగలవు" అన్నవి ఆ పలుకులు.

నాతో పనిచేసే ఒక సహ ఉపాధ్యాయినివి ఆ పలుకులు.

"ఇలా అంటున్నందుకు అపార్థం చేసుకోకు నన్ను. మరేవో అర్థాలు కూడ ఊహించుకోకు. చాటునొక మాట అనుకొని బయటకు మరొక మాట అనే తత్వం యిక్కడి ప్రజలకు లేదు. పోతే నాకున్న అభిప్రాయం యిక్కడి ప్రజలనేకులకు ఉంది" అన్నది మళ్ళీ ఆమె.

అప్పటికే నాముఖం వివర్ణమయింది. అపార్థం చేసుకోవలసిన అవసరం యీ గ్రామ ప్రజలతో జీవించే వారెవరికీ కలుగదు. కాని ఆయన పట్ల నాకుపూజ్యభావం తప్ప మరేమీ లేదు. పైగా..పైగా..

"క్షమించు.. అందుకు నాకు అర్హత లేదు." అన్నాను. అదే నా అభిప్రాయం కూడాను. ఆమె వెళ్ళిపోయింది. మనసు నా గత చరిత్ర పుటలలోనికి మళ్ళింది.

"వెంకట్రామయ్యగారి జీవితంలో వసంతం తేవటం అనే అవకాశం లభించడం ఏ స్త్రీకైనా ఒక వరం లాంటిది. అయితే నేనొక అనామక స్త్రీని, ఒక అనామక పురుషునికి భార్యగా కొంతకాలం జీవించినదానిని. నాకలాటి వరం లభించే అర్హత లేదు.

చుట్టూ ఉన్న ప్రపంచాన్ని గ్రహించే వయసు రాగానే నేనొక అనాథ శరణాలయంలో పెరుగుతున్నట్టు గ్రహించాను. మమతలు తెలియని బ్రతుకు అది. ప్రపంచానికి అవసరంలేని వస్తువులను వేటినో పోనీగదా అని ఒకచోట కూర్చినట్టు భావించే వారు అనాథ శరణాలయం అధికారులు. ఆ వస్తువుల అస్తిత్వం ఏ రీతిగ ఉన్నా వారికి అనవసరం. ఆ వస్తువులు మరొక స్థితిలో నుంటేపూర్తిగా వినాశం చెందేవని, ఆ వినాశం నుండి కాపాడారు కాబట్టి అంతకంటె చెయ్యవలసిన దేముందని వారి ఉద్దేశం. ఆ పరిస్థితులలో పెరిగే వారిలో చాలమంది అపరిపక్వంగానే ఉండిపోయేవారు. వ్యక్తిత్వం, హృదయం, అనుభూతులు యిలాటి వేవీ వారిని అంటేవి కావు. అలాటివి అంటడం శరణాలయాధికారుల అభిమతం కూడ కాదు. అవి లేనిపోని సమస్యలకు దారితీస్తాయని, అప్పటికే వారు ఒలకబోస్తున్న సహృదయత అపరిమితమైనదని వారి అభిప్రాయం. అయినప్పటికీ వారికి సమస్యలను రేకెత్తించడానికి నాలాటి వారు అడపాతడపా తగులుతూనే ఉండేవారు. నాతోపాటు మరో యిద్దరు అమ్మాయిలు కూడ ఉండేవారు. మా ఆలోచనలెప్పుడూ ప్రస్తుతానికి మరో రెండడుగులు ముందు ఉండేవి. మాలాటి వారు ఒకరిద్దరుండడం అధికారులకూ యిష్టమే, ఫలానా శరణాలయం పిల్లలు మంచి మార్కులతో చదువులు చదువుతున్నారంటేను, వక్తృత్వపు పోటీలలో గెలుస్తున్నారంటేను, లలితకళలలో ఉత్సాహం చూపిస్తున్నారంటేను దానివలన వచ్చే కీర్తి ఆ అధికారులకే దక్కుతుంది.. అయితే మేము మిగిలిన పిల్లలను చెడిపివేస్తామేమో? నని అధికారుల భయం.

ముఖ్యంగా పదునాలుగు, పదిహేను సంవత్సరాల వయసు వచ్చిన పిల్లలందరకూ "తమ భవిష్యత్తేమిటి?" అన్న ప్రశ్న ఎదురయేది. స్వతహాగా ఆలోచించుకోడానికి

గోడమీద గడియారం

శక్తిలేని చాలమంది ఆ విషయంలో సలహా తీసుకోడానికి నాలాంటి వాళ్ళ చుట్టూ గుమిగూడేవారు. నాకు సాహిత్యం అంటే అభిరుచి ఎక్కువగా ఉండేది సాహిత్య పఠనంతోపాటు స్వప్నప్రపంచంలో విహరించడమూ అలవడింది. అందువలన నా ఆలోచనలెప్పుడూ ఆకాశంలోనే ఉండేవి.

"మిమ్మల్నందర్నీ ఒక్కొక్క అందాల రాజకుమారుడొచ్చి పట్టుకుపోతారు లెండర్రా, భయమెందుకు?" అనేదానిని.

నేను స్కూల్ ఫైనలు వరకు చదివి, ఆతరువాత మధ్యమ తరగతులకు ఉపాధ్యాయినిగా ట్రైనింగ్ అయ్యాను. నేను ఉద్యోగంచేసి శరణాలయానికి సహాయపడాలని అధికారుల అభిప్రాయం. నాకూ పెద్ద అభ్యంతరం ఏమీ లేకపోయింది. కాని విధాత మరొకలా చూశాడు.

ఆరోజు మేమంతా తోట పనిలో మునిగి ఉన్నాం. టక్ టక్ మని బూటుల చప్పుడు చేసుకుంటూ చక్కని దుస్తులలో ఉన్న ఒక యువకుడు శరణాలయం ఆఫీసు గదిలో ప్రవేశించాడు. మా అందరి దృష్టి అటే మళ్ళింది.

"ఈ సుందర రాజకుమారుడు ఎవరి కోసమొచ్చాడేవ్?" అనుకొని "నీ కోసమంటే, నీ కోసమని" పరిహాసించుకున్నాం.

ఒక అరగంట గడచిన పిమ్మట ఆ యువకుడు బయటకు వచ్చి తోటపని చేస్తున్న మమ్మల్నిందర్నీ పరికించి చూశాడు. క్రీగంట మేమూ చూశాము. అందరి కళ్ళకు నవ మన్మథుడిలానే కనిపించాడతడు. ఎవరి రొట్టె విరిగి నేతిలో పడుతుందోనని అందరకు ఆశగానే ఉంది.

ఆయువకుడు లోనికి వెళ్ళడం, నాకోసం పిలుపు రావడం ఒకేసారి జరిగాయి. నిజమే, ఆ యువకుడు తన ప్రేయసి నెన్నుకోడానికే వచ్చాడు. అతనికి నేను నచ్చాను. శరణాలయాధికారులు అతిగర్వంగా చెప్పుకున్నారు.

"శరణాలయం చరిత్రలోనే యిలాంటి అదృష్టపు ఘడియలు అరుదుగా కలుగుతుంటాయి. మాతోపాటు యీ అదృష్టాన్ని పంచుకొన్న నీకు మా అభినందనలు. శరణాలయాన్ని మరచిపోకు."

నా కలలు పండాయన్న అనుభూతి అక్షణంలో నాకూ కలిగింది.

మా వివాహం అనంతరం ఆయన పట్నంలో కాపురం పెట్టారు, రోజులు క్షణాల్లా దొర్లిపోసాగాయి. షికార్లకు, సినిమాలకు కొదువ ఉండేదికాదు. ఏమి నా అదృష్టం అని మురిసిపోయే దానిని.

రోజులు వత్సరాలయాయి. ఒకట్కి రెండు, మూడు—మూడు సంవత్సరాల వివాహపు జీవితం గడిపిన తరువాత ఏదో వెలితి కనిపించింది. నా భర్త జీవితంలో ఏదో రహస్యం యిమిడి ఉన్నట్టు గ్రహించాను. ఆయన తన అంతరంగిక విషయాలు ఏనాడూ నాతో చర్చించలేదు! ఉండబట్టలేక నేనే అడిగేశాను ఒకనాడు.

"ఏమండీ, నాకు అత్తా, మామ, ఆడపడుచులు, మరదులు ఎవరూ లేరా? ఇంతవరకు ఎన్నడు ఆ విషయాలు నాకు చెప్పలేదు."

ఎందుకో ఆయన ఉగ్రుడైపోయాడు.

"వ్యవహారం చాలవరకు వచ్చిందే?" అన్నాడు.

ఆ వాక్యానికి అర్థం నాకు తెలియలేదు. నేను ఆయన దగ్గర ఏమీ వ్యక్తిత్వంలేని మనిషినా? కేవలం దాసినా? అన్న ప్రశ్నలు ఉదయించాయి. అదే ఆయన ఉద్దేశమని తరువాత రోజులు నిరూపించాయి. ఆయన రహస్యాన్ని కనిపెట్టడానికి నేను చేసిన యత్నాలన్నీ విఫలమే అయ్యాయి.


అతడు నైతికంగా అతిబలహీన స్థితిలో ఉన్నట్టు గ్రహించడానికి మరెంతో కాలం పట్టలేదు. మా వివాహమైన కొత్తలో ఉన్న బురఖా తొలగిపోయింది. నన్ను అతిహీనంగా చూడ నారంభించాడు.

నాను కడుపులోపడిన ప్రథమ మూసాలవి. ఎవరో స్నేహితుడంటూ ఒక వ్యక్తిని తీసుకువచ్చాడు నా భర్త. "ఇప్పుడే బజారుకు వెళ్ళి వస్తా"నంటూ ఆ 'స్నేహితుడి'ని యింటి వద్దనే విడిచి వెళ్ళిపోయాడు. ఆ 'స్నేహితుడు' తిన్నగా పడక గదిలోకి దారితీసాడు. అతని ప్రవర్తన విచిత్రమే అనిపించినా 'పాపం అలసిపోయాడు లాగుంద'ని సరిపెట్టుకొని వంటగదిలో నా పనిలో నేను మునిగిపోయాను. కొన్ని క్షణాల అనంతరం ఆ 'స్నేహితుడు' విసురుగా వంటగదిలో ప్రవేశించి నా భుజాలు పట్టి కుదుపుతూ—

"ఏమిటీ ఆలస్యం?" అని ఘర్జించాడు:

కొయ్యబారిపోయాను! విషయం అవగాహనమయింది. చెంప పెట్టుతో గాని ఆ 'స్నేహితుడు' యిల్లు విడిచి పోలేదు.

"అనాథ శరణాలయంలో పెరిగిన దానివి ఎలా బ్రతికితేనేం?" అంటాడు నా భర్త


యూరోపా, అమెరికాలకు ఎగుమతి నిమిత్తం ప్రత్యేకంగా సృష్టితమై బయల్పరచబడ్డ సౌఖ్యానందకరమైన సబ్బు, ఇపుడు ఎన్నికగా భారతదేశంలో అమ్మకమగుచున్నది!
గోద్రెజ్ సాండల్...శుద్ధమైన మైసూర్ చందన నూనె నుండి నైపుణ్యంగా మిశ్రమం చేయబడిన ఉల్లాసకరమైన ప్రశస్తమగు నిలవుండే పరిమళం గలది...ఇట్టి వాటిలో చాలా కాలం నిలవుండే చాలా పెద్ద సబ్బు నేడే దీనిని వాడి చూడండి. దాని హాయిగొలిపే పరిమళం మీ కెంతో ప్రీతిమైనది!
గోద్రెజ్ సాండల్
...అందరూ ఆనందించగల సౌఖ్యదాయకం
సమర్పితం
క్రొత్త
గోద్రెజ్
సాండల్
Sandal
LUXURY SOAP
Godrej
గోద్రెజ్
సబ్బులలో
ఉత్తమ
నామము
Godrej

నా కలలలోని అందాల రాజకుమారుడా!
ఎంత అమానుషం! వాలోని అభిమానం పడగవిప్పి బుస్సుమంది. నైతిక విలువలు కోల్పోయిన వ్యక్తి అతడొక పురుగు కంటె హీనంగా కనిపించసాగాడు.

ఉదర పోషణార్థం నాలుగిళ్లలో 'ప్రైవేటు' కుదుర్చుకున్నాను.

నాసుకు నాలుగు సంవత్సరాలు నిండిన

గోడమీద గడియారం

తరువాత 'అతడు' చనిపోయాడు.

ఈ గ్రామంలోని ఉపాధ్యాయుని జీవితంలో చల్లని వెన్నెలలాటి దినాలు ప్రారంభమయాయి.

* * *

వెంకట్రామయ్యగారి శిక్షణలో నాను

వ్యక్తిత్వం సర్వతోముఖంగా వికసించింది. చిన్ననాటి బీజం పడగా వెంకట్రామయ్యగారి అండదండలతో 'డాక్టర్' అయ్యాడు.

వెంకట్రామయ్యగారి యిల్లు హాస్పిటల్ కోసం ఏనాడో నిర్ణయమైపోయింది. హాస్పిటల్‌కు కావలసిన పరికరాలన్నీ ఏర్పాటయ్యాయి.

'హౌస్ సర్జన్' ముగించుకొని నాలుగు దినాలలో గ్రామానికి చేరుకుంటున్నట్లు నాకు దగ్గర నుండి ఉత్తరం అందినది. ఆ శుభవార్త నందజేయడానికి వెంకట్రామయ్య గారింటికి బయలుదేరాను. దారి పొడవునా కుడి కన్ను అదరసాగింది. "ఏమిటీ దుశ్శకునం, వెనక్కు మళ్లితే" అనుకున్నాను.

వెంకట్రామయ్య గారింటిని సమీపించాను. వీధి తలుపులు చేరవేసి ఉన్నాయి. అలా ఉండగా నేనెప్పుడూ ఆ యింటిని చూడలేదు. తెరచి ఉన్న ద్వారంతో కలకలలాడుతూ వచ్చేవారలను ఆహ్వానిస్తున్నట్లు ఉండేది ఎల్లప్పుడూ ఆగృహం. ఇప్పుడేదో క్రొత్త వాతావరణం ఆ యింటిని పట్టుముట్టి కాంతిహీనం చేసినట్టున్నది.

తలుపులను తోసి మెల్లగా లోనికి తొరబడ్డాను.

"టక్ టక్..టక్ టక్" మంటూన్న గడియారం శబ్దం తప్ప మరే అలికిడి లేదు.

గది మధ్యగా మంచంపై వెంకట్రామయ్యగారు పడుకొని ఉన్నారు. కనులు మూసి ఉన్నాయి. దగ్గరకు వెళ్లి నుదుటి మీద చెయ్యి వేసి చూసాను. నళ్లు ఎంసల కాగిపోతోంది. పరుగెత్తుకొని ఊళ్లో వాళ్లనందరనూ పిలుచుకు రావాలనిపించింది. నాచేతి స్పర్శకు ఆయన కనులు విప్పి చూశారు.

"వచ్చావా నాన్నా సుశీలమ్మా! అబ్బాయి, నాకు నాలుగు రోజులలో వస్తున్నాడు కదూ" అన్నారు.

"దాంతేలిగాని ఏమిటి మీకీ పరిస్థితి? ఎన్నాళ్ళ నుండి యిలా ఉన్నారు? ఎవరూ దగ్గర లేరే? ఎవరికీ తెలియదా? మందు తీసుకుంటున్నారా?" ప్రశ్న వెంట ప్రశ్న నా నోటి నుండి వెలువడ్డాయి కంఠం రుద్ధమయిపోయింది.

ఆయన మెల్లగా సమాధానం యిచ్చారు "అనేకం తెమ్మాలేకు సుశీలమ్మా. నాకు అంత్యకాలం సమీపించింది. గత కొన్ని దినాలుగా ఏదో పిలుపు వినవస్తోంది. అది యిప్పటికి స్పష్టపడింది. అది నా భార్య

సరోజ పిలుపు. ఎన్నో దినాల నుండి ఎదురు చూస్తున్న పిలుపు. మేమిద్దరం త్వరలోనే కలుసుకోబోతున్నాం. మనసు పరవళ్ళు తొక్కుతోంది. నీకు కూడ సంతోషంగా లేదూ? నాలుగురోజుల్లో వాసు రాబోతున్నాడు. ఆతరువాత మరి రెండురోజులు

''నీవు, వాసు అనిర్వచనీయమైన ఆహ్లాదాన్ని కలిగించారు నా మనసుకు. నేను మీపట్ల చూపించిన అనురాగంలో స్వార్థముంది సుశీలమ్మా! అది ఎలాటి స్వార్థమో యీ పుస్తకం చదివితే నీకే తెలుస్తుంది. నా జీవితాన్ని సంక్షిప్తంగా యిందులో పదిలపరచాను. ఈ పుస్తకాన్నియడానికి నీకంటె మరెవ్వరూ ఆప్తులు కనిపించడం లేదు'' తలగడ క్రిందనున్న బైండు పుస్తకం తీసి నాకు అందించారు ఆయన.

ఆయన మాటలు ఎలా ఉన్నా ఆయన్ని రక్షించుకోడానికి ప్రయత్నం చేయడం మన విధి. మునసబు కరణాలకు అటునుండే వెళ్ళి సంగతి తెలియజేసాను. వారు పరుగు పరుగున వెంకట్రామయ్యగారి సన్నిధికి చేరారు. ఆక్షణం నుండి వెంకట్రామయ్యగారివద్దనే ఆయనకు సేవచేస్తూ గడిపాను.

రోజూ పట్నం నుండి డాక్టరు వచ్చి 'యింజక్షన్లు' మందులు యిచ్చి వెళుతూండేవాడు. అయినా ఆయన స్థితిలో మార్పు రాలేదు.

నాలుగురోజుల తరువాత వాసు వచ్చాడు. వెంకట్రామయ్యగారిని ఆ స్థితిలో చూసి నిర్విణ్ణుడై అయిపోయాడు. ఆయన ప్రక్కనే కూర్చొని ఘడియ ఘడియకు ఆయన స్థితిని పరీక్షించేవాడు.

క్షణక్షణానికి కనుల ముందే ఆయన క్షీణించి పోతున్నట్లయ్యారు. ఆయన విశ్రాంతికై కనులు మూసినపుడు ఆయన నాకు ప్రసాదించిన పుస్తకాన్ని విప్పి ఆయన గత జీవితంలోకి తొంగి చూసేదానిని. అనేక సంవత్సరాలుగా అనుక్షణం కుతూహలం రేపుతూ మనసులో ఖాళీగా ఉండిపోయిన ఆయన జీవితభాగాలు యిప్పటికి నిండాయి. ఆయన ఆర్భాటంగా తన జీవితాన్ని వర్ణించుకోలేదు. అతి క్లుప్తంగా రేఖా మాత్రంగా వ్రాసుకున్నారు.

ఆయన జీవితం నుండి వెలుతురు నిష్క్రమించిన క్షణాలు: ''సరోజ శాశ్వతంగా కనులు మూసినది. ఇంటిని వెలుతురుతో నింపివేయాలని కోరిక పడ్డది. కాని ఆ వెలుతురు తననే మింగి నానుండి తీసుకు పోయింది. రాబోయే బాబు గురించి తొమ్మిది నెలలు కిలకిలలాడాను. కానుపు కష్టమయింది. కానుపు ప్రారంభమయిన తరువాత ఆపరేషన్‌తో గాని తల్లీ బిడ్డ బ్రతకరని తెలిసినది. ఈ గ్రామంలో హాస్పిటల్ లేదు. పట్నం చేరేలోగానే అవరి మితమయిన బాధకు గురియై అసువులను బాసినది.''

ఆయన జీవితంలో వెలుతురు పునః ప్రవేశించిన క్షణాలు: ''రాత్రి స్వప్నంలో సరోజ సాక్షాత్కరించినది. పిల్లన గ్రోవిని పెదవుల కానించి మ దు మధుర నాదముతో నన్ను మేల్కొలిపినది. నేను తన దరిచేర పోవడం చూసి నాకు దూరంగా కదల నారంభించినది. గ్రామం మధ్యనున్న ఒక గృహంలో ప్రవేశించినది. నేను తిరిగి వచ్చేశాను. ఆ గృహం నుండి ఆ మధుర నాదం వినవస్తూ అలాగే ఉండిపోయింది. ఈ రోజు ఆ గృహంలో యీనాటి పాఠశాలలో పని చేయడానికి వచ్చిన పంతులమ్మ, ఆమె నాలుగేండ్ల ముద్దుల తనయుడు దిగారు.''

చివరి పుటలలో ఆయన తనపై వ్రాసుకున్న వ్యాఖ్యానము: ''జీవిత సంధ్యలో అడుగు పెట్టాను. సరోజ పిల్లనగ్రోవి నాదము యిప్పుడు యీ యింటి నుండే వినవస్తోంది. అది సన్నాహ్వానిస్తూ నా కోసం ఎదురు చూస్తున్నట్లు తెలిపే సూచన.

''సరోజ వదలి వెళ్ళిన గాఢాంధకారాన్ని సరోజే విచ్ఛిన్నం చేసింది. తన అంశలను కూడి యీ భూమిపై పెరుగుతున్న పేరోకరిని నాసాన్నిధ్యంలోనికి చేర్చినది, సుశీలమ్మలో సరోజ, వాసులో మేము కలలు కన్న బాబు గోచరించారు. వారి సాన్నిధ్యాను భూతి సరోజ పిల్లనగ్రోవి నాదమును పోలింది.


''పోతే సరోజకు దేహాంతము కలిగిన అనంతరం ఖాళీకంగా నేను గడిపిన జీవితం కొందరి విమర్శలకు గురి అయింది. అంత త్యాగం చేయవలసిన అవసరం లేదన్నారు.

జీవితం యితరుల కోసం ఉపయోగ పడినంతగా నా కోసం ఉపయోగపడటం లేదన్నారు. నిజమే కావచ్చు. వారి విమర్శలు వింటే నాకు గోడమీద గడియారం గుర్తుకు వచ్చింది. ఇన్ని సంవత్సరాలు పడక కుర్చీలో కాలం గడిపిన నాకూ, నా కెదురుగా ఉన్న గోడమీది గడియారానికీ పోలిక లున్నాయి. నాలాటి వ్యక్తులు యింకా చాలమంది ఉంటారు. వారంతా గోడమీది గడియారం లాటి వారు. వారు యితరుల కోసం మాత్రమే ఉపయోగపడతారు.''

వాసు నన్ను తట్టి చెబుతున్నాడు.

''వెంకట్రామయ్యగారు యిక మనకు లేరమ్మా.''

గదరంతా నిశ్శబ్దం ఆవరించుకొంది. ఎదురుగా చూశాను. గోడమీది గడియారం ఆగిపోయింది. ●





అంతస్థులు అభిమానాలు

ఉన్నవ విజయలక్ష్మి

2

ఉడికీ ఉడకని అన్నం, రుచీ పచీ లేని అధరువులు వేసిపెట్టినా, పంచభక్ష్య పరమాన్నాలు తింటున్నంత సంతోషంగా వుండేవాడు సారథి. ఒక్కోసారి తను చేసింది బొత్తిగా తనకే నచ్చక "ఇవాళ వంట మరీ అధ్వాన్నంగా వుంది. ఎప్పటికి చేతనవుతుందో." అనేది ఇందిర సిగ్గుపడుతూ.

"నీకు తెలియదేమో. నేను ఈమధ్యలో ఎప్పుడూ ఇంత సంతోషంగా భోజనం చెయ్యలేదు. నీ ప్రక్కన కూర్చుని హాయిగా కబుర్లు చెప్తూ తింటూంటే రుచి, ఆకలి, శ్రమ ఏమీ గుర్తుండటంలేదు. రేపు స్కూలు తెరిస్తే ఎలాగో." అనేవాడు.

ఓ ఉదయం ఇందిర లోపల పని చేసుకుంటోంది. "ఇందూ, ఇందూ." సంబరపడుతూ పరుగెత్తుకు వచ్చాడు సారథి.

అతని చేతిలో పేపరు చూసి గ్రహించేసుకుంది ఆ హడావిడికి కారణం.

"మా రిజల్ట్సు వచ్చాయా? నేను ప్యాసయాను కదూ. ఏదీ ఇలా ఇవ్వండి." అంటూనే ఆత్రంగా పేపరు లాక్కోబోయింది.

"అంత బాగా వ్రాసిన నువ్వు ప్యాసవకపోతే యూనివర్శిటీ మొత్తం మీద మరెవరూ ప్యాసవరు" అన్నాడు సారథి సంతోషంగా, రెండు చేతులతోనూ పేపరు వెనక్కి దాచేసుకుని.

"అయితే మీరు నా పేరుకూడా చూశారన్నమాట" ఆశ్చర్యం అభినయిస్తూ అంది ఇందిర.

"అదే, నువ్వు రాస్తున్నప్పుడు.." అతని మాటపూర్తి కాకుండానే,

"అప్పుడు మీరు నా మొహం చూస్తూ నిలబడేవారట" చిలిపిగా నవ్వింది ఇందిర.

"మరోసారి ఆమాట అన్నావంటే, ముక్కు పిండేస్తాను. అయినా నిన్నని ఏం లాభం. ప్చ్, ప్రేమించి పెళ్లి చేసుకున్న మొగవాడి పాట్లు ఇలాగే వుంటాయి." దిగాలు పడిపోయిన సారథి, అంతలోనే సీరియస్‌గా మారిపోయి: "ఇదుగో ఇందూ, నీకింకా చిన్నతనం. ఏం మాట్లాడాలో ఏం మాట్లాడకూడదో తెలియదు. ఇలా అప్రమాణము వాగుతూ కూర్చున్నావంటే, ఎవరైనా వింటే ఎంత ప్రమాదమో తెలుసా? పరీక్షలలో వాళ్లు కాపీ కొట్టకుండా ఓ కన్ను వేసి వుంచమని నిన్ను పంపిస్తే నువ్వు వెళ్లి చేసిన నిర్వాకం ఇదా. ఇంక అలాంటి వాడిని పిల్లలకి పాఠాలేం చెప్తావ్. హాయిగా ఇంట్లో కూర్చుని ఆ అమ్మాయి మొహం చూస్తూండు. అని చెప్పేస్తారు." అంతవరకు నటించిన గాంభీర్యం కాస్తా ఇందిర నవ్వుమొహం చూసేసరికి చెదిరిపోగా ఫక్కున నవ్వేశాడు.

"ఇంక కబుర్లు చాలుకాని, ముందా పేపరిటివ్వండి. మా అక్క నెంబరు చూడాలి" అంటూ బలవంతాన గుంజుకుని చూస్తూనే సంబరపడిపోతూ, "తను ప్యాసయింది. ఈ ఏడు కూడ పోతుందేమోనని బెంగ పెట్టుకుంది పాపం." అని, "మా ఫ్రెండ్సందరి నెంబర్లు వ్రాసి పెట్టాను. చూద్దాం వుండండి" అంటూ గదిలోకి వెళ్లబోతున్న ఇందిర చెయ్యి పట్టుకుని ఆపి,

"ఇంత మంచి వార్త పట్టుకొచ్చినందుకు నాకు బక్షీష్ ఏమీ లేనేలేదు. ఊళ్లో వాళ్లందరి నెంబర్లూ చూస్తానని వెళ్లిపోతావేమిటి?" అన్నాడు.

"నిజమే మరచిపోయాను." అని ఒక్క క్షణం ఆలోచించి, చిన్నగా నవ్వుతూ, "కాస్త ఆలశ్యం అవుతుంది మరి. మీరు ఈ పేపరు తీసుకుని వెళ్లి ఒక్క అరగంట వాకిట్లో కూర్చున్నారంటే, విందు భోజనానికి ఏర్పాట్లు చేసి పిలుస్తాను." అంది.

"చంపావ్! నిన్న చేసిన లాంటి స్పెషల్ ఏదైనా తయారవుతోందేమిటి లోపల. ఇప్పుడలాంటి ఎక్స్పెరిమెంట్లేం చెయ్యకు నీకు పుణ్యముంటుంది." హాస్యంగా అని,

"నిజం చెప్పాలంటే నేనే నీకు మంచి బహుమతి ఇవ్వాలి. అడుగు ఏం కావాలో" అన్నాడు అభిమానంగా ఆమెని దగ్గరకు తీసుకుంటూ.

"నాకింకే బహుమతి అక్కర్లేదు. మీరు చాలు." అంది ఇందిర ఒరిగిపోతూ.

"ఈ హాస్యానికేంలే. నేను నిజంగానే అడుగుతున్నాను."

"నేనూ నిజంగానే చెప్తున్నాను."

"అవున్లే. దొరికిన దాంతోనే తృప్తి పడటం నేర్చుకోకపోతే, ఈ బీద బడిపంతులు ఏ కోరిక తీర్చగలడని అడుగుతావు. ఈపాటికి మీ అక్క ఏ నెక్లెసో కొట్టేసి వుంటుంది బహుమతిగా" నవ్వుతూ నవ్వుతూ అతను అన్న ఆ మాటలు ఇందిర హృదయంలో కలుక్కున గుచ్చుకున్నాయి.

"నేనెప్పుడైనా అన్నానా మీరు నాకేం ఇవ్వలేదని." అంది ఎలాగో అయిపోతూ.

"నువ్వు అనకపోయినా పరిస్థితులని నేనూ మాత్రం అర్థం చేసుకోలేనా. పాపం మీ నాన్నగారు ఇద్దరికీ ఒక్కలాగ కట్నం అదీ ఇచ్చి అన్నీ సమంగా జరిపినా, ఆవతలి వారిముందు మేమెంత తక్కువగా వున్నామో అడుగడుగునా గ్రహించుకోగలిగాను. అందుకే నేను సిగ్గుపడుతూంటే, వచ్చిన బంధువులందరూ మీ అక్క అదృష్టాన్ని పొగడుతూ నీకేదో అన్యాయం జరిగిపోయినట్లు సానుభూతి కురిపిస్తూ మాట్లాడటం కూడ నా చెవులని తప్పించుకు పోలేదు.

ఆ సమయంతో నువ్వెంత చిన్నబుచ్చుకుని వుంటావో వూహించుకోగలిగి కూడ...''

''అబ్బబ్బ. మీ వుపోద్ఘాతాన్ని కాస్త కట్టేస్తారా?'' చికాగ్గా అతని మాటలకి అడ్డు తగిలింది. కానీ అంతలోనే ఆమె గొంతు ఆర్ద్రంగా మారిపోయింది. ''నేనెప్పుడూ చిన్నబుచ్చుకోలేదు. ఇందాక చెప్పాను కదూ, మిమ్మల్ని మించిన బహుమతి నాకేం లేదని, అదే అప్పుడు కూడ అనుకున్నాను. నేను మిమ్మల్ని కోరుకునేది ఒక్కటే, మీరు ఇంకెప్పుడూ ఆ విషయం గురించి మాట్లాడవద్దు. అవమానాల్ని సహించి మరిచిపోవటం కష్టమే అయినా మీరు అప్పటి సంగతులన్నీ మరచిపోగలిగితే సంతోషిస్తాను. మీరిలా మాట్లాడితే, మాత్రం విని నేను భరించలేను.'' అంది ప్రక్కకి తిరిగి కళ్ళు ఒత్తుకుంటూ.

సారథి తెల్లబోయాడు. చటుక్కున ఆమెని తన వేపుకి తిప్పుకుని జాలిగా కళ్ళల్లోకి చూస్తూ, ''ఏడుస్తున్నావా ఇందూ, ఛ. అర్థం లేకుండా ఏదో మాట్లాడి నీ మనస్సు నొప్పించాను. ఇంకెప్పుడూ అలాంటి హాస్యాలు చెయ్యను.'' అన్నాడు బ్రతిమాలుకుంటున్నట్లు. అతని గొంతులో బాధ స్పష్టంగా ధ్వనిస్తోంది.

కళ్ళు తుడవబోయిన భర్త చేతులు విడిపించుకుని చిన్నగా నవ్వి, లోపలికి వెళ్ళిపోయింది ఇందిర.

కాస్సేపటి తరువాత సారథి మళ్ళీ అదే ప్రశ్న వేశాడు. ''ఇంతకీ నేనడిగిన దానికి సమాధానం చెప్పలేదు.'' అంటూ.

''చెప్పానుగా నాకేమీ అక్కర్లేదని.''

''ఊహూ. అదేం కుదరదు. నా శక్తికి మించనిది నేను తీర్చగలిగేదీ ఏదైనాసరే, అడుగు. ఇంత సంతోషకరమైన రోజున నువ్వు అడిగింది ఇవ్వగలిగాననే తృప్తి నాకు మిగలాలి.''

అందంగా నవ్వేసింది ఇందిర.

''నవ్వడంకాదు. చెప్పు. పోనీ నాచీకోని ఇవ్వనా చాలకాలం వుంటుంది.''

క్షణం స్థిరంగా భర్త కళ్ళల్లోకి చూసి తల వాల్చేసుకుంది. ''నాచీ వద్దు కానీ, ఆ డబ్బుతో నా కింకోటి కావాలి. చాల కాలమేకాదు. శాశ్వతంగా వుండి పోతుంది. అది మీరేస్తే అనుకోనంటే చెప్తాను.'' అంది మెల్లిగా.

''అనుకోడమా, అబ్బె అదేం వుండదు. నీకు నేనాట ఇస్తున్నా. అడుగు మరి.'' లాలనగా అడిగాడు సారథి. ఇందిర కాస్త బెదురుతూనే చెప్పింది ''అయితే నాకు ఇంటరు పుస్తకాలు తెచ్చిపెట్టండి. మీకు కాస్త తీరుబడిగా వున్నప్పుడు చెప్తూండురుగాని.''

భార్య కోరిక వింటూనే సంతోషంతో



ఆమె రెండు భుజాల మీద చేతులు వేసి అనురాగంతో ఆమె కళ్ళల్లోకి చూస్తూ, ''ఇంతమంచి కోరిక కోరుకోడానికి అంత సేపు సందేహించా వెందుకు ఇందూ. నేను కాదంటానని ఎలా అనుకున్నావు. అసలు చదువుకోవాలనే కోరిక, ఆసక్తి చాల కొద్ది

మందికే వుంటుంది. ఆ ఆసక్తి తప్పక వుండటమే ఒక అదృష్టం. అలాంటి అదృష్టాన్ని నేను తుంచేస్తాననుకున్నావా? ఇంటరుతో ఆపేయకుండా నువ్వు బి. ఏ., ఎమ్. ఏ., కూడ చదవాలి. నా కంటె ఎక్కువ చదువుకున్నావని నేనెప్పుడూ అసూయపడను. నాభార్య ఎంతో తెలివైనది. ఇంట్లోనే చదువుకుని ఎమ్. ఏ. ప్యాసయింది అని నలుగురికీ గర్వంగా చెప్పుకోగలగడం నా కెంతో సంతోషాన్నిస్తుంది.'' అన్నాడు. ఆగర్వం సంతోషం ఇప్పుడే అతని గొంతులో పోటీ పడుతున్నాయి.

అంతస్తులు – అభిమానాలు

"నా ఆసక్తిని అభిలాషని అర్థం చేసుకుని నన్ను ప్రోత్సహించే భర్త దొరికారని చెప్పుకోగలగడం నాకూ గర్వకారణమే." అంది కళ్లల్లో సంతోషం పెదవులపై చిరునవ్వు మెరుస్తూండగా. చిరునవ్వుని చుంబించాడు సారథి...

కళ్లల్లో నిండిన నీళ్లు టపమని చెంపల మీదికి జారటంతో ప్రకృతంలోకి వచ్చిన ఇందిర, వులిక్కిపడినట్లు నాలుగు వేపులకీ చూస్తూ గబగబ కళ్లు తుడిచేసుకుంది. అంతలోనే తన ఖంగారుకి తనే నవ్వుకుంది కూడ. ఇంట్లో ఎవరూ లేరన్న సంగతి గుర్తులేక పోవడమే కాకుండా తలుపు లైనా వేసుకోని తన మందమతితనానికి, కాస్త వ్యవధి దొరికితే చాలు ఏదో ఆలోచిస్తూ కూర్చునే తన బలహీనతకి లోలోపలే విసుక్కుంటూ తలుపులు గడియ వేసి లోపలికి వెళ్లింది. గదిలో మంచం మీద పద్మ ఉండలా పడేసిన చీర జాకెట్లూ సగం సగం క్రిందికి జారిపోతున్నాయి. "అబ్బ, దీనికి ఒబ్బిడి అనేది అసలు లేదు. ఎన్నేళ్లు వచ్చినా ఇంతే." అనుకుంటూ అవి తీసి మడత పెట్టి స్టాండ్ మీద పడేసింది. టేబిల్ నిండా పుస్తకాలు, వారపత్రికలు, లాజాపేపర్లు చిందరవందరగా పడి వున్నాయి, అవన్నీ సరిగ్గా సర్దిపెడుతూంటే దాని మీదే వున్న ఆల్బమ్ మీద ఆమె దృష్టి పడింది. మళ్లీ ఎవరైనా వస్తే తనకి అవకాశం వుండదేమో అన్నట్లు ఆత్రంగా, దగ్గరగా పెట్టుకుని గబగబ మొదటి పేజీలు తీసింది. అవి ఆమె తరుచు చూస్తూండేవే. చూసిన ప్రతిసారి ఆ ఫోటోలు ఆమె గుండెలని పట్టి పిండుతూ గతాన్ని కళ్లముందు పరచి చూపిస్తున్నట్లుంటుంది. ఒక్కసారి బాధగా నిట్టూర్చి ఆల్బమ్ మూసి యధాస్థానంలో పెట్టి లేచి వెళ్లిపోబోయింది. కాని శరీరమూ మనసూ ఏకమై ఎదురు తిరిగాయి. మళ్లీ అది చేతిలోకి తీసుకుంది. అలా ఆ పేజీలు తిప్పుతూంటే అలాంటివే ఎన్నో ఫోటోలు ఆమె కళ్లముందు గిరగిరా తిరుగుతూ గడచిపోయిన జీవితంలోని ప్రతి చర్యనీ ప్రతి క్షణాన్నీ సజీవంగా కనిపించేటట్లు చేస్తున్నాయి...

"పరీక్షలకి ఇంకా ఎంతో వ్యవధి వుందిగా. ఇప్పటి నుంచి ఇంత దీక్షగా చదవటం ఎందుకు. అందులో..." సిగ్గుతో ముడుచుకుపోయిన ఇందిర అతన్ని ఆ వాక్యం పూర్తి చెయ్యనివ్వకుండా,

"అయిపోయింది. ఈ ఎస్సేపూర్తి చేసేసి పడుకుంటాను." అంది తల యింకా క్రిందకి వంచేసుకుని రాసుకుంటూ.

"ఈసారి ఆదివారం కూర్చుని అవన్నీ నేను రాసి ఇస్తానుకాని ఇంక ఇవాళ్టికి చాల్లే. ఈ సమయంలో చదువుకాదు ముఖ్యం, నీ ఆరోగ్యం." అంటూ గబగబ తనే పుస్తకం మూసేసి ఇందిర చేతిలో పెన్ను తీసుకుని ప్రక్కన పెట్టేశాడు, సారథి.

"ఎంత చదివినా ఇప్పుడే. ఇంక మావూరు వెడితే తెలియనివి చెప్పించుకోడానికి కూడ ఎవరూ వుండరు." అంది ఇందిర దిగులుగా.

"నీకెందుకు. నిన్ను ప్యాసు చేయించే భారం నాది. నువ్వు మళ్లీ వచ్చేసరికి అన్నింటికి నోట్సులు వ్రాసి అట్టే పెట్టేస్తాను. అవి నువ్వసలు చదవక్కర్లేదు. ఓసారి అలా కళ్లతో చూస్తే చాలు నీ మనస్సుకి పట్టిపోయి పరీక్షలో వ్రాసేయ గలవు. కాని— నాకో సందేహం..." చిలిపిగా ఇందిర కళ్లలోకి చూసి నవ్వాడు.

చురుగ్గా చూసి తల తిప్పేసుకుంది ఇందిర.

"ఇటు తిరుగు చెప్తాను మరి.." అంటూ గడ్డం పట్టి ఆమె మొహం తన వేపుకు తిప్పుకుని, "తరువాత నువ్వు బుజ్జిగాడి ధోరణిలో పడి, ఈ చదువూ గిదువూ నావల్ల కాదంటూ పుస్తకాలన్నీ బొత్తిపెట్టి అలమారులో పడేస్తావేమో, నేను హైరానపడి అన్నీ చదివి నోట్సులు వ్రాసిందంతా ఎందుకూ పనికి రాకుండా పోతుందేమోనని ఇప్పటినుంచే భయంగా వుంది." సమాధానం చెప్పితీరాలి అన్నట్లున్నాయి అతని చూపులు.

ఇందిర మాట్లాడలేదు. మునిపంటితో క్రింది పెదవినొక్కిపట్టి రాబోతున్న నవ్వుని ఆపుకుంటూ, పెన్ను తీసి అరచేతిలో వ్రాసుకోడం మొదలు పెట్టింది.

తనకి కనిపించకుండా, మొహానికి దగ్గరగా పెట్టుకుని ఆమె వ్రాసిందేమిటో, చూడాలని ఆత్రంగా చెయ్యి అందుకున్నాడు సారథి.

"మీకా భయం ఏమీ అక్కర్లేదు" అని వుంది.

"గుడ్" ఆ చేతితోపాటు ఇందిరని కూడ దగ్గరికి తీసుకున్నాడు.

ఎలాంటి వేడుకలు ఇష్టంలేదని, అతి మామూలుగానే తల్లి వెంట పుట్టింటికి వచ్చింది ఇందిర. సీమంతం పేరుతో తండ్రి నాలుగు వందలు వదుల్చుకున్నాక, అంతకు ముందే వచ్చింది సావిత్రి.

ఇందిర వచ్చిందని తెలిసి ప్రక్కింటి సుగుణమ్మగారు చూడటానికి వచ్చి, "మా ఇందిర చదువుకుంటోంది. పరీక్షకి కడుతుంది అంటూ మీవాళ్లంతా తెగచెప్తూంటే నిజమే అనుకున్నాను. చివరికి ఇదా నువ్వు చదివిన చదువు" అంది చనువుగా ఇందిర బుగ్గలు పుణికి.

ఇందిర చెక్కిళ్లు ఎర్రబడిపోయాయి. కాని అంతలోనే ఎలాగో ఆ సిగ్గుని వెనక్కి నెట్టి "మీరు విన్నదాంట్లో అబద్ధం ఏమీలేదు. వచ్చే మార్చిలో కదా నేను పరీక్ష వ్రాయాల్సింది. అప్పటికి వెళ్లగలను. తప్పకుండా ప్యాసవుతాను కూడ." అంది కాస్త ధైర్యంగా.

"చూస్తాంగా. ఈ కబుర్లన్నీ ఇప్పుడే. మీదటికి మరో అమ్మాయి కూడ తయారయిందంటే ఇద్దర్నీ చెరో చంకనీ వేసుకుని తిరుగుతూ, సంసార తాపత్రయంలో మునగానాం తేలానాంగా వుంటుంది నీ పని. ఇంక చదువు సంగీతం కూడ ఎక్కడ?" ఇందిర మాటలని ఆవిడ కొట్టి పారేయాలని చూసింది.

"చూద్దాం. ఎవరి మాట నెగ్గుతుందో. నేను పరీక్షకి వెళ్లడం ఖాయం. ప్యాసవడం ఇంకా ఖాయం. రిజల్ట్సు రాగానే మీకు వుత్తరం వ్రాస్తాలెండి." అంది ఇంకా కాస్త పట్టుదలగా.

సుగుణమ్మగారు ఆప్యాయంగా ఇందిర వెన్ను నిమురుతూ గట్టిగా నవ్వేసి, "సాధారణంగా జరిగే విషయం చెప్పానంతే, నువ్వు పట్టుదలగా చదువుకుని ప్యాసయితే నాకు మాత్రం సంతోషం కాదూ." అని, తను తెచ్చిన పళ్లూ మిఠాయి ఇందిర చేతిలో పెట్టి కాస్సేపు కూర్చుని కబుర్లు చెప్పి వెళ్లిపోయింది.

శలవలు ఇవ్వగానే సారథి వచ్చాడు. ఇందిర వచ్చేసిం దగ్గర నుంచీ అతనికి బొత్తిగా

తోచకపోవడంతోపాటు, తను పుట్టిన పదేళ్ల తరువాత మళ్లీ గర్భవతి అయిన తల్లికి నెలలు నిండగానే పెద్ద జబ్బు చేయటం, అదే ఆమె ప్రాణం తీయటం గుర్తు వచ్చి భయంతో గుండె పట్టుకుపోయేది. ఒకవేళ ఇందుకి కూడ అలాంటి ప్రమాదమే సంభవిస్తే, అనే వూహ వస్తూనే భయంతో ఆపాదమస్తకం జలదరించగా మరో ఆలోచనకి తావు ఇవ్వకుండా ప్రయాణం అయి వచ్చేశాడు. ఆవూరు అంత పెద్దది కాకపోయినా అన్ని వైద్య సౌకర్యాలూ వున్నాయనే వార్త అతనికి కాస్త ధైర్యం కలిగించినా, ఆ బెదురు మాత్రం పూర్తిగా విడిచి పోలేదు. అత్తగారు మామగారు చేస్తున్న మర్యాదలు, బావమరుదులు మరదళ్లు చేస్తున్న హాస్యాలు వేటి మీద అతని దృష్టి వుండటంలేదు. అతని వాలకం కనిపెట్టిన ఇందిర అంది, ''అలా వుంటున్నారేం? భోజనం కూడ సరిగా చెయ్యటం లేదంటోంది అమ్మ. నా కంటె మీరే, ఎక్కువ భయపడుతున్నట్లున్నారు. అత్తయ్యగారిలా....''

''ఛ. అలా ఎప్పుడూ జరగదు. అది బొత్తిగా పల్లెటూరు. వైద్య సౌకర్యం ఏమీ లేకపోయింది. నువ్వు దాన్ని గురించి ఎప్పుడూ ఆలోచించకు. నేను బాబు పేరు కూడ నిర్ణయించేశాను తెలుసా?'' అన్నాడు సారధి నవ్వు తెచ్చుకుంటూ.

కాని ఇందిర నవ్వలేకపోయింది. పెళ్లి అయిన కొత్తలో భర్త చెప్పినదంతా గుర్తు వచ్చింది.

''అప్పటిదాకా శుభ్రంగా తిని తిరుగుతోంది అనుకున్న అమ్మకి నెలలు నిండే సరికి హఠాత్తుగా వాతం కమ్ముకువచ్చింది. ఊళ్లో చదువుకున్న డాక్టర్లుకాని, ట్రెయినింగ్ అయిన మంత్రసానులు కాని లేరు. ఆ నాటు మందులే వాడుతూ ఆమెని అప్పటికప్పుడు బండి మీద ఆస్పత్రికి తీసుకు వెళ్లడానికి ప్రయాణం అయారు. ఆ పల్లెటూరికి శుభ్రమైన రోడ్డు కూడ లేదు. అలాగే అష్టకష్టాలు పడి చివరికి ఆస్పత్రికి చేరుకునే సరికి పరిస్థితి అంతా మించి పోయింది. అప్పటికి నాకు పదేళ్లు. అమ్మపోగానే జీవితం మీద ఒకలాంటి విరక్తి భావం పెంచుకున్న నాన్నగారు నా మీద ఎక్కువ అభిమానం చూపించేవారుకాదు. ఆయన్ని చూసుకుంటూనే తప్తిగా బ్రతకటం నేర్చుకున్నాను నేను. కాని భగవంతుడు మరో రెండేళ్లకే నాకు అది కూడ కరువు చేశాడు. తరువాత గడిచిన **నా జీవితం గురించి చెప్పుకోకపోవడమే** మంచిది. జీవితంలో ఆత్మీయతకి మొహం వాచిపోయిన నాకు ఇన్నాళ్ళకి నువ్వు దొరికావు ఇందూ....''

ఒక్కసారి ఇందిర వళ్లు జలదరించింది. ''నాకేదయినా అయితేను వారికి దూరం అయిపోతే...'' ఆ పైన ఆలోచించడానికి కూడ ధైర్యం చాలడంలేదు.

భార్య ఆలోచనలనీ భయాలనీ వూహించగలిగిన సారధి ఆమెని మామూలు మనిషిని చేయాలని, మ దువుగా ఆమె చేతి వేళ్లు నిమురుతూ

''నువ్విప్పుడేంఆలోచిస్తున్నావోచెప్పనా?'' అన్నాడు. అతని కంఠం చాల వుల్లాసంగా వుంది.

ఇందిర తలఎత్తి ఏమిటన్నట్లు చూసింది.

''ఈ ఒక్క ఏడాదిలో జరిగిపోయిన వాటి నన్నింటిని గుర్తు చేసుకుంటున్నావు. ఆ పరీక్షలప్పుడు ఈ మేష్టారు మావూరు రాకుండా వుంటే ఈసరికి ఎలా వుండేవారు, ఏం చేస్తుండేవారు. ఇంకా స్వయంపాకంతోటే..''

ఫక్కుమంది ఇందిర. వాతావరణం కాస్త ఆహ్లాదకరంగా మారిపోయింది.

(సశేషం)



అవాంఛితం

కొలకలూరి

ఆ సంఘటన గూర్చి విన్న దగ్గర్నుంచి రక్తంలో పోటు పుట్టినట్లయి నిలబడలేక పోతున్నాడు రవి. దిగులుగా వుంది.

బస్సు రాలేదు. ఏ సమయంలో ఏ బస్సుకు ఏమవుతుందోగానీ, ఎదురు చూచే వాళ్లకు మాత్రం ఓర్పు సన్నగిలిపోతుంది. రావలసిన బస్సు చేబ్రోలులో వుందో, పొన్నూరులోనే ఆగిపోయిందో! నారాకోడూరు స్టాండ్‌లో నానా అవస్థపడుతున్నాడు. ప్రతి అరగంటకీ గుంటూరు పోయే బస్సుండాలి, గంటయినా బస్సు రాలేదు, మరి. రవికి నిలబడే ఓపిక తగ్గిపోతూ వుంది. ఎండి నెర్రెలు పడిపోయిన చెరువు గట్టు మీదుగా వుంది గుంటూరు పోయే రోడ్డు. ఉదయం పొలం పోయిన రెండెడ్ల బళ్లు పొలాల్లో నించి ఎరువుతోలి వస్తున్నాయి వూళ్లోకి.

మధ్యాహ్నం ఒంటిగంట. ఎండకాలం సూర్యుడు నడినెత్తి మీద నిప్పులు క్రుమ్మరిస్తున్నాడు. వడగాలి తోలుతూ వుంది. ఊళ్లో పురుగు మెదలటంలేదు. కానీ బస్సు కోసం చూస్తున్న వాళ్లు చెట్టు క్రింద నిలబడక తప్పలేదు.

బస్సు కోసం చూచి చూచి విసుగు పుట్టింది. నుదుటి చెమట తుడుచుకొన్నాడు రవి. అయితే వడగాలి లేకపోతే ఉమ్మద. చొక్కా తడిసిపోయింది. టర్లిన్ షర్టుతో వున్న ఇబ్బందే ఇది. చెమట ఇంకిపోదు. ఆరిపోదు. గాలి తోలదు. మహాకటువుగా వుంది.

అక్కడున్నంత సేపట్లో కాల్చేసిన సిగరెట్ల సంఖ్య గుర్తులేదు. పాకెట్టు కాళీ అయింది. కొందామనుకొని, రోడ్డు ప్రక్కనే చెట్టుక్రింద వున్న బడ్డీ దగ్గరకు పోయి చూస్తే కొట్టులో కూర్చున్న మనిషి, చెమటలు కక్కుతూ గురక పెడుతున్నాడు. నిద్ర లేపితే మండిపడతాడేమోనన్న భయంతో తటపటాయించి, చివరకు ఎలాగో పిలిస్తే, ఉలిక్కిపడి లేచి, బాచిపట్లు వేసు కూర్చుని 'ఏంది' అన్నాడు.

'ఒక బర్క్లీ పాకెట్టు' పర్సులోంచి చిల్లర తీస్తున్నాడు రవి.

'ఏంది?'

రవి మళ్లీ చెప్పాడు.

'లేవు!' కాళ్లు బారజాపి మళ్లీ నిద్ర కుపక్రమిస్తున్నాడు.

'ఏం సిగరెట్లున్నాయి?'

మూసినకళ్లు తెరిచి, ఎగాదిగా చూస్తూ 'చార్మినార్' అనేసి ఆవులించాడు.

'ఒక పొటెట్టివ్వంతో'

పొటెట్టిచ్చి, చిల్లర తీసుకొని, గల్లాలో వేసుకొని కళ్ళు మూసుకొన్నాడు. రవి సిగరెట్టు ముట్టించుకొనేసరికి నిద్రపోయాడు. అక్కణ్ణుంచి బయలుదేరుతుంటే రవికి బస్సు వచ్చినంత గొడవగా గురక వినిపించింది.

బస్సు రాలేదు. చికాకుగా వుంది. ఎవరి నోట వెంట విన్నా ఆ సంఘటనే! అందరూ చిలవలు పలవలుగా ఆ సంగతే చెప్పుకొంటు న్నారు. చిరాకు పుడుతూంది.

రవిది వేజండ్ల. ఎం. ఏ. చదువుకొన్నాడు. పెళ్ళి కాలేదు. చాలా సంబంధాలు వస్తున్నాయి. గుంటూరు మెడికల్ కాలేజీలో ఫైనల్ఇయర్ చదువుతున్న వనం తను ఆమెకు తెలియకుండా చూచి, ఒక అభిప్రాయం ఏర్పరుచుకోవటానికి వెళుతున్నాడు.

మిత్రుణ్ణి తెనాలి బస్సు ఎక్కించి, గుంటూరు బస్సులోనే పోయేందుకు ఆగాడు.

'ఆ పిల్లవాడు—పాపం—ఏం చదువుకున్నాడో' బాధపడ్డాడు ఒకరైతు, చెరువు గట్టు మీద చెట్టు చుట్టూ కట్టిన చప్టా మీద కూర్చుని, చుట్టూ వున్న అందర్నీ చూస్తూ, చుట్టనుసి రాలుపుతూ.

'పాపం దురదృష్టవంతుడు, స్కూల్ ఫైనల్లో ఏమో చదువుకొన్నాడట.' రెండో రైతు చెప్పాడు. వాళ్ళిద్దరూ, అక్కడున్న అందరూ గుంటూరు బస్సు కోసమే ఎదురు చూస్తున్నారు.

ఆ సంఘటనకు సంబంధించి ఏ విషయమూ వినకూడదనుకొన్నా వినిపిస్తుంటే ఏం చేయలేక అనాసక్తంగా వింటున్నాడు రవి.

'ఏం చదువుకొన్న వాడుకాదని ఎవరో అన్నారే.'

'ఆ చదువుకొన్నా చదువుకోకపోయినా ఏంలే. వాడికది రాసి పెట్టి వుంది' రెండో రైతు నిట్టూర్చాడు.

అక్కడున్న అందరూ ఆ సంఘటన, గూర్చి విన్నారు. ఎవరికెవరూ క్రొత్తగా చెప్పనవసరం లేదు. వాళ్ళ మాటల్లో ఏమీలేదు. ఊసుపోక సానుభూతి!

'రాముడు చేసిన పని మాత్రం దర్జాగా వుంది. గొప్పపని' చుట్టకొన నములుతూ చెప్పి, కొసకొరికి ఉమ్మి వేశాడు, రైతు.

'వాడి బతుక్కి నాటికొక మంచిపని చేశాడులే. అయినా ఇంతటితో ఏమయింది. ఇకముందు వాడి బతుకు కుక్కలు కూడా పడవు. జైల్లో వుండటమా వాడి సొగసు' రెండో రైతు చాలా తేలికగా మాట్లాడాడు.

రాముడు చేసింది, తర్వాత ఏమైనా, మంచి పనే! అందులో అణుమాత్రం సంశయం లేదు. కానీ అతని భవిష్యత్తు ఏమవుతుందో తెలియదు.

రాముణ్ణి గురించి అందరూ బాగా చెప్పుకొంటుంటే హేళనగా మాట్లాడింది రైతు మాత్రమే. రాముడిది శాంత స్వభావమనీ, ఎవరి జోలికీ పోయేవాడు కాడనీ, అడిగిన వాళ్ళకు, తన దగ్గరున్నంతలో లేదనేవాడు కాడనీ, వళ్ళువంచి పని చేయటమే తెలిసినవాడనీ, చెప్పుకొన్నారుగానీ, ఇంత చులకనగా ఎవరూ చెప్పుకోలేదు.

ఎవరిని గూర్చి చెప్పుకొన్నా మంచిచెడూ వుంటాయి బొమ్మ బొరుసుల్లాగా—పగలూ రాత్రీ లాగా, వాళ్ళ వాళ్ళ దురదృష్టంకానీ, అదృష్టంకానీ ఎక్కువమంచో, ఎక్కువ చెడ్డో లోకానికి తెలుస్తుంది. మంచివాళ్ళలో అంతా మంచిగానీ, చెడ్డవాళ్ళలో అంతా చెడ్డగానీ వుండనక్కరలేదు. మంచిచెడ్డలు మనిషి మనిషికి వెలుగునీడలు.

ఎండ తీవ్రంగా వుంది. స్టాండ్లో చెట్లనీడల్లో తప్ప జనసంచారం లేదు. చుట్టుప్రక్కల ఇళ్లలోంచి మనిషి బైటికి రావటంలేదు. లోనికి పోవటంలేదు. చప్టా మీద రైతుల మాటల్లో రాముడి జీవితం.

''రాముడు జీతగాడు. అయిదో ఏటే వెంకన్న దగ్గర కమతానికి కుదిరాడు. చిన్నతనంలో గొడ్లు మేపుకు వచ్చేవాడు. పెద్దయాక పొలం పనులకు ఉపయోగపడుతున్నాడు.

శారీరకంగా బలంవున్నా, రాముణ్ణి మెత్తని వాడంటారు. మెత్తని స్వభావం. మెత్తని మాటలు. మెతక నడక. సిగ్గు ఒయ్యారం.

వెంకన్న తప్ప అందరూ అతన్ని ఎగతాళిగా చూస్తారు పిలుస్తారు. పిల్లలు ఆటలు పట్టిస్తారు. పెద్దవాళ్ళు పరాచికాలు పలుకుతారు. అతన్ని చూచి ఆడవాళ్ళు సిగ్గుపడరు. అతనే సిగ్గుపడతాడు.

ఇదంతా చూస్తుంటే వెంకన్నకు వళ్ళు మండిపోయింది. రాముడికి పెళ్ళి చేస్తే తప్ప వూళ్లో వాళ్లకి సిగ్గురాదు అనుకొన్నాడు. ఒక శుభ ముహూర్తాన వడ్లమూడి లోంచి తల్లిదండ్రి లేని పిల్లను తీసుకువచ్చి, తల్లిదండ్రి లేని రాముడికిచ్చి పెళ్ళి చేశాడు.

రెండేళ్ళు కోటమ్మ ఏ పేచీ లేకుండా కాపురం చేసింది. ఇల్లాలు ఇల్లాలిలా కలిగారు. రాముడు చాలా సంతోషంతో మెలికలు తిరిగిపోయాడు.

ఉన్నట్టుండి ఒకరోజున కోటమ్మను గొడ్డును బాదినట్లు బాదాడు రాముడు. చుట్టుప్రక్కల అమ్మలక్కలు వచ్చి అనునయించారు. రెండురోజులు తర్వాత రాముణ్ణి వదిలేసి ఆమె వెళ్ళిపోయింది.

కొందరు రాముణ్ణి అనుమానించారు. కోటి శీలం శంకించారు. ఏమయినా భార్య లేక, తిండీతిప్పలు లేక, హోహాకాలే వి అల వాట్లు వచ్చి, మళ్ళీ యజమాని ఇంటి దగ్గరే చేరాడు, రాముడు. ఏడాది గడచింది.

ఎన్నోసార్లు భార్యను బ్రతిమాలి తీసుకురావాలనుకొన్నాడు. అందుకూ సిగ్గే అడ్డమయింది.

రాముడి హృదయం ఎరిగిన వెంకన్న అన్నిటికీ నేనున్నానని మాట యిచ్చి, కోటిని కాపురానికి తీసుకువచ్చాడు.

పెళ్ళి అయినప్పుడూ అయ్యాకా లేని అందం, ఆ ఏడాదిలో కోటి శరీరమంతా కొత్తగా వికసించింది. వెంకన్న ఆలస్యంగా గమనించాడు.

రాముడికి మళ్ళీ కొంపాగోడి ఏర్పడ్డాయి. చాలా సంతోషంతో వున్నాడు. కోటిని నోరెత్తి మాట అనలేదు. చేయెత్తి కొట్టలేదు. అవధిలేని ఆనందానికి అవతలి గట్టులాగా కనిపించాడు.

వెంకన్న పరిస్థితి గమనించాడు. స్వార్థం తలెత్తింది. ఊరి వెలుపలి ప్లాగాకు బేరన్ దగ్గర పాకవేయించి రాముణ్ణి కావలా వుంచాడు.

అప్పణ్ణుంచి కోటికి స్వేచ్ఛ అధికమూ అయింది. పరిమితమూ అయింది. వాళ్ళిద్దరికీ ఏంకావాలో చూచుకొంటూ వున్నాడు వెంకన్న. ఎప్పుడో తిండికి తప్ప ఇంటికి రాడు రాముడు. ఎప్పుడూ ఇల్లు విడిచి వెలుపలికి రాదు కోటి.''

ఇక తర్వాత వినిపించిందంతా ఇంతకు ముందే విన్న సంగతి. రవికి రాముడి మీద సానుభూతి కలిగింది.

బస్సు రాలేదు.

బస్సు కేమయినా యాక్సిడెంటు అయిందేమో! ఒక బస్సు కాకపోతే రెండో బస్సు

అయినా రావచ్చునే! ఏమిటో! రవికి చికాకు పెరిగిపోతూ వుంది.

రవికి వసంత గుర్తుకు వచ్చింది. ఆమె ఎలా వుంటుందో! బాగానే వుండవచ్చు. ఏమయినా చూచిందాకా ఏమాటా చెప్పలేడు.

ఏది ఏమయినా పెళ్ళిచూపులకు వెళు తున్న యువకుడు. ఆ ఆలోచనే దర్జాగా వుంటుంది. వి. వసంత! పేరున్నంత అం దంగా మనిషి ఉండవచ్చు. ఆమె అందంగా వుంటుందనుకోగానే సిగ్గు కలుగుతూ వుంది ఛీ! మగాడికి సిగ్గేమిటి!

ఆమె కెంత ఆస్తివుంది, ఎంత కట్నం వస్తుంది. కుటుంబ పరిస్థితులేమిటి. ఇటు వంటి విషయాలు ఏవీ రవికి అక్కర లేదు. అవన్నీ పెద్దలు చూచుకొనే వ్యవ హారాలు. ఆమె హాస్టల్లో ఉంటుంది. వెళతాడు. ఎవరో అపరిచితుడైన విజి టర్‌లాగా ఆమెను చూస్తాడు. పలక రిస్తాడు. మంచి చెడ్డలు నిర్ణయించు కొంటాడు. ఏ విషయమూ ఇంట్లో చెబు తాడు. ఆ సంగతే పిల్ల తల్లిదండ్రులకు తెలుస్తుంది.

బస్సు రాలేదు.

సిగరెట్టు ముట్టించుకొని రోడ్డుమీదికి వచ్చిచూశాడు. బస్సు జాడలేదు. ఎర్రగా దుమ్ములేస్తే బస్సే అనుకొన్నాడు. కాదు మరీ! లారీనిచూస్తే అకారణంగా ఒళ్ళు మండింది.

ఒళ్ళంతా మండుతున్నట్లుంటే కళ్ళ ముందు వెన్నెల నడచినట్లయింది. యువతి చాలా అందంగావుంది. ఇరవై రెండు సంవత్స రాలకంటే ఎక్కువ వయస్సుండదు. తీర్చి దిద్దినట్లున్న అవయవాలు. రవి రోడ్డు మీద అలాగే నిలబడి, ఆమెనుచూస్తూ వుండిపోయాడు.

ఆమెను ఎక్కడనో చూచినట్లు అని పించింది. బహుశా ఎక్కడా చూచి ఉండక పోవచ్చు. తనకు కాబోయే భార్య ఇలా ఉండాలని వూహించుకొంటూ వుండ వచ్చు. వూహాలోకంలోని రూపం వాస్తవ జగతిలో కనిపించేసరికి వసంత ఇంత అందంగావుంటే చాలుననుకొన్నాడు రవి.

చప్టామీద కూర్చున్న వాళ్ళలో కల కలం బయలుదేరింది.

'అదుగో!'

'విచారంలేదు!'

'పీడ విరగడవుద్దిలే అని సంతోషం!'

'ఎక్కడికో బయలుదేరింది!'

అవాంఛితం

'అక్కడికేనేమో!' అందరూ గలగలా నవ్వారు. ఆమె వెనుదిరిగి చూచింది. కాండ్రించి తుపుక్కున ఉమ్మివేసి వెళ్ళి పోయింది. రవి గతుక్కుమన్నాడు.

తర్వాత తెలిసింది. ఆమె రాముడి భార్య! కోటి!!

రవి వెంటనే అనుకొన్నాడు. "అయితే ఆశ్చర్యంలేదు." వాళ్ళు చెప్పుకొన్నది నమ్మ శక్యంగాని సంగతేమీకాదు.

వూరవతల రోడ్డుమీద మళ్ళీ ఎర్ర దుమ్ములేచింది. బస్సురాలేదు. లారీ వచ్చింది. ఆగకుండా వెళ్ళిపోయింది. ఆగితే ఎలాగో ఒప్పించి లారీలోనే గుంటూరు చేరి వుండేవాడు. రాత్రయితే మంచిదికాదు గానీ పగలేం? అయినా లారీ ఆగనయినా ఆగ లేదు. లారీ కాబిన్‌లోకూర్చుని, బస్సు చార్జీమాత్రమే చెల్లించి ప్రయాణం చేయటం కొత్తేమీకాదు. మామూలే!

విపరీతంగా చెమట! కర్చీఫ్‌తో తుడుచు కొన్నాడు. ఒకచోట నిలబడలేకపోతు న్నాడు. కోపంగా, బాధగా, అసహనంగా, చిరాకుగా, అటూ ఇటూ తిరుగుతూ ఉన్నాడు.

'క్లీనర్‌ది ఈ వూరే!'

'నిజమేనా? ఎక్కడ వాడిల్లు?'

'ఈ చెరువుగట్టుమీదే! అదుగో ఆ తాటిచెట్టుదగ్గర ఇల్లు! కుడిపక్క బావి దగ్గర. తాటాకుల కొంప. రెండు నిట్టా ళ్ళదికాదు. ఒంటినిట్టాటిది. కనిపిం చలా?'

'ఆ! అవునవును!'

'అదే వాడిల్లు!'

'అహా'

'కోటితో పూర్వ పరిచయం కాస్తంత వున్నవాడే!'

'ఏందీ? ఎట్టెట్టా?'

'కాస్తందిలే—బాగానే— మొదటిసారి రాముడు కోటిని కొట్టింది వీడిమూలానే'

'అట్లా జెప్పు!'

'ఈమధ్య వెంకన్న కథ ప్రారంభ మయింతర్వాత కోటి పతివ్రత అయింది.'

అందరూ నవ్వారు. ఆ సమయంలో చప్టామీద కూర్చున్న జనం మాటల్లో గుండెల్లో కోటి బస్సుతప్ప మరేమీ లేవు. కోటి ప్రస్తావనరాగానే రవి వాళ్ళ వైపు చూశాడు. బస్సు రాకపోతే కోటి సంభాషణ. బస్సువస్తే అన్నీ మరిచి పోయి ప్రయాణం. ఇంకొక్క గంట దాకా బస్సు రాకపోతే కోటి బ్రతుకు వీళ్ళ నోళ్ళలోబడి, ఎండలో రోడ్డుప్రక్క చెట్టుక్రింద వడగాలి దెబ్బతగిలి సొమ్మ సిల్లిపోవలసిందే

"క్లీనర్ బీదవాడు. పెళ్ళయింది. నలుగురు పిల్లలు. పెద్దపిల్ల పెళ్ళికెది గింది. పెళ్ళి చేయాలని తొందర! డబ్బు లేక అగచాట్లు!!

చిన్నప్పట్నించి లారీ క్లీనర్‌గా ఉన్నాడు. పెరిగి పెద్దవాడయి, సంసారం పెరిగి యాతనపడుతున్నా, ఉద్యోగం మాత్రం యధాపూర్వకంగావుంది. ఆమధ్య డ్రైవింగ్ లైసెన్సు సంపాదించాడు. అయినా ప్రమో షన్ రాలేదు. ఓనర్‌కు బెంజి లారీ త్వరగా వస్తే, తను డ్రైవర్ అవుతాడు. జీతం పెరుగుతుంది. ఆ కలలు కనటంతోనే కాలం గడిచిపోతూవుంది.

రెండు వేలయినావుంటే కూతురు పెళ్ళ వుతుంది. ఓనరును అడిగాడు. లేదనే సమాధానం. డ్రైవర్‌ని అడిగాడు. 'నా దగ్గ రెక్కడుందీ?' అని జవాబు. క్లీనర్‌కు ఈమధ్య డబ్బు ఎలా సంపాదించాలి అనే ఆలోచనతప్ప మరే ధ్యాసాలేదు. డబ్బుకూ మనుష్యులకూ మధ్య ఉన్న సంబంధం బాగా తెలిసి ఒళ్ళు మండిపోయింది. జీవితం మీదే విరక్తి పడుతూవుంది.

కోటిదగ్గర డబ్బుంది. అడిగితే లేదనక పోవచ్చు. కానీ అడగటానికి వీలులేకుండా పోయింది. వెంకన్న రాముడి గృహ యాజ మాన్యం స్వీకరించిం దగ్గర్నుంచి, కోటి సల్లపూస అయిపోయింది. కంటికి కనిపిం చటంలేదు. ఆ యింటి చాయలకుపోవటం గొడవే! పోయినవాళ్ళకు ఏ గతిపట్టిందో తనకు బాగా తెలుసు.

ప్రొద్దు పొడిచిం దగ్గర్నుంచి, ప్రొద్దు క్రుంకేదాకా డబ్బు అతనికి పెద్ద ప్రశ్న. ప్రొద్దు క్రుంకిందగ్గర్నుంచి ప్రొద్దు పొడిచే లోగా వచ్చే ఆలోచనలు—తీరేమార్గం తెలియకపోయినా, అవకాశం రాకపోయినా, అనుభవం లేకపోయినా—చక్కని జవాబులు.

ఓనరు ఇంట్లో దొంగతనం చేయాలని క్లీనర్ అనుకోకపోలేదు. దానివల్ల ఉద్యో గానికి ప్రమాదముందని వూరుకొన్నాడు. డ్రైవర్ ఇంట్లో!— వీలులేదు. ఇంకె న్నెన్నో ఆలోచనలు. ఫలితం శూన్యం.

బ్లూ సీల్

టాల్కం

శరీర దుర్గంధనివారిణి అయిన *హెక్సక్లోరోఫీన్‌తో కూడినది

బ్లూ సీల్ టాల్కం సాధారణమైన శరీర దుర్గంధ నివారణులు ఇవ్వలేని రక్షణను ఇచ్చే ప్రత్యేకమైన శరీర దుర్గంధ నివారిణి అయిన హెక్సక్లోరోఫీన్‌తో కూడియున్నది. సుగంధపూరితమైన బ్లూ సీల్ టాల్కంను ప్రతిరోజూ ఒంటిమీద జల్లుకోండి ... అది అతి చక్కని కొలోన్ వలె తాజా హాయి నిస్తుంది. మృదువుగా, హాయిగొలుపుతూ చర్మమునకు రక్షణయిచ్చి కాపాడుతుంది.

*హెక్సక్లోరోఫీన్ అంటే యేమిటి:

మన దేశమువంటి ఉష్ణాధిక్యతగల దేశాల్లో చెమటకు సంబంధించిన సమస్యలు అతి కఠినమైనవి. చెమట పట్టడంతో చర్మముపైన సూక్ష్మజీవులు కలిగించే దుర్గంధమునకు దారి తీస్తుంది. బ్లూ సీల్ టాల్కం జల్లుకొంటె అది చర్మాన్ని సూక్ష్మ జీవులనుంచీ చెడ్డ వాసనలనుంచి కాపాడుతుంది ... దీనికి కారణం బ్లూ సీల్ టాల్కం హెక్సక్లోరోఫీన్‌తో కూడ ఉండడం. హెక్సక్లోరోఫీన్ ప్రపంచమంతటా అంగీకరింపబడిన శరీర దుర్గంధ నివారిణి.

— తాజా హాయి
గొలుపుతూ
రక్షణయిచ్చే టాల్కం



బ్లూ సీల్ టాల్కం మీడియం,
ఫ్యామిలీ సైజుల డబ్బాలలో దొరుకుతుంది

చీస్‌బ్రో-పాండ్స్ ఇన్‌కార్పొరేటెడ్
(పరిమితమైన బాధ్యతతో
యు. ఎస్. ఎ.లో స్థాపితము)

WTP 4369

అక్కణ్ణుంచి లోకంమీద కసి! ద్వేషం!! ఛీ!!!''

క్లీనర్ జీవితంమీద రవికి కోపం వచ్చింది. సానుభూతి కలిగింది.

తెనాలినుంచి చేబ్రోలుపోయే బస్సు కొండూరులో ఆగింది. ఎవరో ఇద్దరు దిగారు. నలుగురు ఎక్కారు. బస్సు వెళ్లిపోయింది. ఒకతను వూళ్లోకి వెళ్లాడు తలమీద కండువా కప్పుకొని. రెండో వ్యక్తి చప్టామీద చేరాడు. అతను బుడంపాడు పోవాలి. కాబట్టి గుంటూరుపోయే బస్సు ఎక్కాలి. రెండు గంటలనుంచి బస్సు ఏదీ రాలేదని తెలిసి, చాలా త్వరలో ఏదైనా బస్సు రావచ్చునని ఆశతో కూర్చున్నాడు.

అతను టీచర్. పంచె! ముతక లాల్చీ! పైన కండువా! లాల్చీజేబుకు సిరామరక! ఎదురొమ్ముమీద లాల్చీ పట్టీకి పెన్ను పెట్టుకొన్నాడు.

అతని కీ సంఘటన కొత్త! చప్టామీద సంభాషణ అతనికి విన బుద్ధిపుట్టింది. బీడీ అంటించుకొని, అరుగుమీద కూర్చున్నాడు పై పంచె సరిచేసుకొని. ధోవతి పైకిలాక్కొని అంతా విని 'లోకం ఘోరాతి ఘోరంగా తయారయింది!' అంటూ నిట్టూర్చాడు. 'డ్రైవర్ కారణమనుకొంటాను' అన్నాడు.

'అదేంకాదయ్యా పంతులూ! ఓనరు గాడే అని నా అనుమానం' అన్నాడు చుట్ట కాలుస్తున్న రైతు.

'ఓనరుకు అంతధైర్యంవుండే అవకాశం లేదు. భయం వుంటుంది.'

'భయం—నా బొంద---వాడికి భయమేమిటి? వాడి సంగతి నీకేమీ తెలిసి నట్లులేదే—వాడూ......'

పంతులు చప్టామీద చేరి సంభాషణ లోకి దిగేసరికి తీగలాగితే డొంకంతా కదిలి నట్లయింది.

''ఓనర్ పేరు వీరన్న. వీరన్నపుట్టే నాటికే తండ్రి గతించాడు. మూడేళ్ల వయస్సులో తల్లి చనిపోయింది. అతను పెరిగి పెద్దవాడవుతున్నకొద్దీ (ఎత్తు పెరగలేదు) పొట్టివాడికి పుట్టెడు బుద్ధు లన్నట్లు (బుద్ధి చాలా ఎత్తు పెరిగింది) కో అంటే కోటి. కోటి బుద్ధులు. కోటి ఆలోచనలు. అమ్మా నాన్నలు ఇచ్చిపోయింది కుంటనేలయినా వీరన్న ప్రస్తుతం కోటీశ్వరుడు.

అవాంఛితం

పుట్టిన క్షణంలో దమ్మిడీ విలువ చేయని వీరన్న వయస్సు వచ్చాక అంత ఆస్తిపరుడెలా అయ్యాడు అని అడిగితే, గిట్టనివాళ్లు దొంగతనంచేశాడనీ, దోపిడీలు చేశాడనీ, బేంకుచోరీలో ప్రథమ ముద్దాయి అని ఏమేమో చెబుతారుకాని అది నిజం కాకపోవచ్చు. ఎందువల్లనంటే అత నెప్పుడూ జైల్ ముఖం చూడలేదు.

అతనంటే ఇష్టం లేకపోయినా, కష్టం లేనివాళ్లు, పాపం స్వయంకృషితో పైకి వచ్చాడు. వస్తూ వస్తూ ఇంత పాపం కూడా తెచ్చుకొన్నాడు అంటారు. ఆపాపం దాని వ్యవహారం ఏమిటంటే ఎవరూ ఏమీ చెప్పలేరు.

వీరన్న చేబ్రోలు పొగాకు వ్యాపారం చేశాడనీ, అయిదు పెళ్లిళ్లు చేసుకొన్నాడనీ, గుంటూరులో పెద్ద పొగాకు కంపెనీ ఉందనీ, పది లారీలు ఉన్నాయనీ చాలా మందికి తెలుసు.

పొగాకు కంపెనీలో గ్రేడింగ్‌చేసే అందమైన ఆడపిల్ల అతనిబారినుంచి తప్పించుకుపోలేదని అంతరంగికులకు మాత్రమే తెలుసు.

మొదట్లో నాటుపొగాకు వ్యాపారం చేసి కొంత నిలువవేసి, తర్వాత చిన్న పెట్టుబడితో దొర పొగాకు వ్యాపారం ప్రారంభించి, బాగా లాభాలు గడించి, పల్లెల్లోనుండే పొగాకు బేళ్లు చేరవేసుకోవటానికి గుంటూరు చేరవేయించటానికి లారీలు కొన్నాడనీ, సీజన్ లేని సమయంలో బాడుగకు పంపుతుంటాడనీ---ఈవిధంగా ధనార్జన బాగా పెరిగిపోయిందనీ చెప్పుకొంటూవుంటారు పనివాళ్లు.

ముప్పయిఏళ్లదాకా వీరన్న పెళ్లి చేసుకోలేదు. అప్పటికే అతని స్త్రీకాంక్ష చాలా వరకు తీరిపోయింది. అటువంటి మనిషి పెళ్లి చేసుకోవటానికి కారణాలు రెండు! ఒకటి ఆస్తి, రెండు ప్రతి మగవాడికీ భార్యంటూ ఒక ఆడమనిషి వుండాలనే భావన!

వీరన్న చేసుకున్న అయిదు పెళ్లిళ్లు— పదిహేనుఏళ్లలో— చాలా డబ్బుతెచ్చాయి. నలుగురు భార్యలూ చనిపోతూ ఎంత ఇన్సూరెన్సు డబ్బుతెచ్చారో, వీరన్నకూ, ఇన్సూరెన్సు ఏజంట్‌కూ, ఆఫీసుకుతప్ప మరెవరికీ తెలియదు.

వీరన్న అయిదోభార్య చూలాలు. ఇంకో నెలకు అంతా సవ్యంగా వుండివున్నట్లయితే ప్రసవవేదనలో ఆమెకూడా చనిపోయి వుండేది. ఇన్సూరెన్సు మొత్తం వచ్చి వుండేది. కాని మాయదారికాలం దారి తప్పిపోయింది లారీలాగా.

కామాంధుడైన వీరన్నకు విందు చూలాలు ఎద్దులాగో మొద్దులాగో నయ్యా సారం లేకుండావుంది. గ్రేడింగ్ చేయిస్తుంటే ఎండకి పొగాకు చూర్ణం అయిపోతుందని, కంపెనీ కట్టేయటంతో, గ్రేడింగ్ ఆడవాళ్లు పది రోజులనుంచి కనిపించటంలేదు.

స్త్రీకోసం డబ్బు ఖర్చు చేయట మంత తెలివి తక్కువ పని మరొకటిలేదని వీరన్న సిద్ధాంతం. ఆ సిద్ధాంతం పదిరోజులనుంచి వీరన్నను లంఖణం చేయించింది.

నల్లగా తుమ్మమొద్దులాగావుండే వీరన్న ఏం చేసినా బండపనే! రెండు చేతులతో సంపాదిస్తాడు. రెండుకోళ్లనుతింటాడు. రెండు బుడ్లు తాగుతాడు. ఒక్క ఏ ఒక్కటితోనూ తృప్తిపడడు.''

బస్సు రాలేదు.

రెండున్నర గంటలనుంచి బస్సురాలేదు. అంత ఆలస్యం సాధారణంగా ఆరూట్‌లో ఎప్పుడూ జరగదు. ఈ బస్సులకు పోయే కాలం రాలేదు కాబోలు. రవికి వళ్లు మండిపోయింది. 'ఉష్ణమ్ ఉష్ణేన శీతలమ్' అని కాఫీ తాగుదామనుకొన్నాడు.

సిగరెట్టుబడ్డీలకు అవతల, తాటాకు పాకపేరు హోటల్. రవి బయలుదేరాడు. చప్టామీదకూర్చున్న పంతులు గబగబా వచ్చి రవివెంట నడుస్తున్నాడు.

'మీరెవరుసార్!' ప్రశ్నించాడు.

రవి చెప్పాడు

'ఈ ఘోరం విన్నారా?'

'విన్నాను!'

పంతులు మరేం మాట్లాడలేదు. ఇద్దరూ హోటల్‌ముందుకువచ్చారు. అక్కడ ముంజల బుట్టలున్నాయి. బస్సులు వస్తే 'వాళ్లు' ముంజలు గుంటూరులో అమ్ముకొంటారు. ముంజలవాళ్లు అవి పాడయిపోతాయనే దిగులుతో ఎంతకీ బస్సు రాకపోవటంతో హోటల్‌ముందు చింతచెట్లక్రింద చింతాకుల చిత్తులై కూర్చున్నారు. చింతాకులు రాలి ముంజల బుట్టలమీద కప్పిన మురికి బట్టలపైన పడివున్నాయి.

హోటల్‌చుట్టూ మట్టి గోడలు,

...నే [illegible] రాళ్ళమీదవున్న చెక్కలు కుర్చీలుగా టేబిళ్ళుగా ఉపయోగపడతాయి. రాత్రి పడితే, ఆ చెక్కలే మంచాలు.

వెనుకపక్క పొయ్యి అంటే కిచిన్ వుంది. మధ్య పిట్టగోడ అడ్డం వుంది. హొటల్ ప్రొప్రయిటర్—కమ్—కాషియర్— కమ్— సర్వర్— కమ్ —క్లీనర్—కమ్ —కుక్ పొయ్యి ముట్టించాడు. పాకనిండా పొగ.

క్రమక్రమంగా పొగతగ్గిపోయింది. బల్లలు కనిపించాయి. వాటి మీద ఎక్కడ కూర్చోవాలో అంతుపట్టలేదు. కాళీ గ్లాసుల కాఫీవీ నీళ్ళవీ ఉన్నాయి. గ్లాసులంటే గాజు గ్లాసులు కాదు. జర్మన్ సిల్వర్. చెక్కల మీద నీటి తడి, కాఫీ మరకలు, పచ్చళ్ళ అంటులు, కాళీ ఆకులు—అంతా మహా రణరంగంలాగా వుంది. రవి కూర్చోటానికి సంకోచిస్తున్నాడు. పంతులు కొన్ని గ్లాసులు తొలిగించి, కొంత తడి తుడిచి, కూర్చునే తావు, బ్రహ్మలాగో, విశ్వామిత్రుడిలాగో సృష్టించాడు.

పొయ్యి దగ్గర్నుంచి హోటల్ సర్వాధికారి వచ్చాడు. 'ఏం కావాలి సార్!' ప్రశ్నించాడు. రవి మాట్లాడలేదు. 'ఏముంది?' పంతులు ఎదురు ప్రశ్న వేశాడు.

'హాట్‌గా బజ్జీ—కొంచెం వేడిగా ఇడ్లీ!'

''ఒకప్లేట్ బజ్జీ,రెండు కాఫీ'' చెప్పాడు.

'కాఫీ స్పెషలా? ఆర్డినరా?'

'మంచి కాఫీ!'

టేచర్ ఏమీ మాట్లాడలేదు. సర్వాధికారి, బజ్జీ ప్లేటు తెచ్చి బల్ల మీద పెట్టాడు. నోరు వూరుతూ వుంటే ప్లేటు వైపు చూస్తూ 'తీసుకోండి చల్లారిపోతుంది' అన్నాడు.

'నాకు కాదు. మీరే తీసుకోండి' అని చెప్పాడు.

'నాకా?' అని, మరి మాట్లాడకుండా, మాట వరుసకయినా 'అబ్బే నాకెందుకు వద్దులే' అనకుండా గబగబా ప్లేటు తీసుకొన్నాడు.

రవికి ఎదురుగా ఇద్దరు కూర్చుని వున్నారు. చెక్క మీద బాచి పట్టు వేసుకొని బీడీ కాలుస్తున్నాడొకాయన. రెండో వ్యక్తి కాళ్ళు ఆరజాపి వున్నాడు.

'వాడు చాలా దుర్మార్గుడు. నాకు మొదట నుంచీ వాడి మీద అనుమానమే!'

'వాడెంత దుడుకుగా లారీ తోలుతాడనీ, [illegible] కోళ్ళు ఎన్నో చచ్చిపోయాయట'

'అంతేనా? మొన్నీమధ్య వాడి లారీ క్రింద ఆవుదూడ బడి చచ్చిపోయింది.'

'వెధవ పూటీగా తాగుతాడట. వళ్ళు తెలియకుండా వుంటాడు. డ్రైవింగ్ సీటులో కూర్చుంటే సింహాసనం మీద కూర్చున్నంత నిక్కు. తిక్క కుదిరిందిలే!'

''డ్రైవర్ పేరు నాగులు. నిజంగా నాగుబాము లాగా బారు. నిండు లారీలాగా లావు. అంతెత్తు నాగులు ఇంత పొట్టి వీరన్న దగ్గర ఎలా చేరాడో పక్షి విలాసం అర్థంకాదు.

చిన్నప్పటినుంచీ వాళ్ళకు స్నేహం. వీరన్న నాటు పొగాకు వ్యాపారం చేసే దగ్గర్నుంచి నాగులు పనివాడుగా మీదుమిక్కిలి మిత్రుడుగా వుంటున్నాడు. వీరన్న బుర్ర, నాగులు వళ్ళు వాళ్ళిద్దరికీ భయంలేకుండా చేశాయి.

వీరన్న వ్యాపారం అభివృద్ధి అయినకొద్దీ కల్లు దగ్గర్నుంచి ఫారెన్ విస్కీదాకా తాగుడు పెరిగింది. అదంతా అందుబాటులో వుంటే సరి, లేకపోతే సరఫరా చేసే ఎంతు నాగులుది. వీరన్న తాగి వదిలిపెడితే, మిగిలింది తాగటం నాగులుకు కూడా అలవాటయింది.


ఆపైన వీరన్న దొరలు తాగే బుడ్ల [illegible] నిఖార్సుగా సేవించేవాడు. సిఫార్సు చేసేవాడు.

వీరన్న లేకుండా నాగులుకు అస్తిత్వం లేదు. నాగులు లేకుండా వీరన్నకు వ్యక్తిత్వం లేదు.

వీరన్న లారీలు కొన్నాక నాగులు డ్రైవర్ అయ్యాడు. ఆపైన పెళ్ళి చేసుకొన్నాడు. పూటీగా తాగి తూలే భర్తను చూచి, వీలున్నప్పుడు రుచి చూడటంతో ప్రారంభించి, అంతో ఇంతో తాగి, కొద్దోగొప్పో జీర్ణించుకోగల ధీమంతురాలయింది భార్య.

భార్య శక్తి సామర్థ్యాలు బాహాటంగా గుర్తించాక నాగులు సారాయి వ్యాపారం ప్రారంభించాడు. లారీ ఏ ట్రిప్పులోనైనా పొగాకో, మరేదో తోలుకువస్తూ పనిలో పనిగా సారాయి కూడా సరఫరా చేయటం నాగులు అలవాటు చేసుకొన్నాడు. స్వామి కార్యంతోపాటు స్వకార్యం కూడా జరుగుతూ వుంది. వ్యాపారంలో మంచి రాబడే వుంది. మేడ కట్టించాడు.

వీరన్న ఆకలి వేటకు ఆయుధాల వంటి 'మందులు' తెచ్చి ఇవ్వటమేకాక, జంతువుల ఎగుమతి దిగుమతి కూడా నాగులు వంతు అయింది. ఆ జంతువుల్లో ఒకటో అరో తరుగా ఆహారమవుతూ వుండటంచేత, బాగానే వుంది పరిస్థితి.



అవాంఛితం

వాగులు వమ్మేనేబంటు: పిరన్న కావాలని అడిగితే (ఎప్పుడూ అడగలేదు) తలయివా ఖస్తాడు, (ఒక విషయంలో మినహాయింపు) ఆ పరిస్థితి రాలేదు.''

కాఫీపూర్తిచేసి, రవి బిల్లు చెల్లిస్తుంటే 'నేనిస్తానులెండి' అనలేదు పంతులు. ఎటో చూస్తున్నాడు. ఇద్దరూ వెలుపలికి వచ్చారు, చీకటి కోణాలలోంచి వెలుగు లోకాలలోకి వచ్చినట్లు. 'థాంక్సండి' అన్నాడు పంతులు మరేమీ మాట్లాడకుండా కళ్లతో.

అప్పుడు పరస్పరం పరిచయమయింది. పంతులుకు వడ్లమూడిలో ఉద్యోగం. వేసవి సెలవులకు స్కూల్ మూసి ఇంటికి వెళుతున్నాడు, బుడంపాడు. ఇంటి దగ్గర భార్యకు నిండునెలలు!

పొన్నూరు పోయే బస్సు గుంటూరు నుంచి వచ్చింది. ఆగింది. పదిహేను మంది దిగారు. బస్సు వెళ్లిపోయింది.

గుంటూరు పోయే బస్సు రాలేదు. బస్సు దిగిన వాళ్లలో కొద్దిమంది రాత్రి జరిగిన సంఘటన గురించి చెప్పుకొంటూ వెళుతున్నారు. మాటల సందర్భంలో 'రాముడు పోలీసు స్టేషన్‌లో వున్నాడు' అని తెలిసింది. అంతా కలకలం చెలరేగింది, మళ్లీ.

'అసలా దురదృష్టవంతురాలి సవాల్'

'టీచర్ ఏటునే'

'కాదంటగా. చదువుకొనే అమ్మాయి అనో ఏందో ఎవరో చెప్పారే!'

'లే! భర్త దగ్గరకు పోతావుందట.'

రవి అనుకొన్నాడు.

'టీచర్ అయివుంటుంది. భర్త దగ్గరకు పోతావుండి వుంటుంది.'

* * *

''సాయంత్రం ఏడు. సూర్యుడస్తమించాడు. చీకటి వర్షంలాగా వస్తూ వుంది. అప్పటికింకా మసక వెలుతురు. పల్లెలోంచి బయలుదేరి, ఎండి, పగుళ్లుబడి, కోవులు తేలి, వున్న వరిచేలల్లోంచి కాలిబాటలో యువతి, ఆమెకంటే చిన్నవాడయిన యువకుడు నడచి వస్తున్నారు. ఇద్దరూ రోడ్డు మీదికి వచ్చారు. గుంటూరు పోయే బస్సు ఏడున్నరకు వస్తుంది. ఎదురు చూస్తున్నారు. సాధారణంగా సాయంకాలం బస్సు ఖాళీగా వస్తుంది. ఆమె అక్క. అతను తమ్ముడు, అక్కను గుంటూరులో దిగవిడిచి రావటం కోసం వచ్చాడు. పదహారు సంవత్సరాల వయస్సు ఉండవచ్చు. ఏపుగా పెరిగిన లేత మామిడి కొమ్మలాగా వున్నాడు.

ఆమె వయస్సు ఇరవై కంటే ఎక్కువే అచ్చుపోసిన అందం లాగుంది. అవయవాలు పరిపూర్ణతను పొందాయి. అలంకరణవల్ల ఆకర్షణ పెరిగింది. మెడ నిటారుగా వుంది. యవ్వనం, అందం, చదువు, ఆభిజాత్యం అన్నీ ఆమెకీ ఉన్నాయన్నంత, గర్వంగా ధీమాగా తలవంచుకోవటం చేతకానట్టు, ఎరుగనట్టు నిలబడి వుంది.

ఆమె చేతులకు బంగారు గాజులు, రిస్టువాచీ వున్నాయి. మెడలో హారం, చెవులకు వెడల్పు రింగులు ఉన్నాయి. తలలో పూలు, మెడలో మాంగల్యం లేవు. ఆమెలో స్త్రీత్వం లేదు. పసితనమే వుంది. పసితనం పుంజుకొంటున్న స్త్రీత్వపు బింకమే గర్వంలాగా కనబడుతూ వుంది.

ఏడున్నర అయింది. దూరంగా బస్సు. సిద్ధంగా నిలబడ్డారు. బస్సు దగ్గరకు వచ్చింది. చేతులెత్తారు. ఆగలేదు. వెళ్లిపోయింది. జనం కిటకిటలాడుతున్నారు బస్సునిండా!

తమ్ముడి ముఖంలో నిరాశ, నిస్పృహ అలముకొన్నాయి. ఆమె లెక్కా జమాలేనట్టు అలవోకగా ఎటో చూస్తూ నిలబడింది.

అప్పటికే అమావాస్య చీకటి దట్టంగా వ్యాపించింది. నిలయంగా క్రమ్ముకొంది. వికారం నిలబడింది. వికటాట్టహాసం చేస్తూ వుంది. పదిగజాల దూరంలో మనిషి నడిస్తే అలికిడి వినబడవచ్చు కానీ మనిషి కనబడటంలేదు.

ఎనిమిదయింది. బస్సు రాలేదు. గడియారంలో రేడియం డైల్ ఎగతాళిగా నవ్వుతూ వుంది.

తమ్ముడికి అశాంతి. చిరాకు. అసహనత. నిట్టూర్పు. బస్సు వస్తున్న సూచనలేదు.

'ఇంటికెళదామా' తమ్ముడు అడిగాడు.

'బస్సు వస్తుందిలేరా?' అక్క చెప్పింది.

'నీ మొండి నీది!' తమ్ముడు గొణిగాడు.

మాటల్లోనే ఎనిమిదిన్నర! లాస్టుబస్సు వచ్చేటైం! అయినా రెండు బస్సులు రావాలి! ఖాళీగా ఏ బస్సు అయినా వస్తుంది.

'ఏందివాళ?' తమ్ముడు ఇంతవరకు బస్సు రాలేదేమని దానికి అర్థం.

'ఏమోరా?' అక్క. ఏమీ తెలియని తనానికి గుర్తు.

మాటల్లోనే తొమ్మిది దాటిపోయింది. తమ్ముడికి దాదాపు కోపం వచ్చింది:

'నేనుండ నింక!'

'అట్లా అంటే ఎట్లారా?'

'మరి? ఈ చీకట్లో 'ఏం ప్రయాణం?'

'తప్పకుండా పోవాలిరా!'

'నువ్వుపో! నేనింటికి పోతాను'

'మాబాబు కదూ! మంచివాడివి. అలా అనొద్దు. బస్సు వస్తుంది. ఇద్దరం వెళదాం. కోపం వద్దు' ఆమె బ్రతిమాలింది.

'నువ్వొస్తేరా లేకపోతే లేదు. నేనింటికి పోతున్నాను' నిశ్చయంగా చెప్పాడు.

'పోరా! నీ యిష్టం. నువ్వు వచ్చినా రాకపోయినా నేను మాత్రం వెళతాను. ఏవిధంగా అయినా వెళ్లాల్సిందే! రేపు ఉదయమే పరీక్షాయే!' ఆమె స్థిరంగా చెప్పింది.

చీకటి. చీకటికే భయం పుడుతూ వుంది. ఇలకోళ్ల అరుపులు! మనుష్యులు మెదలటంలేదు. కటికి చీకటి. కళ్లు పొడుచుకు చూచిన కానరాని చీకటి. మిణుగురు పురుగుల మిలమిలలు! ఎక్కడో నక్కవూళ! గుడ్లగూబల అరుపులు! చెట్ల రాపిడి. గాలి ఈలలు! దెయ్యాల సంగీతంలాగా వుంది.

తమ్ముడి గుండె వేగంగా కొట్టుకొంటూ వుంది. ముఖం చీకటి కంటే నల్లగా అయిపోయి వుండాలి. కనిపించటంలేదు. ఇంటికి పోదామనుకొన్నాడు భయంతో. అక్క ఏమవుతుందోనని అంతకంటే భయం! అక్కడే వుండవలసి వచ్చింది. ఉండలేక పోతున్నాడు. వెళ్లాలనుకొన్నాడు. వెళ్లలేక పోతున్నాడు. ఈ దేశంలో, ఆ స్థితిలో ఏ తమ్ముడూ, ఏ అక్కనూ వదిలిపోడు. ఇది తరిగిపోని సంపద. ఇది ఇలాగే, ఈ అనుబంధం ఈ విధంగానే, శాశ్వతంగా వుంటుంది. మిగిలేది ఇదే! ఈ ఆప్యాయతే. అనుబంధం. అనురాగం.

ఆమెలో గర్వపు భంగిమలు తగ్గిపోయి వుంటాయి. అశాంతిగా శ్వాస! బరువుగా కదలిక! ఆశతో ప్రతీక్ష! ముఖం ఎలా వుందో తెలియదు. ఎంత నల్లగా వుండి వుంటుందో అమావాస్య చీకటే సాక్ష్యం!

పదిగంటలు! రోడ్డు మీద దూరంగా వెలుతురు. ఆశగా నిలబడ్డారు. వెలుతురు దగ్గరకు వచ్చింది. చేతులెత్తారు. వెలుతురు ఆగింది. బస్సుకాదు. లారీ! కేబిన్ నిండా మనుష్యులు, నలుగురు ఆడవాళ్లు!

ఇద్దరి పురుషులతో బిడిగిబిడిగి కూర్చు న్నారు. లారీ నిండుగా వుంది.

గుంటూరు పోవలసిన రెండు బస్సులూ పొన్నూరులోనే వున్నాయి చెడిపోయి. ఇక రావు. టాక్సీ వుంటే తీసుకుపోయే వాడే డ్రైవర్. లేదు. అంతా చెప్పి వెళ్ళిపోయాడు.

అక్కకేమి చేయాలో తెలియలేదు. రాత్రికే గుంటూరు పోకతప్పదు.

'ఇక ఇంటికి వెళదాం మరి' తమ్ముడు కోపంగా చెప్పాడు.

'వద్దురా! రాత్రికే వెళ్ళాలి! ఏ లారీలో నైనా వెళదాం!'

'లారీలోనా?'

'ఆఁ! ఏం?'

'వద్దు! వాళ్ళు ఎలాంటి వాళ్ళుంటారో?'

'ఏం భయంలేదురా! మనుష్యుల్ని నమ్మక పోతే మానుల్ని నమ్ముతావా?'

'ఏమో! వద్దు! నా మాట విను! తిరిగి వెళదాం.'

'చెబుతుంటే వినాలి!' కఠినంగా చెప్పింది. ఆ కాఠిన్యానికి ఆమె గుండెలే అవిసిపోయాయి.

ఇక ఇద్దరూ ఏమీ మాట్లాడుకోలేదు. మౌనంగా నిలబడ్డారు. రాళ్ళ కంటే నిశ్శబ్దంగా వున్నారు. చెట్లు నిశ్శబ్దంగా లేవు.

దూరంగా లైట్లు. ఆశ! లైటు వచ్చింది. చేతులెత్తారు. లైటు ఆగింది. లారీ! కేబిన్‌లో ముగ్గురు మగవాళ్ళున్నారు. క్లీనర్ దిగాడు. సంభాషణ ముగిసింది.

తమ్ముడు ఎక్కి పురుషుం ప్రక్క కూర్చున్నాడు. కేబిన్‌లో ఎడంప్రక్క అక్క కూర్చుంది. కుడిప్రక్క తమ్ముడు. తమ్ముడు కుడిపక్క ఒకవ్యక్తి! ఆ వ్యక్తి ప్రక్క డ్రైవర్.

'నేను వెనుక కూర్చుంటా' అంటూ క్లీనర్ ఆమె మెడవైపూ, చేతుల వైపూ చూచి వెళ్ళి రైట్ అనుకొని రైట్ అనగానే క్రీరుమని ధ్వనిచేస్తూ కదిలింది లారీ!

లారీ వెళుతూ వుంటే నిశ్శబ్దత చీల్చుకు పోయింది. చీకటి విశృంఖలత పెరిగింది."

*   *   *

ఎండ మాడిపోతూ వుంది. దూరంగా ఎర్రదుమ్ము. లారీ కాదు. బస్సు. గుంటూరు పోయే బస్సు. బస్సును చూస్తే పెన్నిధిని చూచినట్లుంది. బస్సు ఆగింది. జనం చెట్టు మీద నుంచి, చెట్ల క్రింద నుంచి బిలబిల లాడుతూ వచ్చారు. రోడ్డు కదిలినట్లయింది. అంతలోనే రెండో బస్సు వచ్చింది. రవీ, పరతులూ రెండో బస్సు ఎక్కారు. అంతలోనే మూడో బస్సు వచ్చింది. మూడు గంటల్నుంచి రానివి, ఒకేసారి మూడు బస్సులు వచ్చాయి. జనం ఎక్కారు. ముంజల బుట్టలు ఎక్కాయి. బస్సులు బయలు దేరాయి. ఒకదాని వెంట మరొకటి ఆత్మీయులైన స్నేహితురాండ్రులాగా.

వారాకోడూరు దాటి ఒకమైలు వచ్చిం తర్వాత బస్సులో ప్రశ్నరాళ్ళు. 'అదుగో' అక్కడే' అనుకొంటూ ఏమేమో చెప్పుకొం టున్నారు.

రవి యధాలాపంగా అటువైపు చూశాడు. కళ్ళవెంట నీళ్ళు తిరిగాయి. రాత్రి సంఘ టనకు గురించే అందరూ చెప్పుకొంటు న్నారు. వినలేక బాధ పడుతున్నాడు రవి. బస్సు బుడంపాడులో ఆగింది. 'పస్తా

వీరో అని వెంటనే దిగుతూ 'తెలు ఏలా వుందో' అని గొణుక్కున్నాడు.

'దురదృష్టవంతురాలు' అనుకొన్నాడు రవి.

*   *   *

"అర్ధరాత్రి పదిన్నర గంటలకు చేబ్రోలులో ఆగింది లారీ. డ్రైవర్, ఓనర్, క్లీనర్ లారీ దిగిపోయి, టీ తాగి, అర గంటకు తిరిగివచ్చారు.

కుడిప్రక్క నుంచి ఓనర్ వీరన్న ఎక్కి తమ్ముణ్ణి దాటి వచ్చి కూర్చున్నాడు. వీరన్న ప్రక్కనే డ్రైవర్ వాగులు వున్నాడు. లారీ బయలుదేరింది.

వీరన్న తేపతేపకూ ఆమెను ఆకలిగా చూస్తున్నాడు. తమ్ముడి వళ్ళు మండుతూ వుంది. డ్రైవర్ మత్తులో వున్నాడు. వాగులు వళ్ళు తెలియటంలేదు. వీరన్నా తాగాడు. కానీ అంత మత్తుగా లేడు. మరో విధంగా మత్తెక్కి పోతున్నాడు. క్లీనర్ లోడ్ మీద కూర్చున్నాడు.

తమ్ముడికి ఏదో తెలియని భయం. వారా కోడూరు స్టాండ్‌లోకి లారీ రాగానే ఆపి దిగిపోదామనుకొన్నాడు. అక్క ఒప్పుకోదని భీతి! లారీ ఆపరేమోనని శంక!

ఆమె బింకంగా కూర్చుంది. గుండె

విలవిలలాడుతూ వుంది. రక్తంలో ఆవేగం. ఊపిరి ఆడనంత యాతన. స్టాండ్ దాటి సుమారు మైలుదూరం వచ్చింది లారీ! డ్రైవర్ లారీని రోడ్డు తప్పించి ప్రక్కనే వున్న డొంకలోకి మళ్ళించాడు.

'రోడ్డు మీద పోనియ్' తమ్ముడు కోపంగా చెప్పాడు.

జవాబు లేదు.

'ఏయ్ లారీ తిప్పు! ఆమె కోపంగా అరిచింది వీరన్న పగలబడి నవ్వుతున్నాడు.

లారీ ఆగింది.

అక్కా, తమ్ముడూ ఆపద గుర్తించారు. ఎప్పుడు వచ్చాడో క్లీనర్ ఎడం ప్రక్క డోర్ తీసి, ఆమెను క్రిందికి లాగాడు. మెళ్ళో హారం తెంపుకొన్నాడు. చేతుల గాజులు లాక్కుంటున్నాడు

'అక్కా! వాణ్ణి తన్ను! పారిపో! ఎక్కడ బునా దాక్కో' అంటూ ఉండగానే తమ్ముడు నోటి మీద చేయివేశాడు వీరన్న. తమ్ముడు చాచి వీరన్నను తన్నాడు. వీరన్న తూలి వాగులు మీద పడ్డాడు. తాగివున్న వాగులు డోర్ మీదపడి, అవి తెరుచుకోగానే క్రింద పడ్డాడు.

తమ్ముడు ఎడంప్రక్కకు దూకాడు. క్లీనర్‌ని చాచి పొత్తికడుపులో తన్నాడు. 'అమ్మో' అంటూ కూలబడ్డాడు క్లీనర్.

'నువ్వుపో! పారిపో!'

'నువ్వూ రారా!'

'నువ్వుపో! వస్తాను. నువ్వుపో! పోవే! తంతాను.'

లారీకి కుడిప్రక్క పడ్డ వాగులూ, వీరన్న ఎడంప్రక్కకు వచ్చారు. ఆమె పొలాలలోకి పారిపోతూ వుంది. వాగులు ఆమె వెంట బడ్డాడు. వీరన్న తమ్ముణ్ణి పట్టుకొన్నాడు. వాళ్ళిద్దరూ చాలాసేపు పెనుగులాడారు. చివరికి వీరన్నను పడద్రోసి అక్క దగ్గరకు పోయాడు తమ్ముడు. వాగులుతో అక్క పెనుగులాడుతూ వుంది. తమ్ముడు నాగులు వళ్ళంతా బాదాడు. అయినా పట్టు విడువ లేదు. అక్కను పట్టుకొన్న వాగులు చేతుల మీద బలంగా కసిగా కొరికాడు. పట్టు తప్పింది. 'పరుగెత్తు. పరుగెత్తవే' తీక్ష ణంగా చెప్పాడు.

'నువ్వూ రారా!'

'వస్తాను పో! ఆదీపం చూడు అక్కడికి పో పో' ఆమె పరుగెత్తింది. 'ఏమండీ! ఏమండీ! ఎవరండీ అక్కడ!'

క్లీనర్, వీరన్న లేచి వాగులు దగ్గరకు పరుగెత్తుకువచ్చారు.

డ్రైవర్ తమ్ముడు పెనుగులాడు తున్నారు. తమ్ముడు పారిపోవాలనీ, వాగులు పట్టుకోవాలనీ ప్రయత్నం. ఎవరికీ వీలు కావటంలేదు.

'ఇటే పరుగెత్తింది. పట్టుకోండి పోయి' వాగులు చెప్పాడు.

'ఎక్కడికి పోతుందిలే! వీడి సంగతే..' వీరన్న తమ్ముణ్ణి పట్టుకొన్నాడు. వాగులు చాచి కొట్టాడు.

'అక్కా!' అసహాయంగా తమ్ముడు అరి చాడు.


'ఏమండీ!' దీపం వైపు ఆశగా ఆమె పరుగెడుతూ వుంది.


ముగ్గురేకమై, ఒక్కణ్ణి, పసివాణ్ణి, కొడుతున్నారు.

'అక్కా! అక్కా!! అక్కా!!!'


'ఏమండీ! ఏమండీ!! ఏమండీ!!!' అక్క దీపం ఉన్నచోటికి చేరింది.

'ఎవరూ?' మలకమంచం మీద పడు కొన్న రాముడు బలహీనుడు, దుప్పటి తొలి గించుకొని లేచి ప్రశ్నించాడు.





7 రోజుల చికిత్సతో మీ చర్మం శుభ్రంగా వుంటుంది



* దాక్టర్లు సిఫారసుచేసే అసాధారణమైన క్రిమిసంహారక మొటిమల మందు.
* చక్కని సువాసన.)

Nital

మూ. 1.50 మాత్రమే పన్నులు వేరు

MEDICATED PIMPLE CREAM

(నిటాల్ మొటిమల మందు)

నిటాల్ మొటిమల మందు సురక్షితంగా, హాయిగా, పూర్తిగా మొటిమలను తొలిగిస్తుంది. చర్మంలోనికి పోయి, ముమ్ముందు తిరిగి మొటిమలను లేవకుండా చేస్తుంది. లోపలికంతా పోవడంవేత మొదలంటా మొటిమలను తీసివేస్తుంది. మొటిమలు ఎండి పడిపోగలవు. దీన్ని వాడిన తర్వాత ఇతర దోషాలేమీ వుండవు. మచ్చలుగాని, గుంటలుగాని పడవు.

యువతీ యువకులందరూ వాడవచ్చు. చర్మాన్ని శుభ్రపరచి, మనుపు తేల్చి నిగనిగలాడుతూ యౌవ్వనం ఉట్టిపడేటట్లు చేస్తుంది.

ఉచితం- నిటాల్ గురించివివరాలున్న చిన్నపుస్తకం డిస్ట్రిబ్యూటర్ల వద్ద దొరుకును.

ఉత్పత్తిదారులు:
కొచ్చిన్ పామ్ ప్రైవేట్ లిమిటెడ్
నవరత్న హౌస్, మంత్రా రోడ్, కొచ్చిన్-2.

ఉపయోగించు పద్ధతులను తెలుపు కరపత్రము ప్యాకెజిలో ఉంచబడినది.

మద్రాసు, ఆంధ్రప్రదేశ్, మైసూరు, కేరళ లకు డిస్ట్రిబ్యూటర్లు:

గణపతి అండ్ కంపెని,

103/104, లింగిశెట్టివీధి, పి. ఒ. బాక్స్ నెం. 1986. మద్రాసు—1.

అవాంఛితం

ఆమె చెబుతూ వుంది. అతను వింటు న్నాడు. అలజడి విన్నాడు. అర్థం చేసు కొన్నాడు.

'నువ్వుదాక్కో' అని, తాళాల గుత్తి బొడ్లోంచి తీసి, బేరన్ తలుపుతీసి, గొణిగి నట్టుగా 'లోపలికి పో' అని, అంతలోనే 'వద్దులే ఈ యింటిలోనే ఊపిరి బిగబట్టి దాక్కో. నీ తమ్ముడికేమీ భయంలేదు. దాక్కో తల్లీ!'

'అక్కా! అక్కా!! అక్కా!!!' ముమ్మారు అరిచాడు.

'వస్తున్నా!' కర్ర తీసుకొని బయలు దేరాడు రాముడు.

'అమ్మా! అమ్మ!! అమ్మా!! ! అ—మ్మ— ఆ—' మళ్ళీ అరుపు వినిపించలేదు.

''అయిపోయింది! అయిపోయింది!'', రాముడు మూలిగాడు. కర్ర దూరంగా పారే శాడు.

ఎవరో పరుగెత్తుకు వస్తున్న అలికిడి వినిపించింది. 'వస్తున్నారు' అనుకొన్నాడు. పైకి అన్నాడు. ఆమె పాకలో వుంది. పాక ముందు కుక్కిమంచం మీద పడుకొని దుప్పటి కప్పుకొన్నాడు రాముడు.

వాళ్ళు వచ్చారు. 'ఏయ్! ఎవరు నువ్వు?' రాముడు ఆవులించాడు.

'ఎవరు నువ్వు?'

'నేనా?—ఎవరు కావాలి మీకు?'

'ఇటు ఎవరన్నా వచ్చారా?'

'లేరే! ఆఁ—ఏదో అలికిడి అయింది. బేరన్ ప్రక్క ఎవరో పరుగెత్తినట్టు న్నారు బేరన్‌లోకి పోయారో ఏమో—బేళ్ళు న్నాయి. అమ్మో—దొంగలా—వెంకన్నగారి పొగాకు వేల ఖరీదు చేస్తుంది. దొంగలా?'

'కాదు. ఆడమనిషి!'

'ఆడమనిషా' మీకెవరి కన్నా భార్యా? పారిపోతుందా? రాత్రి బేరన్ తాళంవేశానో లేదో!'

'చూస్తాను' క్లీనర్ వెళ్ళాడు. 'తాళం తీసి వుంది.' పెద్దగా అరిచాడు. 'లోపల కదలిక.'

'ఆ! పదండి. వెతకండి. లోపల, దాక్కొని వుంటుంది!' ముగ్గురు లోపలికి పోయారు.

రాముడి తలలో మెరుపు మెరిసింది. తలుపు చెక్కలు దగ్గరకు లాగాడు. గొళ్ళెం పెట్టాడు. తృప్తిగా గాలి పీల్చుకొన్నాడు. 'అమ్మ! అమ్మ' లోపలికి పోయాడు. పాకలో కిరోసిన్ దీపం వెలుతురులో ఆమె కని పించింది. స్పృహతప్పి పడివుంది ఎండుగడ్డి మీద. పాకలోంచి వెలుపలికి వచ్చాడు. బేరన్ తలుపు మీద గట్టిగా కొడుతున్నారు లోపల్నుంచి. చెక్క పగిలినట్లు ఓటి మోత వచ్చింది. రాముడు గుండెలో దడ బయలుదేరింది. వాళ్ళు వస్తారు. వచ్చే స్తారు. ఎట్లా! ఎట్లా!! ఆవేగంగా వుంది. రెండుక్షణాలు తటపటాయించాడు. తనని చంపుతారు అనుకొన్నాడు. ఎండుగడ్డి వాలుగు పనలు వాకిలి దగ్గర పడేశాను. కిరోసిన్ దీపం తీసుకుపోయి ఆయిల్ గడ్డి మీద పోసి, ఒత్తి గడ్డి మీద పడేశాడు మంట! గడ్డి అంటుకొంది. వాకిలి అంటు కొంది. లోపల వేల ఖరీదు చేసే పొగాకు బేళ్ళు అంటుకొన్నాయి. ఎవరు బైటికి రాలేదు. కర్ర తీసుకొని వాకిట్లో నిల బడ్డాడు.

'చావండి. నల్లుల్లా చావండి. కుక్కల్లా నీచంగా చావండి. భార్యను భర్తకూ, కూతుర్ని తండ్రికీ కాకుండా చేసే దుర్మార్గుల్లారా చావండి. పాపాలన్నీ తలుచుకొంటూ చావండి! చావండి!!''

రాముడు విపరీతంగా నవ్వుతూ, వున్నాడు. పగలబడి నవ్వుతున్నాడు. క్రూరంగా, కసిగా, ద్వేషంగా నవ్వుతున్నాడు. భయంకరంగా, భీతావహంగా, రాక్షసంగా నవ్వుతున్నాడు.

వారాకోడూరు నుంచి జనం వచ్చేసరికి బేరన్‌లో బూడిద వుంది. నవ్వినవ్వి స్పృహ తప్పి పడిపోయిన రాముడూ, పాకలో స్పృహ లేకుండా అక్క, డొంక ప్రక్క ప్రాణం లేకుండా తమ్ముడూ కనిపించారు. తెల్ల వారింది.''

* * *

గుంటూరు బస్‌స్టాండ్‌లో బస్సు ఆగింది. అక్కడంతా రాత్రి జరిగిన సంఘటనను గురించే చెప్పుకొంటున్నారు. ఆమెను హాస్పటల్లో చేర్చారని అక్కడే విన్నాడు, రవి.

ఆమెను చూడాలనిపించి, హాస్పిటల్‌కు వెళ్ళాడు.

రవి, స్పృహ లేకుండా వున్న ఆమెను నీళ్ళు నిండిన కళ్ళతో చూశాడు.

ఆమె మెడికల్ స్టూడెంట్. పేరు, వి. వసంత!

వారఫలం

9-12-1966 శుక్రవారం మొదలు
15-12-1966 గురువారం వరకు.

మేషం : లాభం రావలసిన వ్యవహారాల్లోనే నష్టం వచ్చే పరిస్థితి యేర్పడుతుంది. సాహసముతో కూడిన వ్యవహారాల్లో జోక్యం చేసికోవడం తగదు. ప్రయాణాల్లో శ్రమ కలుగుతుంది. వారాంతంలో అనుకూల పరిస్థితులు యేర్పడతాయి. రావలసినడబ్బు సమయానికి అందగలదు.

స్త్రీలకు—కుటుంబ వ్యవహారాల్లో అధికవ్యయం జరుగుతుంది. సంతోషకరమైన వార్తలను వింటారు.

వృషభం : వారం మధ్యలో వృత్తి వ్యాపారాల్లో కొత్త సమస్యలు తలయెత్తవచ్చును. ముఖ్యమైన వ్యవహారాలు భాగస్వాముల నిర్ణయానికి వదలివేయడం మంచిది. ప్రయాణాల్లో ప్రయాస అధికంగా ఉంటుంది. ఉద్యోగంలో కార్యభారం పెరుగుతుంది. సాంఘిక కార్యక్రమాలకు మార్పులు వస్తాయి.

స్త్రీలకు—అనారోగ్య సూచనలు ఉన్నాయి. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు.

మిధునం : వృత్తిలో కొత్తవారి పోటీ యెదుర్కోవలసివస్తుంది. వ్యాపార విస్తరణ ప్రయత్నాలు శ్రమమీద ఫలించగలవు. ఆర్థిక వ్యవహారాలు యిదివరకటికంటె బాగా ఉంటాయి. సాహిత్య కళారంగాల్లో మీ కృషి రాణించగలదు. కొన్ని వ్యవహారాల్లో అనుకూలమైన మార్పులు వస్తాయి.

స్త్రీలకు—కుటుంబ వ్యవహారాలు సంతృప్తికరంగా ఉంటాయి. విలాసవస్తువులు కొంటారు.

కర్కాటకం : వృత్తి వ్యాపారాల్లో కొంచెం శ్రమ కలిగినా, దానికి తగిన ప్రతిఫలం లభించగలదు. అధికారులవలన జరగవలసిన వ్యవహారాలు సులువుగా నెరవేరుతాయి. రాజకీయ వ్యవహారాల్లో ప్రయోజనకరమైన మార్పులు వస్తాయి. ఉద్యోగంలో గౌరవ ప్రాబల్యాలు బాగా ఉంటాయి. పెద్దల సాంగత్యం లభిస్తుంది.

స్త్రీలకు—ఆరోగ్యం బాగా ఉంటుంది. శుభకార్యం విషయంలో అనుకూలత లభిస్తుంది.

సింహం : కొన్ని వ్యవహారాల్లో కార్యసాధనకోసం మీకు యిష్టంకాని వ్యక్తులతో సన్నిహితంగా వ్యవహరించవలసి వస్తుంది. రావలసిన డబ్బు సమయానికి అందక యిబ్బంది కలుగుతుంది. ప్రయాణాలు శ్రమ మీద ఫలిస్తాయి. సాహిత్య కళారంగాల్లో మీ కృషి రాణించగలదు.

స్త్రీలకు— కుటుంబ కార్యక్రమాలు ఒడుదుడుకులు లేకుండా నెరవేరుతాయి. ప్రయాణాలోచనలు చేస్తారు.

కన్య : ఆర్థిక వ్యవహారాల్లో అనుకూలమైన మార్పులు వస్తాయి. వృత్తిలో ప్రయోజనకరమైన వ్యక్తులను కలుసుకొంటారు. సాహసముతో కూడిన వ్యవహారాలు కొంతవరకు లాభించగలవు. స్థిరాస్తి వ్యవహారాల్లో చికాకులు వస్తాయి. వ్యాపారంలో అనుకూల వార్తలను వింటారు.

స్త్రీలకు:— ఆరోగ్యం సంతృప్తిగా ఉంటుంది. బంగారపుల వ్యవహారాల్లో మీ కృషి ఫలిస్తుంది.

తుల : వ్యాపార విస్తరణ ప్రయత్నాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. ఇతరులమీద ఆధారపడి యే వ్యవహారమూ ప్రారంభించడం తగదు. ఉద్యోగంలో గౌరవ ప్రాబల్యాలు బాగా ఉంటాయి. రావలసిన డబ్బు సమయానికి అందుతుంది. మిత్రులకు సహాయం చేస్తారు.

స్త్రీలకు:— కుటుంబ కార్యక్రమాలు కొంచెం శ్రమ మీద నెరవేరుతాయి. అలంకార వస్తువులు కొంటారు.

వృశ్చికం : కొంత మంది మిత్రులకు సహాయం చేయడానికి ప్రయత్నించడం వలన శ్రమ కలుగుతుంది. సాహసముతో కూడిన వ్యవహారాలు కొంత వరకు లాభించగలవు. వృత్తిలో నూతనావకాశాలు లభిస్తాయి. సంతానానికి సౌఖ్య సంతోషాలు లభించగలవు. ప్రయాణాలు ఫలిస్తాయి.

స్త్రీలకు— ఆరోగ్యం బాగా ఉంటుంది. బంధుమిత్రులను కలుసుకుంటారు.

ధనుస్సు : కొంత మంది మిత్రుల వ్యవహారాల్లో జోక్యం చేసికోవడం వలన కార్య భారం పెరుగుతుంది. వ్యాపారంలో శ్రమ మీద అనుకూలత లభిస్తుంది. సాంఘిక వ్యవహారాల్లో మీ ప్రాముఖ్యత పెరుగుతుంది. అధిక వ్యయం జరగడం వలన ఆర్థికంగా ఒత్తిడి వస్తుంది. స్థిరాస్తి వ్యవహారాలు బాగా ఉంటాయి.

స్త్రీలకు:— కుటుంబ వ్యవహారాల్లో అధిక వ్యయం జరుగుతుంది. శుభ కార్యాలు చేస్తారు.

మకరం : ఇది వరకు కొన్ని వ్యవహారాల చిక్కుల్లో ఉండిపోయిన డబ్బు యిప్పుడు చేతికి వస్తుంది. సాహసముతో కూడిన వ్యవహారాలు కూడా లాభించ గలవు. వారం మధ్యలో వృత్తి వ్యాపారాల్లో చికాకులు యేర్పడతాయి. ఉద్యోగంలో యెవరినీ విశేషంగా నమ్మడం తగదు.

స్త్రీలకు:— ఆరోగ్యం బాగానే ఉంటుంది. సంతానానికి సౌఖ్య సంతోషాలు లభిస్తాయి.


కుంభం : వృత్తి వ్యాపారాల్లో మీరు యిది వరకు చేసిన ప్రయత్నాలు యిప్పుడు కార్యరూపాన్ని ధరించ గలవు. సమయానికి యేదో ఒక విధంగా డబ్బు చేతికి వస్తుంది. ఉద్యోగంలో గౌరవం బాగా ఉంటుంది. రాజకీయ వ్యవహారాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. పెద్దల సాంగత్యం లభిస్తుంది.

స్త్రీలకు:— కుటుంబ వ్యవహారాల్లో కార్య భారం పెరుగుతుంది. దైవకార్యాలు నెరవేరుతాయి.

మీనం : వారం ప్రారంభంలోనే వృత్తి వ్యాపారాల్లో చికాకులు యేర్పడి తరువాత సర్దుకొంటాయి. వృత్తిలో మీకంటె పెద్ద వారు కూడా మీ సహకారాన్ని కోరవలసి వస్తుంది. వ్యాపారంలో మీ ఆలోచనలకు తగిన అవకాశాలు లభిస్తాయి. ప్రయాణాలు శ్రమ మీద ఫలిస్తాయి.

స్త్రీలకు:— ఆరోగ్యం విషయంలో జాగ్రత్త అవసరం. సభలలో గౌరవం బాగా ఉంటుంది.

—మహేష్



క) ఎక్కడో మిన్నులు నడ్డచోట అవూరా కువూరా దేశం ఒకటి ఉంది. ఆ దేశంలో చండిక జాతివారు, హరిశ్చంద్ర జాతివారు అని రెండు తెగల మనుష్యులు నివసిస్తున్నారు. వారి కట్టుబొట్లు వేషం భాష అన్నీ ఒక్కలాగే ఉంటాయి కాని ఒక్క భేదం మాత్రం ఉంది. చండిక జాతివారు చచ్చినా నిజం చెప్పరు. వారు నోరు విప్పితే అబద్ధమే వస్తుంది. ఇంక హరిశ్చంద్ర జాతివారిది సరిగ్గా వీరికి వ్యతిరేకం. వారు ప్రాణం పోయినా అబద్ధం చెప్పరు.



ఆ దేశంలో ఈ రెండు తెగల మనుష్యులు నివసిస్తున్నారని విని, ఆ జాతుల పుట్టుపూర్వోత్తరాలను గురించిన పరిశోధన లు జరుపుదామని ఒక చరిత్రకారుడు ఆ దేశం వచ్చాడు. వచ్చిన రోజునే అతనికి ముగ్గురు వ్యక్తులు ఎదురయారు దారిలో. వాళ్ళని పరకాయించి చూచి "మీది ఏ జాతి?" అని ప్రశ్నించాడు చరిత్రకారుడు.

వారిలో ఒకడు అస్పష్టంగా ఏదో గొణిగాడు. అతడు ఏమన్నాడో చరిత్రకారుడికి సరిగ్గా వినబడలేదు.

"క్షమించండి, మీరేమన్నారో తెలియలేదు." అప్పుడు వారిలో రెండవ వ్యక్తి ఇల్లా అన్నాడు. "తాను చండిక జాతివాడినని నని చెప్తున్నాడితడు"


"అబ్బే! ఇతడు చెబుతున్నది అబద్ధం నమ్మకండి" అన్నాడు మూడోవాడు.

ఆ రెండవ వ్యక్తి, మూడవ వ్యక్తి ఏజాతి వారో చరిత్రకారుడు గ్రహించి, చిరునవ్వు నవ్వేడు.

అతడు ఎల్లా తెలుసుకున్నాడో ఊహించ గలరా?



ఖ) ఒక పెట్టెలో 10 జతల నీలిరంగు మేజోళ్ళు, 16 జతల నలుపు రంగు మేజోళ్ళు కలగాపులగంగా పడి ఉన్నాయి. రైలుకి వేళ అయిపోయిందని కంగారు పడుతున్న ప్రయాణీకుడొకడు ఒక జత మేజోళ్ళు సంచీలో కుక్కుకుందామను కుంటూండగా, ఎలక్ట్రిసిటీ పోయి, లైట్లు, ఆరిపోయాయి. టార్చిలైటు లేదు. అగ్గిపెట్టె వెతికి తెచ్చే వ్యవధిలేదు. ఆదరా బాదరాగా ఆ పెట్టె తెరిచి, అందులో చేతికి అందిన మేజోళ్ళు కొన్ని తీసుకుని సంచిలో వేసుకుని రైలుస్టేషనుకి పరుగెత్తేడు. ఒకజత మేజోళ్ళు ఒకే రంగువి దొరకాలంటే కనీసం ఎన్ని మేజోళ్ళు ఆ చీకటిలో పెట్టెలో నుంచి తీసుకుని ఉండాలి?




గ) ఒకానొక ఊళ్ళో గోధుమలు పిండి పట్టడానికి డబ్బుకి బదులుగా పదోవంతు పిండి తీసుకోవడం పిండి మర యజమానికి మామూలు. పంద కిలోల గోధుమపిండి ఇంటికి తీసుకువెళ్ళాలంటే ఎన్ని గోధుమలు మర పట్టించాలి?




ఘ) "నాకు అన్నదమ్ములు, అక్కచెల్లెళ్ళు సమానంగా ఉన్నారు" అన్నాడొక పిల్లవాడు.

"నాకు అక్కచెల్లెళ్ళ కన్న అన్నదమ్ములు రెట్టింపు మంది ఉన్నారు" అంది ఆ అబ్బాయి చెల్లెలు. మొత్తం ఆ కుటుంబంలో అన్నదమ్ములు, అక్కచెల్లెళ్ళు ఎందరు?




చ) చిన్న నీటితొట్టెలో ఒక చిన్నారి కాగితపు పడవ, ఆ పడవ నిండా గులకరాళ్ళు ఉన్నాయి. వాటితో ఆడుకుంటున్న పిల్లవాడు పడవ మునిగేటట్టుగా ఉంది, మునిగిపోతుందేమో అని భయపడి, సగం రాళ్ళు తీసి ఆ నీళ్ళలో పడవేశాడు ఇప్పుడు తొట్టెలోని నీటి మట్టం పెరుగుతుందని కొందరు అన్నారు, నీటిమట్టంలో మార్పు ఏమీ ఉండదు, ఇదివరకు ఉన్నట్లే ఉంటుందని కొందరు అన్నారు మీరేమంటారు?

(జవాబులు: 55వ పేజీలో)


కిలా ప్రతి
పీల్పులో ఉల్లాసం
SPECIAL
QILA
ఇపుడు
ఆకర్షణీయమైన
ఈ పెట్టెలో
దొరకును
QILA
SPECIAL CIGARETTES
వజీర్ సుల్తాన్ తయారీ,

వైజ్ఞానిక గాథాశతి-8



ప్రమాణాల గాథ

— భాస్కర్...

ప్రమాణాలంటే ఆధారాలైన పద్ధతులు. దేనికి ఆధారాలూ అంటే, మన విజ్ఞానానికి. మనకు లభించే విజ్ఞానమంతటికీ ఆధారాలు నాలుగుట. ఇవే ప్రమాణాలు, శిరసావహించవలసినవి. మొదటిది ప్రత్యక్ష ప్రమాణము. అంటే ఇంద్రియాల ద్వారా ప్రత్యక్షంగా చూడడము. త్వక్చక్షు శ్రోత్ర జిహ్వ ఘ్రాణములని జ్ఞానము తెచ్చే ఇంద్రియాలు అయిదు. ఇవి తెచ్చే జ్ఞానము ప్రత్యక్ష జ్ఞానము. ఈ జ్ఞానాన్ని అందరూ పొందగలరు. ఇంద్రియాలు లోపిష్ఠాలు కాగూడదు ఒకటి, భ్రమకు లోను కాగూడదు రెండూ నియమాలు ప్రత్యక్షజ్ఞానము నిర్దుష్టము కావాలంటే. ఈ నియమాలకు లోబడి ఇంద్రియాల ద్వారా ఎవరు సేకరించినదైనా ప్రత్యక్ష జ్ఞానమే.

మొదట ఈ జ్ఞానాన్ని సేకరించిన వారు వ్రాసిపెట్టారు అనుకోండి. ఉత్తర ధ్రువ ప్రాంతములో ఈయా ప్రాణులున్నాయని ఒక వైజ్ఞానికుడు రాసి పెట్టాడనుకోండి. మనము, ఆయన గారు వాటిని చూచే వ్రాసి ఉంటాడు అని విశ్వసించి ఆ సంగతి నిజమే అని నమ్ముతాము. ఇంగ్లండు వెళ్ళే నా స్నేహితుడితో ఇంకొకరు "దోమ తెర పట్టుకు వెళ్ళనక్కర లేదు, ఇంగ్లండులో దోమలు లేవు" అని చెప్పాడు. 'ఈయనగారు మహా చూసి వచ్చాడు!' అన్న ఆక్షేపణకు— సోదా చూస్తే— అర్థమే లేదు! ప్రత్యక్ష జ్ఞానాన్ని సోదా చూసి ఒప్పునో కాదో ఎప్పుడైనా కనుక్కోవచ్చును.


చూసి రాసిపెట్టిన వారి పుస్తకాలు శబ్ద ప్రమాణము అని కూడా అనవచ్చును. మనవారు వేద ప్రామాణ్యాన్ని శబ్దప్రమాణం అన్నారు. వేదము, బైబిలు, ఖురాను, జెండ్ అవెస్త, గురుగ్రంథ సాహెబ్ వంటి గ్రంథాలు మత విషయాలలో ఆయా మతానుయాయులకు శబ్ద ప్రమాణాలు. జీవుడు మరణానంతర మేమవుతాడు? అన్న ప్రశ్నకు పై గ్రంథాలు ఒకే జవాబు ఇవ్వవు. అది ప్రత్యక్ష ప్రమాణము వల్ల గ్రహించలేని సంగతి. కనుక పారంపర్యముగానో విశ్వాసము వల్లనో నమ్మిన దానిని బట్టి ఆయా మతాల వారు తమ ఆచార వ్యవహారాలను తీర్చుకుంటారు. వీటికి నమ్మకమే ముఖ్యము. అయితే గెలీలియో వెసాలియస్, వంటి వైజ్ఞానికులు వైజ్ఞానిక ప్రయోగములు చేసి గురుని చుట్టూ తిరిగే ఉపగ్రహాలున్నాయి, మగవారికి ఆడవారికి రొమ్ము పంజరపు పక్కటెముకలు సమానమే, కీటకము భ్రమరము కాదు అంటూ ప్రత్యక్ష జ్ఞానాన్ని పుస్తకాలుగా రాసిపెట్టారు కదా? మరి కొందరు సృష్టికి భూమే కేంద్రము, మగవారికి రొమ్ము పంజరపు ఎముక ఒకటి తక్కువ, కీటకమే భ్రమర నాదము విని విని భ్రమరముగా మారుతుంది, అని వ్రాసినారనుకోండి. అప్పుడు ఏది ప్రమాణము? రెండూ 'శబ్ద' ప్రమాణాలే, అనగా వ్రాత ప్రమాణాలే! వీటిలో వీటిని నిర్ణయించడానికి ప్రత్యక్షము— ఇంద్రియావలోకనము— ప్రమాణము. ప్రత్యక్షానికి విరోధముగా వున్న దానిని మత గ్రంథాలలో వున్న దానికైనా సరే, "అది నిజము కాదు" అని శాస్త్రజ్ఞులు అనడాన్ని బట్టే విజ్ఞానపు తొలి శతాబ్దాలు సంక్షుభితాలయాయి. సోదా చూడడానికి వీలైన చోట్ల ప్రత్యక్షమే ప్రమాణము. అది వీలులేని చోట్ల ఎవరి నమ్మకము వారికి ప్రమాణము.

వైజ్ఞానికుల వ్రాతలకు కేవలము నమ్మకమే ప్రమాణము కాదు. గెలీలియో, పైజా గోపురము మీద నుంచి రాయినీ కర్రముక్కనీ వదలి వదలి వేసినప్పుడు రెండూ ఒకసారి భూమికి వచ్చాయి. అన్నమాటకు కేవలము అప్పటి రాతలేనా ప్రమాణాలు? ఈనాడు మనము అలాటి ప్రయోగము చేసినా అదే ఫలితము వస్తుంది. కాని వాడు ఆ రాతలు తప్పు అంటాము. ఇంగ్లండులో రాణీ గారున్నారట అన్నమాట మనము ప్రత్యక్షంగా మనకు మనము పరీక్ష చేసుకోడానికి వీలైనదే. కనుక వైజ్ఞానికుల రాతలు ప్రత్యక్ష ప్రమాణాలు గనే స్వీకరిస్తాము.

ఆప్తవాక్యము అంటే మన శ్రేయస్సు కోరిన వారి వాక్యము. ఇది మత విషయాలలోనూ సాధన విషయాలలోనూ ప్రమాణంగా స్వీకరిస్తాము. విజ్ఞాన వీధులలో ఆప్తవాక్యమంటూ లేదు. ఫారడే రాగి రేకులతో ఒక గది కట్టాడూ. దానిలో కూర్చుని ఉండి దానికి యంత్రాలతో విద్యుదావేశము ఇప్పించాడు. 'గుల్లగా వున్న లోహగోళానికి లోపలి వైపు విద్యుదావేశమిచ్చినా ఆ ఆవేశము దాని పై భాగము మీదే వుంటుంది.' అని కని పెట్టాడు ఫారడే. ఆ సత్యము నిరూపించడానికి రాగి గదిలో కూర్చుని తన సహాయుడి చేత ఆ గదికి విద్యుదావేశాన్ని ఇప్పించాడు. తెలియని ఆప్తుడు 'ఆ గది లోంచి నీవు వచ్చేయి' అంటాడు! విజ్ఞాన విషయాలలో ఆప్తవాక్యమూ శత్రువాక్యమూ లేవు.

ఇక మిగిలినది అనుమానము. రెండు మూడు ఉదాహరణాలను బట్టి 'జరుగుతున్నది ఇదికాబోలు' అని తీర్మానించడాన్ని అనుమాన మంటారు. 'ఎగిరే ప్రాణులు గుడ్లు పెట్టి పొదుగుతాయి' అన్న అనుమానమును పరిశీలించండి. పిట్టలూ పక్షులూ, చివరికి నిప్పుకోడి అనబడే ఆస్ట్రిచ్ కూడా గుడ్లు పెట్టి పొదుగుతుంది. అయితే గబ్బిలము ఎగురుతుంది. కాని గుడ్లు పెట్టదు. పిల్లల్ని కని పాలిస్తుంది. కనుక ఆ అనుమానము తప్పు. 'ఈకల రెక్కలున్న ఎగిరే ప్రాణులు గుడ్లు పెట్టి పొదుగుతాయి' అని దిద్దుకోవాలి. ఈ దిద్దుబాటు దేని వల్ల జరిగింది? సోదావల్ల ప్రత్యక్ష అవలోకనము వల్లనగా. అనుమానములు (Inferences) సోదా వల్ల శుద్ధి అవుతాయి. సోదాకి నిలువని అనుమానాలు సందేహాలే.

పూర్వులు ఆగ్నేయ వారుణ, నాగాస్త్ర, గరుడాస్త్రాలు ఉపయోగించారు. 'పర్వతాలకు రెక్కలుండేవి' వంటి వాక్యాలకు ప్రమాణమేమిటి? పుస్తకాలు. 'అవి ఎవరైనా చూచారా? ఈ కాలంలో చూపించగలరా?' అన్నవి వైజ్ఞానిక ప్రశ్నలు, 'సోదా అవసరము' అని జ్ఞాపకము చెయ్యడము అన్నమాట. ఈ మాటలు విని వెక్కసపడి ఒక 'పెద్ద' మనిషి, 'నీతాతనీ అవ్వనీ నీ వెరుగుదువా? నిరూపించగలవా?' అని అడిగితే ఏమనాలి. తాతా అవ్వా లేకుండా తండ్రి లేడు, అస్త్రాలు లేకుండా యుద్ధాలు లేవన్నట్లా? నిరూపించ వీలు లేనివి ఉన్నాయి అంటే ఎంత లాభమో, లేవు అంటే అంతే నష్టము. టప్పాలూ గొప్పలూ మాత్రము మిగులుతాయి.



మేలిరకం "డస్ట్" టీలలో సాటిలేనిది
లిప్టన్స్
హిమాలయన్
గోల్డెన్ డస్ట్ టీ
HIMALAYAN
FINEST
GOLDEN DUST TEA
LIPTON'S
FINEST
GOLDEN DUST TEA
ఈ టీతో మీరు కమ్మని, చిక్కని బంగారు ఛాయగల టీ కప్పుల వెంబడి కప్పులు అతి త్వరలో తయారుచేయగలుగుదురు. ఈ పానీయమును మీరే త్రాగి చూడండి. మీ అతిధులకుకూడా యివ్వండి. మీరు తప్పక సంతోషముతో వికసిస్తారు. అవును- మీ ఆనందభరితులైన అతిధులుకూడాను లిప్టన్స్ హిమాలయన్ గోల్డెన్ డస్ట్ టీ మేలిరకం టీలలో నిజంగా అద్వితీయమైనదని.
LIPTON
లిప్టన్స్
అంటే
మంచి టీ

న్నారు. తన చదువు సాగిపోతోంది. ఈ చదువుకి ప్రయోజనం ఆయన దృష్టిలో తనకు ఆత్మ విశ్వాసం లభింపజేస్తుందని. తను ఈమూడు సంవత్సరాల లోనూ, ఎన్నిపోటీలలో బహుమతులు సంపాదించిందీ ఆయన తెలుసుకుంటే ఎంతో సంతోషిస్తారు! తన చదువు కేవలం తన ఆత్మ విశ్వాసం పెంపొందించడమే కాకుండా మంచి చెడ్డల గురించి ఆలోచించేందుకూ తను ఆలోచించింది ఇతరులకు తెలియజెయ్యడానికి ఉపయోగించాలనుకుంది. అలా ఆలోచిస్తూ నిదుర పోయింది.

యవ్వన మనేది అమాయకతకూ, విశ్వాసానికీ, ఆశ్చర్యానికీ నెలవైనది. అంతులేని ఉత్సాహంతో అందరాని ఆదర్శాలకై అనంతంలో పయనించే అద్భుత యాత్ర యవ్వనం! సుందర స్వప్నాలూ, మనోహర కాంక్షలూ, మధుర వేదనలూ, నిరంతరం అలుముకునే స్థితి యవ్వనం! ఆశానిరాశలుగాని, వేదనా ఆనందాలుగాని, ప్రశాంత ఉద్వేగాలు గాని, ఉధృతంగా విజృంభించే సమయం యవ్వనం! జీవితంలో యవ్వనం ఎంత ముఖ్యమైనదో, చరిత్రలో యువతీ యువకుల పాత్ర అంత ముఖ్యమైనది.

* * *

"నువ్వు సుఖంగా లేవని నేను కూడా చాలా విచారిస్తున్నాను. కాని మనం అనుకున్నట్లుగా అవవని, కొన్ని విషయాల గురించి విధితో రాజీపడవలసిందేననుకుంటాను. అతనిని నేను భర్తగా అనుమానించలేక పోయాను. మొదట చూసినప్పుడు, చదువుకున్న వాడుకదా, తప్పక సంస్కారంతోను, సహృదయంతోనూ ఆదరిస్తాడనుకొన్నాను, ఇంత మూర్ఖత్వం ప్రదర్శిస్తాడనుకోలేదు."

"పోనీలెండి మీ సానుభూతైనా సంపాదించ గలిగాను, మీ ప్రేమను పొందలేక పోయాను."

"నాలో ఏముందని నువ్వింత ప్రత్యేకత నిస్తున్నావో ....."

అంతకన్నా ఎక్కువ తను వినడం అనవసరం అని, అంతకు పూర్వం వినిన మాటలు తను అప్రయత్నంగా వినవలసి వచ్చిందని అనుకుంటూ, గోడవద్దనున్న భానుమతి వెనక్కి తిరిగి వెళ్లిపోబోయింది. ఆమె

సుప్రభాతం

(12-వ పేజీ తరువాయి)

సాయంకాలం అయిదున్నర గంటలకు ఉమనొకసారి కలుసుకోవాలని అనంతరావు గారింటికి వచ్చి హాలులోకి ఎచ్చే సరికి, ఎవరిదో ఒక మగ గొంతు వినిపించి ప్రక్కనున్న గదిగుమ్మానికి ఇవతలగా నిలబడి పోయింది. తను తిరిగి వెళ్లిపోదామనుకునే సరికి, ఉమ గుమ్మం బయటకు చూచి, "రా! భానుమతీ!" అని పిల్చింది. తను గదిలోకి వెళ్లేసరికి సుమారు పాతికేళ్ళు పైబడ్డ ఒక అందమైన యువకుడు కన్పించాడు. అతను తనవైపొకసారి చూసి, "వస్తా, ఉమా! మాస్టారితో నేను వచ్చి వెళ్లానని చెప్పు." అని బయటికి వెళ్లి పోయాడు. భానుమతి కెందుకో అతనిలో ఏదో ప్రత్యేకత కన్పించింది. "ఆయనెవరు ?" అని అడిగింది ఉమను.

"సత్యమూర్తిగారని చాలా మంచివారు. ఆయనా, నేనూ చిన్నప్పటినుండి స్నేహితులం. మా నాన్నగారికి ఆయనంటే చూడకుండా వుండలేరు" అంది ఉమ.

"మరి మీకో?" అంది కొంటెగా భానుమతి.


"ఏమిటి?" అంది ఉమ, అర్థంకానట్లు.

"నేను, తిరిగి వెళ్లిపోదామనుకుంటూనే, మీ సంభాషణలో ఆఖరి ముక్కలు వినేశాను. చేసిన పాపం చెప్తే పోతుందని చెప్తున్నాను." అంది భానుమతి మందహాసంతో.

"బలేదానివే. అయితే చెప్తా విను. ఆయనను, నేను ప్రేమించాను. ఆయనకా విషయం వ్యక్తం చేశాను. కాని ఆయన నా ప్రేమను అంగీకరించనూలేదు, నిరాకరించనూ లేదు. ఆయన చాలా కష్టాలలో చిక్కుకున్నారు. తను ఇప్పుడప్పుడే వివాహం గురించి ఆలోచించలేననీ, నాకు వేరే సంబంధం చూసుకోమని చెప్పారు. మానాన్నగారు నాకు వేరే సంబంధం ఏర్పాటు చేశారు. నా వివాహం అలా జరిగింది."

"మీ స్వంత విషయాలలో జోక్యంచేసుకుంటున్నానేమో? అని భయంగా ఉంది గాని, మీరు అప్పుడప్పుడు నిరుత్సాహంగా ఉంటూంటారు కారణమేమిటా? అని అడగాలని పిస్తుంది."

"దానికి కారణం, నావివాహం మేము అనుకోని పరిణామాలకు దారితీయడమేను. మా ఆయన విషయంలో మానాన్నగారు పొరపడ్డారు. లా పాసయినవారు కదా, ప్రాక్టీసు చేసినా చెయ్యక పోయినా తరగని ఆస్తి వుందికదా అనీ అన్నిటికన్నా ముఖ్యం తనస్నేహితుని కుమారుడని బాగా లాంఛనాలు జరిపి, ఘనంగా నా వివాహం చేశారు. వివాహం అయిన తరువాత మూడు నాలుగు నెలలు మాయిద్దరిమధ్య బాగానే వుంది. తరువాత ఆయన డబ్బు గురించి నన్ను వేధించటం ప్రారంభించారు. క్రమక్రమంగా ఆయన నన్ను వివాహం చేసుకోవడం, మానాన్నగారి డబ్బును చూసేనని మాకు బోధపడింది. రెండు సార్లు ఆయన అడిగిన డబ్బును తీసుకువెళ్లి ఇచ్చాను. ఆయనకు పేకాట పిచ్చి బాగా వుంది. దానికి తోడు ఉద్యోగం చేయకుండా ప్రాక్టీసులేకుండా ఇంట్లో కూర్చోవటం, ఇంట్లో ఏడెనమండుగురు ఆయనమీద ఆధారపడటం మూలాన తరుచూ డబ్బు అవసరం అవుతూనే వుంటుంది. ఆయన సంపాదన కోసం తాపత్రయం ప్రారంభిస్తే బాధ్యత తెలిసివస్తుందని మా నాన్నగారాయనకు అనేకసార్లు ఉద్యోగం చెయ్యమని బోధించారు. ఆయన వినలేదు. చివరకు నాన్నగారు నన్నిక్కడే వుండమనీ అతను సంపాదన ప్రారంభించే వరకూ వెళ్లవద్దనీ అన్నారు. తద్వారానైనా ఆయన గృహస్తారేమోనని కొన్ని నాకా నమ్మకం



అంతర్వేదిలో నరసింహస్వామి ఆలయ గోపురం. పునర్నిర్మాణం తర్వాత. ఫోటో: ఎస్. వి. రామశాస్త్రి, (శిల్పి ఏడిద సూర్యనారాయణ.)

సుప్రభాతం

లేదు. భార్య తన మాట వినలేదని కోపం వస్తుంది గాని, తన ప్రవర్తనలోని లోపం ఆయనకు తెలియదు. ఏం చెయ్యాలో నాకు తోచడం లేదు." అని నిట్టూర్చింది ఉమ.

"విషమ పరిస్థితిలో పడ్డారే పాపం!"

"నాకేమీ తోచటంలేదు. పైచదువు చదవమని నాన్నగారూ ప్రోత్సహిస్తున్నారు. ఎంత చదువు చదువుకున్నా జీవితం ఇంతే కదా! అనిపిస్తుంది. మా ఆయన మారాలి. అంతవరకూ నాకీ బాధ తప్పదు. ఆయన ఇప్పట్లో మారుతారని నాకనిపించదు."

"నాకు తెలియక అడుగుతాను, మొదట మీరొకర్ని ప్రేమించారు కదా, ఆయన్నే గట్టిపట్టు బట్టి వివాహం చేసుకోలేక పోయారా?"

"అది నా ఒకర్తి మీదా ఆధారపడి లేదుకదా. మూర్తిగారు అంత విరక్తిగా వుండేసరికి నాకే పౌరుషం వచ్చింది. దానికి తోడు మా బంధువులంతా నా పెళ్లి చేసెయ్యమని గోల. డబ్బుకు కొదువు లేదు కదా తప్పకుండా సుఖపడ్తానని అనుకున్నాను. ఇప్పుడిప్పుడు అనిపిస్తుంది, మూర్తిగారిని తప్పర్థం చేసుకున్నానని. ఆయన అనేక కష్టాల్లో వుంటూంటే, ఆయన్ని నా యందు శ్రద్ధ చూపించ లేదని అనకోవడం నాదే పొరపాటు. నాకు కూడా గాయం తగిలేదాకా, ఒకరి గాయం ఎలాంటిదో తెలుసుకోలేక పోయాను. ఈ సంవత్సరకాలం లోనూ వ్యథతో బాటు, నా హృదయం విశాలమవడం కూడా జరిగింది. ఆయన తత్వమే వేరు, ఆయనను ప్రేమించే వాళ్లు ఆయన మనస్తత్వాన్ని అర్థం చేసుకోవడానికి ప్రయత్నించాలి గాని, ఆయన జీవితంలో మరొక సమస్య కారాదు. అందుకే ఆయన వివాహం చేసుకో నన్నారు. దానికి తోడు ఆయన కుటుంబ పరిస్థితులు కూడా అలాగే వచ్చాయి."

"ఆయన ఏం చేస్తున్నారు?"

"రామవరం అని ఒక పల్లెటూరు దగ్గర సుగర్ ఫాక్టరీ వుంది. దాంట్లో పని చేస్తున్నారు."

"వివాహం కాలేదా?"

"లేదు. దానికొక బలమైన కారణం కూడా వుంది, ఆయన చెల్లెలి వివాహ బాధ్యత ఈయన మీద వుంచి, ఆయన తండ్రి చనిపోయారు. చెల్లెలి వివాహం చేద్దామని రెండు మూడు సంవత్సరాలు విశ్వప్రయత్నం చేశారు, కాని కుదరలేదు. ఇంతలో ఏం జరిగిందో ఏమో, ఆమె హఠాత్తుగా ఎవరికీ చెప్పకుండా ఎక్కడికో వెళ్లి పోయింది. ఆమె కోసం చాలా ప్రయత్నం చేశారు గాని, దొరుక లేదు. ఆమె కన్పించే దాకా ఆయన పరిస్థితి అంతే ననుకుంటాను."

భానుమతి మౌనంగా కొద్ది సేపు వూరుకుంది. తరువాత "హు!" అని నిట్టూర్పు విడిచి, "పాపం!" అంది.

హాల్లోకి కొందరు యువతులు వచ్చినట్లు జోళ్ల చప్పుళ్లు విని, ఇద్దరూ గది లోంచి హాల్లోకి వచ్చారు.

(సశేషం)

కమ్యూనిస్టు దేశాలలో కాంగ్రెస్ అధ్యక్షుడు కామరాజ్

ఆర్. వెంకట్రామన్

(గత సంచిక తరువాయి)

ప్రపంచ ప్రజలకు తెలియకుండా, దేశంలో జరిగే మహత్తరమైన మార్పులను గురించి రష్యా పత్రికా రచయితలతోను, అధికారులతోను చర్చిస్తూ వున్నందున వాల్గాగ్రాడ్ నుంచి, లెనిన్‌గ్రాడుకుచేసిన విమాన ప్రయాణం చాల త్వరగా ముగిసిపోయినట్లు తోచింది. చర్చలు రసవత్తరంగా వున్నప్పుడు ఎలా కాలం గడిచి పోతుందో తెలియదు గదా!

ఆరోజు ఉదయం ఒకటిన్నర గంటకు కామరాజ్ లెనిన్‌గ్రాడ్ వచ్చిచేరారు. అప్పుడు చిన్నగా చినుకులు పడుతున్నాయి. లెనిన్‌గ్రాడ్ ఉత్తరధ్రువానికి సమీపంలో వున్న నగరం. అందువల్ల అక్కడి శీతోష్ణస్థితి ఎప్పుడూ చాల శీతలంగా వుంటుందని చెప్పనక్కరలేదు.

కార్యాంతరంవల్ల లెనిన్‌గ్రాడ్ మేయర్ మాస్కోకు వెళ్లి వుండడంవల్ల తాత్కాలిక మేయర్ శాశ్వత మేయరు శుభాకాంక్షలతో కామరాజ్‌కు విమానాశ్రయంలో స్వాగతమిచ్చారు.

లెనిన్‌గ్రాడులో మేము విడిసిన ప్రాసాదం ఒక పూర్వపు ప్రభువుది. 17, 18 శతాబ్దాల నాటి కళావైభవంతో విలసిల్లే ఆ ప్రాసాదం, అప్పటి కళావైభవానికి ప్రతీకగా వుంది. ఆకాశం అంటే, గుమ్మటాలు, నగిషీ పనిగల పెద్ద ఎత్తయిన మేజా బల్లలు, కుర్చీలు అప్పటి ప్రభువులు ఎంత విలాసంగా జీవితం నడిపేవారో తెలిపేవి.

లెనిన్‌గ్రాడ్ నగరం 'పీటర్ ది గ్రేట్' అని వ్యవహరించబడే జార్ చక్రవర్తి నిర్మించినట్టిది. తన దేశం తక్కిన ఐరోపా దేశాలన్నిటి కన్నా ఎక్కువ దర్శనీయంగా వుండాలని, ఆ దేశాలకు సన్నిహితంగా వుండాలి అనే ఆతురతతో పీటర్ చక్రవర్తి రష్యా రాజధానిని మాస్కో నుంచి లెనిన్‌గ్రాడుకు మార్చారు. లెనిన్‌గ్రాడ్ అనేది తర్వాత వచ్చిన పేరు. జార్ చక్రవర్తుల రాజధానిగా వున్నప్పుడు సెయింట్ పీటర్స్‌బర్గ్ అని దీనిని వ్యవహరించేవారు. ఈ నగరాన్ని రమణీయం చేసి, బలపరచడానికి జార్ చక్రవర్తులు ఎంత శ్రద్ధ వహించారనేది ఈ నగరాన్ని చూస్తేనే తెలుస్తుంది.

"మాస్కో కన్నా లెనిన్‌గ్రాడ్ అందమైన నగరం" అని తమ అభిప్రాయం వెళ్లిబుచ్చారు కామరాజ్.

నేవా అనే పెద్ద నది నగర మధ్యలో ప్రవహిస్తున్నది. ఇదికాక లెక్కలేనన్ని చిన్న చిన్న కాలువలు నగరంలోనూ, చుట్టూనూ పారుతున్నాయి. కళ్లు చెదరగొట్టే శిల్ప కళాసంపద, మనస్సును పరవశం చేసే ప్రఫుల్ల పుష్పసంపద, విశాలమైన, పొడవైన వీధులు ఇవన్నీ లెనిన్‌గ్రాడ్ నగర సౌందర్యాన్ని అతిశయింపజేశాయి.

లెనిన్‌గ్రాడ్ అంతటా తిరిగి చూచిన తర్వాత "బిస్కారేవ్" స్మారక చిహ్నం రాతికట్టడాలు చూడడానికి వెళ్లాము మేము.

ఈ స్మారకచిహ్నం వెనుక పెద్ద శోక గాథ వుంది. ఆ శోకంతో పాటు ఆత్మగౌరవం కలిసి వుండడం చెప్పదగిన విషయం.

ద్వితీయ ప్రపంచ సంగ్రామ కాలంలో నాజీ సైన్యాలు లెనిన్‌గ్రాడ్‌ను చుట్టుముట్టి 1000 రోజుల పాటు ముట్టడి వేశాయి. వెలుపలి నుంచి ఆహార వస్తువులు గాని, ఇతర పదార్థాలు గాని లోపలికి తీసుకుని రావడం సాధ్యం కాలేదు. లెనిన్‌గ్రాడుకు ఐదు మైళ్ల దూరంలో పరివేష్టించిన నాజీ "సైనికులు నేడు పట్టుకుందాం లెనిన్‌గ్రాడ్‌ను; రేపు అది మన వశం!" అని చాటుకుంటూ వచ్చారు. కాని, వారు దానిని కైవసం చేసుకోలేకపోయారు. అయినప్పటికీ ఆ ముట్టడి కారణంగా,



లెనిన్.

లెనిన్‌గ్రాడ్ నగరంలోని ఐదు లక్షల మంది పౌరులు ఆకలితో మరణించారు. ఐదు లక్షల మంది సైనికులు యుద్ధంలో మరణించారు. ఈ పదిలక్షల మంది ప్రజల జ్ఞాపక చిహ్నమే "బిస్కారేవ్". ప్రజల మానప్రాణాలు కాపాడిన మహావీరులసమాధికి పుష్పగుచ్ఛాలు సమర్పించి అంజలి ఘటించారు కామరాజ్.

బిస్కారేవ్ స్మారకచిహ్నం కట్టడాలు ఇంచుమించు ఒకమైలు పొడవుంటాయి. దానిలో ప్రపంచశాంతి చిహ్నమైన పూలమాల ధరించిన ఒక వీరమాత శిలావిగ్రహం స్థాపించబడింది. ఈ రాతి కట్టడంలో, యుద్ధకాలంలో జరిగిన సంఘటనలను జ్ఞాపకపరిచే వస్తువులు ప్రదర్శించబడ్డాయి. వాటిలో ఒక అమ్మాయి డయిరీ కామరాజ్ దృష్టిని ఆకర్షించింది.

"నేడు నా సహోదరుడు మరణించాడు" అని ఒకరోజును ఆ డయిరీలో ఆ అమ్మాయి గుర్తు పెట్టింది. "నేడు నా సహోదరి" ఇది మరొక నాటి గుర్తు. వరుసగా, డయిరీ పుటలు తిరగవేస్తూ పోతే, ఒక్కొక్క రోజు ఆ అమ్మాయి బంధువులలో ఒక్కరు మరణించడం కనిపించింది.

"కొన్నిరోజుల తర్వాత ఆ డయిరీలో ఏమీ వ్రాయబడలేదు. ఆ అమ్మాయే మరణించి వుంటుంది" అని మాకు ఆస్మారక చిహ్నం చూపిన అధికారి తెలియజేశారు.

ఈ దుఃఖమయ వర్ణన మా అందరినీ కదిల్చివేసింది.

ఈ రాతికట్టడాన్ని చూడడానికి రోజూ వేలాదిగా జనం వస్తారు. నేను ముందు ఒకసారు ఈ స్మారకచిహ్నాన్ని చూచినప్పుడు గూడ ఈ విధంగానే రోజూ వేలాదిగా జనం రావడం చూచాను. సుమారు పది సంవత్సరాల బాలబాలికలు తమ పాఠశాలల నుంచి 'ఎక్స్‌కర్షన్' వచ్చి, ఇక్కడికి వచ్చారు. వారిని పిలుచుకొని వచ్చిన ఉపాధ్యాయులు, ఆ రాతి గది వెనుక వున్న వీరగాథను పిల్లలకు చెబుతుండడం విన్నాను.

"ఈ ప్రదేశంలో మీ తల్లిదండ్రులు తాతముత్తాతలు తమ మానసంరక్షణ కోసం తమ ప్రాణాలు కోల్పోయారు. ఆనాడు వారు చేసిన మహాత్యాగం ఫలమే నేడు మీరు సంతోషంతో జీవితం గడుపడం. నేటి మీ సుఖజీవితానికి వారు ఆనాడే త్యాగం

చేశారు. అందువల్ల మీ సంతతి బాగా బ్రతకడానికి మీరు బాగా పాటుపడాలి. దేశ భక్తి, త్యాగం ప్రతి ఒక పౌరునికీ అవసరం'' అనే విషయాన్ని వివరించారు ఉపాధ్యాయులు.

మనం ద్వితీయ ప్రపంచ సంగ్రామం అనే దాన్ని రష్యావారు ''మాతృభూమి విడుదల పోరాటం'' అని వ్యవహరిస్తారు.

స్మారక శిలాభవనాన్ని చూచి వెలుపలికి వచ్చినప్పుడు, వాన కొంచెం జోరుగాపడింది. కామరాజ్ ఎప్పటిలాగే ధోవతి, షర్టులతో వున్నారు. పెక్కుమంది పరిగెత్తి వచ్చి ఆయనకు వానకోట్లు అందిచ్చారు. కాని కామరాజ్ వాటిని తీసుకోలేదు.

కామరాజ్ ఈ విధంగా వానకోటు కూడా వేసుకోకుండా సామాన్యమైన దుస్తులతో వుండడం చూచిన కొందరు రష్యా మహిళలు చాల సంతాపంతో గద్గద కంఠంతో తమ రష్యన్ భాషలో ఏదో మాట్లాడుకున్నారు. పత్రికా విలేఖరులు ఆ మహిళల వద్దకు వెళ్ళి, ''ఏమిటి మాట్లాడుతున్నారు?'' అని ప్రశ్నించారు. ''అయ్యో!

కామరాజ్

లేవం! ఈ నాయకుడు అంత బీదవాడా? ఒక వానకోటు కూడా తీసుకోనంతటి దరిద్రావస్థలో వున్నారే! చుట్టూ వున్న వారెవరైనా ఆయనకు కోటు యిచ్చి సహాయం చేయగూడదా?'' అంటూ విచారపడ్డారు.

సామాన్యంగా, విదేశాలలో కొత్తరకం దుస్తులనో, కొంత మార్పుగల దుస్తులనో ధరించిన వారిని చూచి, ఆదేశ ప్రజలు పరిహసించడమో, హేళనగా మాట్లాడడమో కద్దు. కాని, కామరాజ్ కు సంబంధించినంతవరకు, ఆయన గంభీర వ్యక్తిత్వాన్ని, ప్రవర్తనను చూచి ఆయన వెళ్ళినచోటెల్లా జనం మర్యాద చేశారేగాని, ఒక్కచోటనైనా హాస్యం చేయలేదు; తక్కువ చూపుతో ప్రవర్తించలేదు. దీనిని చూచినప్పుడు నాకు కలిగిన ఆశ్చర్యమేమిటంటే, తమిళనాడులోనయితే, ఆయన సేవ, త్యాగం, తెలుసుకున్న ప్రజలు, ఆయనకు గౌరవ సత్కారాలు చేస్తున్నారంటే సరే; బాగుంది. ఆయనను గురించి ఏమీ తెలియని ఇతర దేశ ప్రజలు గూడ ఆవిధంగానే గౌరవిస్తున్నారే! ఎందుకు? ఇలా గౌరవించడం ఒక్క లెనిన్‌గ్రాడ్‌లో మాత్రమే కాదు. ప్రపంచంలో ఆయన ఎక్కడకు వెళ్ళినా, ఈ ఆదరసత్కారాలే, ఆయనను చూడగానే తప్పక కలుగుతున్నాయని నాకు తోస్తుంది.

దీనికి కారణమేమిటి?

ఒకే ఒక కారణం. అది కామరాజు గంభీరమైన వ్యక్తిత్వమే. ఆంగ్లంలో ''పర్సనాలిటీ' అంటారే అదే. ఆ ఒక్కమాటకు ఏమని అంటాము? దుస్తులు, ఆకారవిశేషం, 'దేశం, భాష, మొదలయిన వాటికంతా ప్రజలను ఆకర్షించే శక్తి వుంది. ఆ శక్తే 'పర్సనాలిటీ'. దానిని కామరాజుకు భగవంతుడు ధారాళంగా ప్రసాదించాడు.

పెట్రోడ్ వోరెడ్స్ అని వ్యవహరించబడే జార్ చక్రవర్తి కోట ప్రపంచంలోని ఏడు అద్భుతాలలో ఒక్కటి. అక్కడున్న అందమైన జలయంత్రాలు, మేడలు, అందరి [illegible]స్సునూ కొల్లగొడుతాయి. కామరాజు [illegible] కోటకు వెళ్లారు. రంగు రంగుల కాంతులీనే జలయంత్రాలు, ఆనీటి ఊటల మధ్యన సింహం నోటిని శామ్‌సన్ చీల్చుతున్నట్టు చెక్కిన శిల్పాలు, ఆయన మనస్సును ఎంతగానో ఆకర్షించాయి. అక్కడి ఉద్యానాలు ఒకదానిలో - మతాబు వెలిగించినట్టున్న ఒక నీటిబుగ్గ కనిపించింది. దానిలో అర్ధనిమిషానికొకసారి, ఆగి ఆగి నీళ్ళు పారుతాయి. పైకి ఎగజిమ్ముతాయి. ఆ నీళ్ళ మీద పడకుండా, ఆ నీటిబుగ్గను దాటడమనేది ఒక సరదా, ఆట. కామరాజు ఆ ఆటలో పాల్గొన్నారు. ఫలితమేమిటి? నీరు ఆయనను ముంచి ఎత్తింది.

మేము వెళ్ళినప్పుడు, ఆ ప్రాసాదంలోని పెక్కు గదులను సర్దుతున్నారు. ''గడచిన యుద్ధంలో నాజీ సైన్యాలు ఈ రమ్యమైన కోటను పట్టుకున్నాయి. అక్కడ వున్న పెక్కు శిల్పాలను ధ్వంసం చేశాయి. నాజీలు ముందుకు వస్తున్నారని తెలిసిన వెంటనే, అక్కడున్న శిల్పాలను రష్యావారు అక్కడక్కడ పూడ్చిపెట్టి కాపాడుకున్నారు. అయినప్పటికి పెక్కింటిని నాజీ సైనికులు తీసుకుని పోయారు. మళ్ళీ ఇవులేదు.'' అని వారు మాతో అన్నారు.

లెనిన్‌గ్రాడ్‌లో ఆరాత్రి కామరాజ్ కు అధికార పూర్వకమైన విందు జరుపబడింది. విందు జరిపిన ఉపమేయర్ తన ప్రసంగంలో, లెనిన్‌గ్రాడ్ నగరం గొప్పదనాన్ని, ఆ నగరవాసుల సాహస పరాక్రమాలను, త్యాగాలను, వివరంగా తెలిపారు. భారత ప్రజలకు, రష్యా ప్రజలకు వున్న పరస్పర సౌహార్దం ఇతోధికంగా దృఢతరం కావాలని అన్నారు. యుద్ధంవల్ల చెప్పలేనంత కష్టనష్టాల పాలయిన లెనిన్‌గ్రాడ్‌వాసులు ఇక ప్రపంచంలో యుద్ధమే జరుగరాదనే విషయమై ఎక్కువ శ్రద్ధ చూపుతున్నారని, యుద్ధరాక్షసులనే ప్రపంచం నుంచి తరిమివేయాలని వారు దృఢసంకల్పంతో వున్నారని కూడా అన్నారు. ''మీరాక మాకు చాల సంతోషం కలిగించింది'' అని చెప్పి, ఆయన తన ప్రసంగం ముగించారు.

కామరాజు దానికి సమాధానం చెబుతూ, ''ప్రపంచ ప్రఖ్యాతి పొందిన నగరాలలో లెనిన్‌గ్రాడ్ ఒక్కటి. అక్కడ ఆరంభమైన విప్లవం ఒక్క సోవియట్ దేశానికే కాక, ప్రపంచంలో దాస్యం పొందిన దేశాలన్నిటికీ నూతన చైతన్యాన్ని పోసింది'' అన్నారు. తర్వాత ''మా తమిళనాడులో మా ప్రియ నాయకుడు లెనిన్‌కు చాల గౌరవమర్యాదలున్నాయి. మా తమిళ అమరకవి భారతి రష్యా విప్లవాన్ని గురించి తమిళ వాఙ్మయంలో స్థానం పొందిన కవితలలో వర్ణించారు.'' అని కామరాజ్ ప్రసంగించి, భారతి పాడిన ఆ కవితలోని ''ఆహా వైను ఎళుందు పార్, ఒర్ యుగప్పురట్చి! కొడుంగోలన్ అలరి వీళ్‌న్దాన్'' (ఆహా అని లేచిచూడు, ఒక యుగవిప్లవం! ఘోర కిరాతకుడు అరచి పడిపోయాడు) అనే పంక్తులను ఉదాహరించారు. ''లెనిన్ జరిపిన విప్లవం ఒక సామాన్యమైన రాజకీయ విప్లవంకాదు. సాంఘిక ఆర్థికరంగాలలోను వున్న బానిసతనాన్ని నాశం చేయడానికి ప్రారంభించిన మహా ప్రయత్నమది. ఉత్తమ దేశభక్తి, త్యాగబుద్ధి పొందిన మీరు వేయిరోజుల్ని ముట్టడి జరిగినా, లక్షల కొలది జనం మరణించినా, వంగిపోక నడుమెత్తి నిలబడి, దేశం మానాన్ని కాపాడడం నా మనస్సును కరిగించి వేసింది. ఈ కష్టనష్టాలు అనుభవించిన మీరు ప్రపంచశాంతి కోసం పాటుపడడం స్వాభావికమే. మాదేశప్రజ పురోభివృద్ధి పొందడానికి, సమధర్మ సమాజం, ఏర్పడడనికి ప్రపంచశాంతి అవసరమని మేము గూడ భావిస్తున్నాము. ఉభయ దేశాలూ సౌహార్దంతో సత్సంబంధంతో మనుగడ సాగించడం మూలంగా ప్రపంచ శాంతిని స్థిరపరచడానికి ఒకదాని సరసన మరొకటిగా నిలబడుదామనే నిశ్చయాన్ని తెలుపుతున్నాను'' అన్నారు.

ఆరోజు కామరాజు చెప్పినమాటలు అక్కడున్న వారందరి మనస్సులను పులకితం చేశాయి. సాధారణంగా విందులలో చెప్పే సంప్రదాయపు మర్యాద మాటలుగా లేవవి. నిజంగానే కామరాజ్ మనస్సు పొంగి, ఉల్లం ఉల్లసిల్లి మాట్లాడుతున్నారని రష్యన్ మిత్రులు నాతో అన్నారు.

భారతియార్ రష్యా విప్లవం గురించి చెప్పిన ఆ కవితను రష్యా భాషలో అనువదించినట్టు, ఆయన గేయాలు రష్యా ప్రజలకు బాగా అలవాటయినవేనని వారు తెలియజేశారు. కామరాజు తమ లెనిన్‌గ్రాడ్ ఆగమన చిహ్నంగా, తంజావూరు పనితనం వున్న ఒక గిన్నెను ఉపమేయరుకు బహూమతి చేశారు. ఆ చిన్నగిన్నెలోని పనితనాన్ని చూచిన రష్యా ప్రజలు, ''ఇంతటి కళానైపుణ్యం వున్న మీ దేశప్రజలు పరిశ్రమ రంగంలో ముందంజ వేస్తారనడంలో సందేహమే లేదు'' అన్నారు.

(సశేషం)

—అనువాదం: తి. రా.

(ఆనందవికటన్ సౌజన్యంతో)



బిన్నీవారి అచ్చమైన సిల్కుచీర

ఏ సన్నివేశమైనాసరే అందంగా ఉంటుంది


బిన్నీవారి సహజమైన అసలు
సిల్కు మార్దవము శుద్ధమైన నేత
అసమానమైనవి.
ముచ్చటైన రంగులలో
నమూనాలలో వచ్చినవి
తీసుకోండి.

సిల్కుచీరల శ్రేణి: జార్జెట్,
మెత్తని సిల్కుచీరలు, సౌనజాషాట్
సిల్కుచీరలు స్పన్ మరియు,
సాదా సిల్కు షర్టింగులు
సూటింగు, దోవతులు,
అంగవస్త్రములు.

బిన్నీ సిల్కులు ఎక్కడ కొన్నాసరే
ఈ ట్రేడు మార్కును గుర్తించండి

బెంగళూరు ఉల్లన్. కాటన్ & సిల్కుమిల్లు
కంపెనీ లిమిటెడ్ అగ్రహారం రోడ్డు,
బెంగళూరు-12.

బిన్నీ-బట్టలకు పెట్టినది పేరు



'ఆస్తిపరులు'లో జేబీపద్మిని, నాగేశ్వరరావు

చిత్ర సమీక్షలు

ఆస్తిపరులు

ఒకానొక చిత్రంలో కథ, సన్నివేశం లేదా ఒక టెక్నిక్ కోసం జనం విరగబడి పోతు న్నారంటే చాలు, అది కొన్ని మార్పులు చేర్పులతో తగిలించుకుని వరసగా కొత్తగా వచ్చే చిత్రాలన్నింటిలోనూ కన్పిస్తూ వుంటుంది. సెల్యులాయిడ్ అనుకరణ సహా జాతంలో కొత్త పాతల మేలు కలయిక— ఒక నూతనత్వాన్ని, కల్తీరింపుల్లో నిత్య నూతనత్వాన్ని ప్రసాదిస్తూ వుంటుంది. అనుకరణ అనడానికి ఆస్కారం లేకుండా అనుసరించడం సులభసాధ్యమైందేమీకాదు ఇక్కడే చెయ్యి తిరిగిన దర్శక, నిర్మాతల ప్రతిభ బయటపడేది ఆస్తిపరులు రివ్యూ చూసింతర్వాత కొంతమంది 'ఫేస్ ది క్రుకెడ్ షేడ్ చూశావా అంటే చూశావా..' అని పలకరించుకున్నారు! ప్రయోజనాత్మక మైన చిత్రాలు తీసి ప్రజల్లో మంచిపేరు తెచ్చుకున్న సంస్థ జగపతి పిక్చర్స్ నిత్యనూత నత్వం కోసం ఈ సంస్థ ఎప్పుడూ కృషి చేస్తూనే వుంటుంది.

'బాబీ'ని బాగు చేద్దామనుకుని, అలవి కాక ఆతన్ని తన పెద్దకొడుకు కృష్ణకు అప్పగించి కళ్ళు మూస్తాడు జమిందారు. బాబీ ఇష్టంవచ్చినట్టు తన ఆస్తిని తగల పెట్టడానికి వీలు లేకుండా ట్రస్టీగా అన్నగారు కృష్ణ వున్నాడు. బాబీ చిన్నప్పటి నుంచి కృష్ణను చంపాలనే చూస్తున్నాడు! ఆస్తికోసం తండ్రిని చంపడానికే ఉద్యుక్తుడైన అతనికిదే మంత కష్టమైన పనికాదు మాయోపాయం చేత కృష్ణను నమ్మించి నీళ్లలో ముంచి చేతులు కడిగేసుకున్నాడు బాబీ. కృష్ణ బ్రతికి వచ్చాడు. నమ్మలేని బాబీ అతనికి సవాలక్ష పరీక్షలు పెట్టి కృష్ణను నమ్మకద్రోహిగా చూపిస్తాడు. కృష్ణ తను కృష్ణనే అని ఇంటిల్లిపాదినీ నమ్మించ డానికి ఒక నగలపెట్టె రహస్యాన్ని బయట పెడతాడు. బాబీని క్షమించి దగ్గరకు తీసుకున్నాడు కృష్ణ. బాబీ ప్రతిపనిలోనూ సవతి తమ్ముడు అని తెల్పనవుతూనే వుంటుంది

కృష్ణగా నాగేశ్వరరావు చక్కగా నటించారు. బాబీగా జగ్గయ్య ఆయన అవధుల మేరకు బాగానే చేశారు కృష్ణకు కాబోయే భార్య రాధగా జయలలిత తెనుగుతనంలో కొత్తదనమూ, నటనలో పటుత్వమూ వుంది. జమిందారుగా గుమ్మడి హుందాగా నటించారు. రేలంగి గిరిజల జంట మరో ఆకర్షణ. ఈ చిత్రానికి నిండుతనం తెచ్చిన ఇతర పాత్రల్లో సూర్యకాంతం, జి. వరలక్ష్మి, చదలవాడ, నాగయ్య, వాణిశ్రీ, బేబీ పద్మిని మొదలైనవారున్నారు.

కె. వి. మహాదేవన్ సంగీతం విన సొంపుగా వుంది కూర్పులో నేర్పు చూపిస్తే బాగుండేది. సంభాషణల్లో బిగువు కన్పిస్తుంది. కెమెరా పర్క్ కొన్నిచోట్ల సంతృప్తికరంగా వుంది అవుట్ డోర్ చిత్రీకరణ ప్రత్యేకత. సెట్ డెకరేషన్‌తో ఉత్సాహమైన కృషి కన్పిస్తుంది. వ్యయప్రయాసల కోర్చి తీర్చిన ఈ చిత్రానికి దర్శకుడు వి మధుసూదనరావు, నిర్మాత వి. రాజేంద్ర ప్రసాద్. ●

కన్నెపిల్ల

కౌముది పిక్చర్స్‌వారి 'కన్నెపిల్ల' చూడ ముచ్చటైన చిత్రం అనువాద చిత్రమైనా, అనుమానం లేకుండా జనాదరణ పొందుతుంది. అందుకు కారణం కుర్రకారు నాకర్షించగల కథాగమనం, కళ్ళకు నిండైన చిత్రీకరణాను.

తాతగారి జబ్బు నయం కావడానికి మనవరాలు పెళ్ళవాలి. తాతగారు తెచ్చిన సంబంధాలు మనవరాలికి నచ్చవు. జబ్బు నటించిన తాతగారికి పెళ్ళికొడుకు నొకళ్ళి ఎన్నుకున్నానని చెప్పింది మనవరాలు. దూళ్ళ కాపరినొకళ్ళి బస్తీ బాబులా చేసి తాతగారికి చూపించింది. కేవలం తాతగారి జబ్బు నయమయేందు కోసమే మనవరాలలా చేసినా, దూళ్ళకాపరికి హృదయాన్నర్పించేసింది. అంతలో కథ అడ్డంతిరిగి మళ్ళీ మొదలై చివర్లో సుఖాంతమై పోతుంది.

ముఖ్యపాత్రల్లో యస్. వి. రంగారావు, జయలలిత, రవిచందర్, నాగేష్, మనోహర్ వున్నారు అవిపెట్టి తెలుగు చేసిన సంభాషణలకి ఎరువిచ్చిన అప్పారావు కంఠం సరిగ్గా అమరింది వల్లం నరసింహారావు, వసంతకుమార్, పార్వతి కూడా చక్కని కృషి చూపించారు. దర్శకత్వం రామన్న. తెలుగు చిత్రం నిర్మాతలు యస్. సుందర భానుమూర్తి, దశరథరామిరెడ్డి.

—ఎ. కనకాంబరరాజు ●



అమృతాంజనం

వాడి శీఘ్రంగా నివారణ పొందండి

స్థానికంగా ఉండే బాధను నివారించుకోడానికి లోపలికి మందులు ఎందుకు పుచ్చుకుంటారు? నొప్పిఉన్న చోటుమీద అమృతాంజన్ రాసి అమోఘంగా శీఘ్రంగా నివారణను పొందండి. ఏ అపాయం లేకుండా కండరాల నొప్పులకు, తల నొప్పికి, బెణుకులకు ఇంకా కీళ్ల నొప్పులకు అమోఘంగా గుణమిచ్చే అమృతాంజన్ 10 రకాల ఔషధాలు చేరిన మందు. అమృతాంజన్ గుండెజలుబుకే కాక సాధారణ జలుబులకు కూడా మంచి మందు. కొంచెంకొంచెమే ఉపయోగించవలసి ఉంటుంది కాబట్టి ఒక సీసా మీ కుటుంబానికంతాకలిసి నెలల తరబడి వస్తుంది.

అవసరానికి ఎప్పుడూ అమృతాంజన్ ఉంచుకోండి. అమృతాంజన్ 70 ఏళ్ల ప్రసిద్ధిని పొందిన నమ్మకమైన గృహఔషధం.



అమృతాంజన్ నొప్పులు జలుబుల నివారణకు 10 రకాల ఔషధాలు చేరిన మందు

అమృతాంజన్ లిమిటెడ్,
మద్రాసు • బొంబాయి • కలకత్తా • ఢిల్లీ

జవాబులు

క) మొదటి వ్యక్తి ఏ జాతివాడైనా తాను హరిశ్చంద్ర జాతివాడిననే చెప్పుకుంటాడు. ఏమంటే, అతడు చండిక జాతివాడైతే విధిగా అబద్ధ మాడుతాడు హరిశ్చంద్ర జాతి వాడైతే నిజమే చెప్తాడు కనుక. మొదటి వ్యక్తి తాను హరిశ్చంద్ర జాతి వాడిననే చెప్పి ఉండాలి కాని అతడు ఏమన్నాడో చరిత్రకారుడికి వినబడలేదు. "తాను చండిక జాతివాడినని చెప్తున్నాడు" అని రెండవవాడు అన్నమాట అబద్ధం అయి ఉండాలి అంటే రెండవవాడు చండిక జాతి వాడన్నమాట రెండవవాడు అబద్ధ మాడుతున్నాడని చెప్పిన మూడవవాడు సత్యమే చెప్పేడు కనుక, అతడు హరిశ్చంద్ర జాతి అయిఉండాలి.


చ) 10 జతలు నీలివీ, 16 జతలు నల్లనివీ ఉన్నాయని లెక్కసాగించావంటే నువ్వు ఓడిపోయినట్లే లెక్క. ఆ పెట్టెలో నీలివీ, నల్లనివీ ఎన్ని జతలున్నా మనకి సంబంధంలేదు. మూడు మేజోళ్ళు తీసు కుంటే చాలు వాటిలో ఏదో ఒకరంగు మేజోళ్ళు రెండు తప్పకుండా ఉంటాయి.

ట) 110 కిలోలు కాదు, 111 1/9 కిలోలు.

త) అన్నదమ్ములు నలుగురు, అక్కచెల్లెళ్ళు ముగ్గురు.

ప) నీటిమట్టం పెరుగుతుంది అన్నవారిదీ తప్పే. నీటిమట్టం మారదు అన్నవారిదీ తప్పే నిజానికి నీటిమట్టం తగ్గుతుంది! ఆర్కిమిడేసు సిద్ధాంతం విన్నారు కదా? నీటిలో తేలుతూన్న వస్తువు తన బరువుతో సమానమైన బరువు గల నీటిని తొలగిస్తుందని ఈ సూత్రం చెప్తుంది. గులక రాళ్ళు పడవలో ఉన్నప్పుడు అవి తమ బరువుకి సమానమైన నీటిని తొలగిస్తాయి. నీళ్లల్లో పడినప్పుడు తమ ఘనపరిమాణానికి సమానమైన నీటిని తొలగిస్తాయి. గులక రాళ్ల సాంద్రత నీటి సాంద్రత కన్న ఎక్కువ కనుక రెండవసారి తొలగించబడ్డ నీరు మొదటిసారి కన్న తక్కువ కనుక నీటితొట్టిలోని నీటిమట్టం తగ్గుతుంది.






మదన్-మిత్రా

M & TP Licence No. 76/64-5.

ఆరోగ్యమే మహాభాగ్యం



గాలిలో ఉండే వ్యాధి కారక క్రిములు మన దేహంలో ప్రవేశించడమే మన శరీరఉష్ణం పెరగటానికిగాని, తగ్గటానికిగాని కారణం. ఇందువల్లను, ఇంకా ఇతర అంటువ్యాధులవల్లను మన ఆరోగ్యం చెడిపోయి మన శరీరావయవాలు, లోపలిభాగాలు మామూలుగా పనిచెయ్యటం మాని వేస్తాయి. అలాంటి సందర్భాలలో మనం మన ఆరోగ్యాన్ని పరిరక్షించుకొనక శరీరావయవాలను బలవంతంగా పనిచేయింపిస్తే అప్పుడు అవి ప్రమాదకరమైనవిగ పరిణమిస్తాయి. మీ ఆరోగ్యాన్ని కాపాడుకొనేందుకు, తిరిగి పొందేందుకు దేహానికి టిస్యూలకు బలమిచ్చేందుకు, బరువు పెంచేందుకు, బలం సంపాదించేందుకు ప్రకృతిసిద్ధంగా సన్నగా ఉండేవారు, బరువు తక్కువగా ఉండేవారు కూడ "మదన్-మిత్ర" వాడతారు.

మీ మనశ్శక్తిని, శరీరదార్ఢ్యతను కాపాడుకునేందుకు, తిరిగి పొందేందుకు అనేక కారణాలవల్ల పరిస్థితులవల్ల పోగొట్టుకొన్న యవ్వనశక్తిని తిరిగి పొందేందుకు **మదన్-మిత్ర**ను వాడండి.

మదన్-మిత్ర

ఇది అలసట, అరుచి, అజీర్ణం, అవయవములు మొద్దుబారటం, నిద్రలేమి, నాడీదౌర్బల్యం, మలబద్ధం, కడుపునొప్పి, బలహీనత, ప్రమేహం, రొమ్ముకొప్పి, ఆకలిమందగింపు, అధికదప్పిక, ఇత్యాది అన్ని రొమ్ముకొప్పి రుగ్మతలను నివారించి అవయవదార్ఢ్యతను సమకూర్చి శరీరానికి ఎక్కువబలం, రంగు, బరువు లిస్తుంది. **మదన్-మిత్ర** ధాతువుని పెంచి, శరీరబలాన్ని తిరిగి నిర్మించి అందమైన ఆకర్షణీయమైన వర్చస్సు నిస్తుంది.

ఆరోగ్యాన్నికాపాడే, తిరిగి చేకూర్చే, వ్యాధులను నిర్జించే పటువైన అనేక విటమిన్లుగల శక్తివంతమైన 60 కి పైబడిన ఆయుర్వేదమూలికలతో కూడినది **మదన్-మిత్ర**.

మదన్-మిత్ర అలసట పనిభారముచేత, క్రమమైన అలవాట్లు లేకపోవటంచేత అకాలంగా పెద్దవయస్సు లక్షణాలు పొందటం మొదలైన అన్ని దౌర్బల్యాలకు మేలైనది. పటువైన ఔషధగుణాలతో నిండిన **మదన్-మిత్ర** సేవించటానికి రుచికరమైనది. పత్యనియమాలు లేవు. వెల: 450 గ్రాములు 40 దినముల మందు రు. 10/-లు. వి. పి. పి. ఛార్జి అదనం. మీకు కావలసినదానికి వెంటనే వ్రాయండి.

ఈ మందుగుణం బహు కొద్దికాలంలో కనిపిస్తుంది. ఏమంటే అనేక విటమిన్లు, అనేక ఫలాలు ఇందులో చేరిఉన్నాయి. మదన్-మిత్రలోగాని **వనితామృతం** జంతుకొవ్వులు, మత్తు పదార్థాలు చేరలేదు. కాబట్టి దీన్ని వాడేప్పుడు శరీర వ్యాయామం చెయ్యనవసరంలేదు.

వనితామృతం

ఇది బలహీనమైన స్త్రీల శరీరదార్ఢ్యతను చక్కబరచి, లావణ్యాన్ని, వర్చస్సును సంపాదిస్తుంది. ఇది అలసట, రక్తహీనత, అగ్నిమాంద్యం, **అజీర్ణం**, బలహీనత, మలబద్ధం, దిమ్మ, స్రావం, కడుపునొప్పి, నరాలదౌర్బల్యం, స్వహస్తపతనం, యుదాలోభం, వికారం, పనిమీద అయిష్టత, దాహం, పాలిపోయిఉండటం, మొదలైన గర్భిణీసమయంలోను, ప్రసవానంతరం, బుతు సమయాలలోను కలిగే రుగ్మతలను పోగొట్టి శరీరానికి బలాన్ని, వర్చస్సును ఇస్తుంది. ఇది బుతుక్రమాన్ని చక్కబరచి బహిష్టు బాధలను తొలగిస్తుంది. గర్భిణీస్త్రీలువాడితే సుఖప్రసవానికి తోడ్పడుతుంది. స్త్రీల ఆరోగ్యాన్ని కాపాడేందుకు యువ్వన పాటవాన్ని తిరిగి చేకూర్చేందుకు **వనితామృతం** చలమంచి ఔషధం. పత్యం లేదు. 450 గ్రాములు 40 రోజుల మందు వెల : రు. 10/- వి. పి. పి. ఛార్జి అదనం. ఉత్తరములు ఇంగ్లీషులో వ్రాయండి.

——: హెడ్డాఫీసు ——

MADAN—MITHRA AUSHADALAYA, P. B. No. 44, PALGHAT (KERALA)

Edited, Printed and Published by S. Radhakrishna at the Andhra Patrika Press; 6 & 7, Thambu Chetty Street, Madras-1. Chief Editor: S. Sambhu Prasad.



విజయరాణి

'అందమైన ముఖవర్చస్సునకు

ఎక్కువ కాలం నిలిచే పరిమళమునకు

రెమి ®

టాల్కమ్ పౌడరు

Manufacturers: REMY PERFUMS PRIVATE LIMITED,
263, Thambu Chetty St., Madras-1.